# సమాలోచనం

## సాహిత్య వ్యాసాలు

మాదిరాజు రంగారావు

**2019**

రసదుని సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్ - **28.**

# SAMALOCHANAM VYASALU (ESSAYS)

by
Prof. Maadiraju Ranga Rao

Copy right : Dr. M. Santhosh Kumar

First Edition : 2006
Second Edition : 2019

Price Rs. 30/-

For Copies :
**Nava Chetana Book House**
Bandlaguda, Nagole
Hyderabad - 500 068

**Navodaya Book House**
'X' Roads, Kachiguda,
Hyderabad - 27.
Ph : 040 - 24652387

Printed at
**Anupama Press**
Shantinagar, Hyderabad - 28
Ph: 040-23391364

*Presented*
*to my daughter*
*Prof. M. CHARITHA USA*
*on her Birthday*
*June 11*
*with blessings*

## సూచిక


1. రవీంద్రుని గీతాంజలి – అనుభూతి కళ ................. 1
2. అరవిందుల సావిత్రి ........................................ 7
3. రాయప్రోలు నవ్య కవిత్వ వ్యక్తిత్వం ...................... 10
4. అహంకార కళ – అభివ్యక్తి శిల్పం....................... 19
5. జాషువా ఆధునిక కవిత్వ వ్యక్తిత్వం ..................... 24
6. మహైక – కవిరాజు మూర్తి అభ్యుదయ దృష్టి.......... 30
7. అవధానం – ఒక కవిత్వ క్రీడ .......................... 37
8. పోతన భాగవతం – భూమిక ........................... 39
9. సీతారామాంజనేయ సంవాదం – కవిత్వ స్ఫూర్తి...... 46
10. స్ఫోటం – ధ్వని సిద్ధాంతం .............................. 55
11. అమృత స్పర్శ – ఆత్మ తత్త్వం .......................... 59
12. మానవుని కీర్తి శిఖరం – భగవద్గీత..................... 61
13. ఉపనిషద్భావన – ఈనాటి అవసరం.................. 65
14. సౌందర్యలహరి శక్తి తత్త్వం ............................. 68
15. డెరెక్ వాల్కాట్ – నోబెల్ బహుమతి గ్రహీత .......... 76
16. అంతరంగం – ఇంటర్వ్యూ............................. 80

# (1) రవీంద్రుని గీతాంజలి - అనుభూతి కళ

రవీంద్రనాథ్ ఠాగూర్ 'గీతాంజలి' 1912లో వెలువడింది. 103 ఖండికల కృతి బెంగాలి భాషనుండి చేసిన అనువాద సంపుటి. దీనికి 1913ల నోబెల్ బహుమతి ప్రదానమైంది. బెంగాలి మూలంలో 14 పంక్తుల 'సానెట్'ను తలపించే గీతాలు, ఇంగ్లీషు అనువాదంలో స్వేచ్ఛా కృతులుగా వెలిసాయి. ఈ సంపుటి, గీతాంజలి, కవిత్వంలో మానవీయ రేఖలతో దివ్యభావనా స్పర్శతో కళా సౌందర్యాన్ని కలిగింది. ఏ సిద్ధాంతాన్నో ఆదర్శాన్నో వివరించడమో ప్రబోధించడమో కాకుండా, కేవలం దివ్యమైన అనుభూతి పారమ్యంతో వెలసింది. ఇది భగవన్మయమైంది, ఆధునిక కాలంలో భారతీయ కవిత్వ కళ దిశను మార్చివేసింది.

'గీతాంజలి' గీతాల దోసిలి. దోసిలి నిండుగా భగవంతునికి గీతాల నివేదనమే గీతాంజలి. ఇది అనేక భావ చిత్రాల పరంపరతో నివేదితమయింది. ఎవరికి వారు తమ సంస్కారాన్ని బట్టి ఆ స్థాయిలో అనుభవించడం జరుగుతుంది. ఇది భక్తి భావ బంధురమయింది. ఇదో ఆత్మ నివేదనా ప్రపంచం. తెలుగు కవిత్వంతో సంప్రదాయ మార్గంతో భక్తి నిలయాలైన శతకం స్తుతి స్తోత్ర రూపాలు వచ్చాయి. వీటిలో వస్తువు ఏదో ఒక భగవన్మూర్తి నాశ్రయించింది. కొన్ని పరిమితుల్ని పొందింది. ఆత్మాశ్రయమూ చోటు చేసుకోవడమూ ఉంది. అయితే గీతాంజలిలో అమూర్తమైన దివ్య చేతన ఆత్మాశ్రయ ప్రపంచంలో అనుభూతికి వస్తుంది. ఇది మనోగతంగా బహు సూక్ష్మగతుల్ని పొందింది. అక్కడక్కడా భక్తి విషయంలో సంప్రదాయంలోని, స్మరణం, కీర్తనం, సఖ్యం, వందనం, సేవనం, ఆత్మ నివేదనం మొదలుగా భావనాలోకం మెరుస్తుంది.

భగవంతునికి భక్తునికి గల అనుబంధాన్ని పరిపరివిధాలుగా విశ్వభావనా సమర్పకంగా భావిస్తుంది. అనుభూతి గాఢత్వంతో అర్థాంతర ప్రకాశనమూ విశేషంగా ఆకర్షిస్తుంది. ఇది కవితా కళకు సంబంధించిన విలువల్ని పెంచుతూంది.

గీతాంజలి ఇరవయ్యో శతాబ్దిలో వచ్చిన భారతీయ సాంస్కృతిక ఉజ్జీవనానికి ప్రేరక శక్తిగాను నిలిచింది. ఒక కొత్త అనుభవ స్పందనకు ప్రతీకగానూ ప్రశస్తి పొందింది. ప్రపంచ తలంపై భారతీయ చింతనకూ సంస్కరణ రూపానికీ దర్శన భావానికీ ప్రాతినిథ్యం వహించింది. పాశ్చాత్య ప్రభావంలోని గుణాత్మకతను స్వీకరిస్తూ సంప్రదాయ మూలాల్నీ మన్నించే సంస్కృతిని స్థాపిస్తుంది. ఇది విశ్వభావనతో అనుభూతి దృష్టితో, ఆధునిక సమాజంలో విద్యావంతుల్ని సాహిత్య ప్రియుల్ని ఆకర్షించింది.

ఇందులో పరమమైన దివ్యచేతన భగవత్ప్రేమతోనూ మానవీయ రూపం నిఖిల మానవ ప్రేమతోనూ యోజితమయినాయి ఉన్నతమైన భావ జాలంలో కల్పనా

రామణీయకతను పొందింది. బెంగాలి మూల రచనలోని భాషా సౌందర్యం సంగీతాత్మ ఈ అనుసృజనలో రాలేదన్న అభిప్రాయం ఉన్నప్పటికీ, ఇంగ్లీషులో భాషా ప్రవాహకతతో పాటు ఇతరమైనదీ భావ సౌకుమార్యం మానవీయ చేతన ఆత్మతత్త్వం అనుభూతి సాంద్రత నిలిచే ఉన్నాయి.

ఒకవైపు నుండి భారత స్వాతంత్ర్యోద్యమం మరోవైపు నుండి రెండో ప్రపంచ యుద్ధ వాతావరణంలో, జాతీయ భావన పట్ల నిబద్ధత, ప్రపంచ శాంతిని కోరే మానవతా వాదిగా కవి దర్శనమిస్తాడు. ఉపనిషన్మూలకమైన శాంతి మంత్రానికీ, ఉపదేశ గతమైన ఉదార వర్తనకూ, సారథ్యం వహిస్తాడు. కవి సృజన ప్రయోగం ఆనాటి పరిస్థితుల్లో భగవద్భావనలో మానవీయ సూత్రగతంగా వైయక్తికమైన అనుభూతిమయంగా సఫలమయింది. ఈ కృతిని జాగ్రత్తగా పరిశీలిస్తే 1) వైయక్తిక తలంతో పాటు సామాజిక తలమూ, సంవేదనకూ సంక్షోభానికీ అశాంతికీ గురి అయిన స్థితుల నుండి ప్రేమ మానవతా సౌందర్యం ఆనందం శాంతి వైపుకు పరివర్తన కోరే మరోరూపమూ స్పష్టంగా కనిపిస్తుంది. ఇందులో వ్యంజితమయిన అతీత శక్తి దివ్యరూపం అనుభవైక వేద్యమయింది మాత్రమే. ఇది పై స్థాయిలో నిరాకారమైన అవ్యక్తమయిన అనుభూతి రూపాన్ని పొందింది. భావచిత్రాల పరంపరలో దర్శన సుందరంగాను తీర్చబడింది. ఇదీ దేశంలో ఎదిగిన సంస్కృతీ తేజాన్ని ప్రతిఫలిస్తుంది. మానవీయ రేఖలతో జీవన మర్యాదలతో తాత్త్విక స్పర్శను పొందింది. ఇందులో మానవ విశేష శక్తి వివిధ స్థాయిల్లో చిత్రితమయింది.

అణువు నుండి బీజం, బీజం నుండి మొక్క, మొక్క నుండి వృక్షం, వీటితో మహావనం ప్రకృతి చిత్రణం, నాగలితో భూమి దున్నే కష్టజీవీ, మండుటెండలో రాళ్ళు కొట్టే శ్రామికుడు వాస్తవ జగత్తును చూపుతాయి. 1) ప్రకృతి విలసనం, 2) మనిషి జీవితం, 3) సమాజ దర్శనం, 4) దివ్య దర్శనం అంచెలు అంచెలుగా శక్తి ప్రకటనం నుండి జగద్రహస్య ప్రకాశనం దాక, పర్యాప్తమైనాయి. పరమమైన అర్థంతో లక్ష్యం అవగతికి వస్తుంది. మొత్తం మీద ఒక మహనీయమయిన అనుభవ దర్శనం ప్రాప్తిస్తుంది. భూమిని దున్నే చోట భగవంతుడున్నాడు, ("The God is there where the tiller is tilling") అన్న భావన యథార్థ జీవితాన్ని దివ్య సూత్రంతో ముడివేస్తుంది. ఇట్లా అనేకం దర్శనమిస్తాయి. ఇదో పార్శ్వం.

2) ఇందులో మానవ జీవితంలో భౌతిక శక్తికీ అతీత శక్తికీ మధ్యనున్న అనుబంధ మానవ దశలు, అనుభూతి రూపాలు దర్శనమిస్తాయి. ఇవి తాత్త్వికంగా, భక్తి భావనతో మార్మికచ్ఛాయల్ని పొందడమూ గమనించవచ్చు. అయితే ఇవి కళాత్మకంగా కవితా సౌందర్యంతో సమాహితం కావడం గొప్ప విషయం, ఆయా సందర్భాల్లో వ్యక్తి చేతన నుండి విశ్వచేతనకు పయనించే తాత్త్విక పథమూ ఆలోచనకందుతుంది. ఈ ప్రపంచంలో

మనిషి తన జీవితాన్ని తనలో ఉన్న సృజన శక్తి చేత వివేకం చేత సాధన చేత విజ్ఞానం చేత, ప్రయత్నం చేత ఫలవంతంగా ప్రయోజనాత్మకంగా తీర్చి దిద్దుకోవచ్చునన్న విశ్వాసము అవగతికి వస్తుంది. ఈ భూమికపై 'గీతాంజలి' సౌందర్య దృష్టి అనుభూతి సాంద్రత, భావనా వైచిత్రి దర్శన శక్తితో కళాకృతిని పొందింది. కవితాత్మ వీటిచేత సంప్రాసార (ట్రాన్స్‌పరెంట్) స్థితిని పొందింది. ఇంతకు ముందు కవితా ప్రపంచంలో ఉన్న దానికన్నా కొత్త అంశాల సమీకరణ రూపం ఆవిష్కృతమయింది. సహృదయుల్ని ఆకర్షించింది.

మరో విషయం ఏమంటే సాధారణ మానవ తలంపై నిలిచే మూర్త రూపాన్ని అధిగమించి అమూర్తమైన అవ్యక్తమైన దివ్య శక్తి భావనా జగాన్ని ఆవహించింది. ఇది ఆర్ద్రత మరియు వేదనా గుణాలతో స్పందించడం ఇందులో ప్రత్యేకత. దీన్ని కాస్త వివేచన చేస్తే భౌతిక జగం, మానసిక జగం, తాత్త్విక జగం మూడు కలిసిన త్రిపుటి, గీతాంజలిలో వివిధ స్థాయిల్లో అనుభూతమవుతుంది.

ఈ కృతిలో భగవంతుడు జీవన దాత! మహా ప్రభువు! కృపాళువు! చైతన్యమయుడు! విశ్వాత్మ! పాలనాచణుడు! భారవహుడు! మానవ జీవితంలో, విశ్వంలో అపరిహారణీయ శక్తిగా! గోచరిస్తాడు. మనిషిలో సంకల్పబలం వల్ల అనుభూతి గుణం వల్ల ఆలోచనా పథం వల్ల సంస్కార శోభవల్ల ఉన్నతమైన లక్ష్యంతో సాధన చేత పరిపూర్ణత వైపు పయనించే అవకాశముంది. దీని వర్ణనం చిత్రణం దర్శనం రచనలో స్ఫుటంగా కన్పిస్తుంది.

Truth is hidden behind the golden veil - సత్యం స్వర్ణపటం (బంగారు తెర) వెనుక దాగి ఉంది, అన్న భావన ఉపనిషత్తులో “హిరణ్యయేన పాత్రేణ సత్యస్యాపిహితమ్ ముఖమ్” అన్న మంత్రార్థానికి సన్నిహితమైంది. సత్యం యొక్క అన్వేషణ దాని కవరోధంగా ఉన్న ఒక ఆకర్షణీయ స్థితి సూచితం. ఇంద్రియ ద్వారాల్ని సరిగా తెరవడం చేత సత్యం కనిపించే స్థితి దివ్యమైందీ, అసాధారణమైంది కూడా. "The joy in me so full" Thus it is that thou hast come down to me I never shut the doors of my senses" ఇది ఆనంద పూర్ణమైంది, చేతనాత్మకమైంది.

మనుషులకు ప్రపంచానికీ మధ్య నున్న సంబంధం సమాజానికి అవసరమైందీ, మనిషికి ప్రియమైంది. దీనితో చేకూరే మనిషి అస్తిత్వమూ మహనీయమైంది. "I dont want to die in the beautiful world, I want to live in the midst of men" మనుషుల మధ్య మనుషులతో సజీవ ప్రపంచం స్నిగ్ధమైంది, చిరమైందీ.

మనిషి జీవితంలో వాస్తవ ప్రపంచం, అభౌతికం ఆధ్యాత్మికం శ్రేణుల్లో నుండి కవి అభియానం, ఆనందంలో పుట్టి, ఆనందంలో పయనించి, ఆనందంలో కలిసే లక్షణం కన్పిస్తుంది. ఇది హృదయానికి సంబంధించిన ఆర్ద్రభావనతో కూడింది. ఆత్మకు

సంబంధించిన శాంత భావనకు దారితీస్తుంది. అన్ని కాలాల్లోను అన్ని దేశాల్లోను అందరినీ ఆకర్షించే ప్రభావితం చేసే ప్రకృతినుండి, అందరినీ వశం చేసుకునే విశ్వమానవీయంతో సంపన్నమయింది. ఈ అంశం గీతాంజలి కావ్యానికీ విశాలమైన బృహదాకృతిని భావింపచేస్తుంది. ఇది స్వేచ్ఛాపూర్ణమైనది. "Into that heaven of freedom! My God! Let my country awake". ఆ స్వేచ్ఛా స్వర్గంలోకి, భగవంతుడా నా దేశాన్ని మేల్కొల్పు అన్న భావన భౌతికేతరమైన మనోమయమైన స్ఫూర్తితో జాతీయ భావన సంప్రేరితమయింది. ఎక్కడ ఇరుకు గోడలతో సంకుచితమైన అవరోధాలతో ముక్కలు కాలేదో! ఆ స్వేచ్ఛా జగం విశ్వజనీనమైందే కాక, ఆదర్శరూపమైంది కూడా!

మనిషి జీవితంలో చుట్టూ ఉన్నా ప్రపంచం గురించి లోకహిత దృష్టితో అశాంతి నుండి శాంతికి ఖండ ఖండం నుండి పరిపూర్ణత వైపు! ప్రయాణ రూపమే గీతాంజలి. ఇది ఆధునిక యుగంలో వ్యక్తి భౌతిక వికాసంతో మానసిక చేతనంతో, ఆత్మదర్శనమూ కోరేదీ అయింది.

**(2)**

ఠాగూర్ గీతాంజలిలో, కవిలో అంతర్నిహితమయిన సంగీత భూమిక మరో పార్శ్వం. ఆరంభంలోనే, ఈ చిన్న వేణువును వహిస్తూ నిత్యమూ కొత్తగా మధురమయిన సంగీతాన్ని ఊదుతూ కొండల్లో లోయల్లో చరిస్తావు "The little flute of a reed, thou hast carried over hills and doles and has breathed through it melodies eternally new" అంటాడు. ఇది మొదటి గీతంలో తటస్థపడే సంగీత భూమిక. వేణువు ప్రకృతిలో భాగమైంది. ప్రకృతి ప్రసాదించింది. సహజమైన సంగీత సాధనం. వెదురు ముక్క నవయోగాన్ని పొందిన రూపం. ఇది తొలచిన రంధ్రాలతో సప్త స్వరాల సమాకలనంతో ఊదబడిన ధ్వనిచేత గాన స్వరూపాన్ని అనుభవింప జేస్తుంది. శరీరానికి వస్తే సప్త ధాతువులతో వాటి కలయికతో, జీవ రూపం ఆయువుకు కారణమైన స్థితి ఏర్పడుతుంది. మేణువు ఆయుఃపూర్ణమైన మధుర జీవితానికి ప్రతీక. ఇది భగవధీనమైంది. ప్రకృతి – మానవజీవితం – దివ్యశక్తి మూడింటి నిర్వ్యాజమైన అనుబంధాన్ని స్థాపిస్తుంది.

యుగాలు గడిచిపోతుంటాయి. ఆ మధు ధార ప్రవహిస్తూనే ఉంటుంది. ఎంత నిండినా ఇంకా పాత్రలో అవకాశం మిగిలే ఉంటుంది! చిత్రంగా ఎంత కాలం గడిచినా ఆ పాట కొత్తగా ఎప్పటికప్పుడు నూతనంగా మధురంగా మిగిలే ఉంటుంది. ఇది నత్యమైందీ, అవిచ్ఛిన్నమైందీ. ఇది నిరంతరం సాగుతూనే ఉంటుంది. "Ages pass! still thou pourest, and still there is room to fill" మైదానాల్లో అడవుల్లో లోయల్లో ఎడారుల్లో జనపదాల్లో విశ్వమంతటా వేణుగానం వినిపిస్తూనే ఉంటుంది.

జీవితాన్ని సుందరంగా ఆనందంగా అల్లుకొని హత్తుకుంటుంది. ఒక యుగం తరువాత మరో యుగం, ఒక తరం తరువాత మరో తరం, అనంత కాలంపై ఎప్పటికప్పుడు కొత్త పాట వినబడుతుంది ఇందులో భగవంతుని దివ్య కృపాధార సరిస్తూ ధ్వనిస్తుంది. మనిషి జీవిత పాత్ర పరిపూర్ణం కావడం కోసం ఎదురు చూస్తుంది. ఇందులో సంగీత భూమిక, తాత్త్వికతను హత్తుకొని అనుభూతి స్పందనతో ప్రతిఫలిస్తుంది.

కవి భగవంతుని ఒక గొప్ప గాయకుడుగా దర్శిస్తాడు. భగవంతుడు కవిని పాడమని ఆజ్ఞాపిస్తాడు. కవి ఎంతగానో పొంగిపోతాడు. హృదయం అభిమానంతో తొణికిస లాడుతుంది. గర్వంతో అతని హృదయం బ్రద్దలవుతుందా? అనిపిస్తుంది. భగవంతుని వైపు చూస్తాడు. మనస్సు ఉద్వేగంతో విచలితమవుతుంది. కళ్ళలో నీళ్ళు ప్రవహించాయి. ఇదో గొప్ప అనుభూతి! దీని ప్రభావం అనితరమైంది. ఆ క్షణంలో అపస్వరాలన్నీ కరిగి ఒకటై రసమయమై సరించాయి. ఆ సుస్వర మహితమైన స్థితిలో సర్వం విలీనమైన మనోనుభవం ఆవహిస్తుంది. ఈ విశేష స్థితి గీతంలో సుందరమైన భావచిత్రంలో తరంగితమయింది. ఆరాధనాభావం శిఖరస్థాయినందుకుంది. ఇది రెండు రెక్కలు సాచి సాగరంపై ఎగిరే, ఒక మహా సంతోష విహంగంలా ఉంది. ఇందులో భగవంతుని అపారమైన కృపకు పాత్రమైన మానసిక రూపం వ్యంజితం. భక్తునిలో నిరీక్షణం దర్శనం ప్రత్యక్షానుభవం ప్రభావాల పర్యవసానంగా ఆనందం, చివరకు చారితార్థ్య భావనతో భావచిత్రం పరిపుష్టమయింది. ఇది చివరకు ఆత్మోన్నతికి దారితీస్తుంది. "When thou commandest me to sing, it seems that my heart would break with pride / I look thy face and tears come out to my eyes". ఈ మనోనుభవం ఉద్వేగ భరితమైన భక్తితో ఆరంభమవుతుంది. చివరకు స్నేహభావంతో కళాకృతిని పొందింది. ఇందులో కవి సుకుమారమైన సూక్ష్మ సూక్ష్మమైన అనుభూతి ప్రాణితమయింది. ఇది ఆర్ద్రయింది. ఇది ఆర్ద్రమైందీ. ప్రవాహ శీలాన్ని పొందింది. జీవితంలో విషమమైన స్థితుల్ని సమం చేసి సుస్వరతకు దారి తీసేది. మధుర గానమయమై సంగీత భూమికగా నిలిచింది. "All that is harsh and dissonant in my life melts in to one sweet harmony / and my adoration spreads wings, like a glad bird in it's flight across the sea", ఇందులో ఆరాధనా భావం మధురమైన అనుభవంతో కూడింది. విశాల సాగరం పై ఎగిరే సంతోష విహగంతో పోల్చబడింది. భూమికి సంబంధించింది. భౌమం, ఇది భౌతికం. ఇపుడు కవి గాయకుడు ఉన్న స్థితి మనోమయమైంది. ఇది గగనంతో సూచితమయింది. సముద్రుడు జలాధిదేవత. జలం సరసమయమైంది. రసమయం నుండి గగనానికి ఎగిరే అనుభవం మనోమయమైంది. ఆ పై ఆత్మాభిముఖీనమైంది, దివ్యమైంది అవుతుంది. ఇది భౌతికేతరమయింది. భగవద్భావనలో దివ్యదిశను చేరే లక్ష్యం సూచితం. ఇక్కడ పక్షి జీవునికి సంకేతం.

భగవంతునికి ఇతని పాట అంటే మహా ఇష్టం. ఈ పాట పక్షిలా రెక్కలు సాచి ఎగురుతుంది. పైపైకి ఎగురుతుంది. రెక్కల అంచులతో భగవంతుని పాదాల్ని స్పృశిస్తూ పయనిస్తుంది. ఇదో గొప్ప అనుభూతి చిత్రం. శబ్దమయమైన ఆకాశాన, శబ్దసరమైన నాద స్వరంతో సంచరించే దృశ్యం గానాన్ని ఆశ్రయించింది. సంగీత పరమైన లక్ష్యం ఆనందం నిర్దిష్టమైంది. మరో గొప్ప భావచిత్రం, శిఖరభూతమైంది. "I touch by the edge of the far spreading wing of my song thy feet which could never aspire to reach" ఇది తానెన్నడు అనుకుంది కాదు. పైగా అసంభవ మనుకున్నది. ఇప్పుడు పాటలో సంగీత శక్తితో సంభవమవుతూంది. పాట పక్షితో పోల్చబడింది. జీవశక్తితో భగవంతుని చేరే జీవాత్మ ప్రయత్నం సూచితం. ఇక్కడ పాట కవి పొందే అనుభవమూ వేరు కాదు, ఒకటే అయినాయి.

ఈ సందర్భంలో కవి ఒక గాయకుడుగానే భగవంతుని ఆస్థానంలో అస్తిత్వాన్నీ అభిలషిస్తాడు. ఇది మనోమయమైంది. జీవలక్షితమైంది. ఆత్మరూపమైంది. గానరసా నందంతో కవి ఒక గాయకుడుగా భగవద్భావనలో లీనమయ్యే తృప్తి పారవశ్యం ఆపై పొరలో నిలుస్తాయి. ఇక్కడ భగవంతుడు తనకు ప్రభువు అన్న భావన అదృశ్యమై లో పొరలో స్నేహరూపాన్ని పొందడం విశేషం! ఇది సాన్నిహిత్యాన్ని పెంచే సంఖ్య భక్తికి దారితీస్తుంది.

Drunk with joy of singing / I forget my self and all thee friend! who are my Lord" భగవంతునికీ భక్తునికీ మధ్యన ఉన్న అప్రాప్యస్థితి తొలిగింది. స్నేహబంధం ఇరువురిని కలిపింది. ఇరువురి మధ్యనున్న రేఖ అదృశ్యమయింది. కవి గీతాంజలిలో గాయక పాత్రతో భగవంతునిలో ఒకటయ్యే సన్నివేశ కల్పనతో భావచిత్రం అనుభూతమవుతూంది.

“గీతాంజలి” రచన వేదనా ప్రకాశంతో భక్తిమయమైన తాత్త్విక శోభను పొందింది. మానవీయ పార్శ్వానికి వస్తే నిరాకరణ (Negative) దృష్టితో కాకుండా సృజన (Creative) మరియు నిర్మాణ (Constructive) దృష్టితో జీవితం రూపితమయింది. ఉన్నతమైన సకారాత్మక భావనతో ఉదాత్త లక్ష్యానికి దారితీసే కళాత్మక దృక్పథం స్పష్టంగా భాసిస్తుంది. ఈ విధమైన రమణీయ కళాత్మక భావ ప్రపంచానికి ప్రత్యక్ష రూపమే శాంతినికేతనం. ఈ భావ జగత్తుకు దివ్యమైన అనుభూతి చిత్రణమే, గీతాంజలి.

# (౨) అరవిందుల 'సావిత్రి'

అరవిందుల సావిత్రి, తాత్త్వికేతిహాస కావ్యం, శక్తి స్వరూపమైన విశ్వమాత అవతార కథలో ఉదాత్తమైన ఉజ్వలమైన స్త్రీ రూపం వర్ణితమైంది అది మానుషరూపంలో దివ్య లక్షణోపేతమైంది. అతీతశక్తి సంపన్నమైంది. అజ్ఞానాన్నీ చీకటినీ మృత్యువునూ నిరాకరిస్తూ జ్ఞానానికీ వెలుక్కీ అమృత రూపానికీ దారితీసింది. నిజమైన స్వచ్ఛమైన ప్రేమకు చిహ్నమైంది, దివ్యమైన స్థాయికి ప్రతీకయైంది. మానుష శక్తి ఎట్లా ఆత్మ సంస్కార పరిణామ వికాస శిఖర దశల్ని పొందేదీ, అసాధ్యమనుకుందీ ఎట్లా సాధ్యం చేయగలిగిందీ ప్రకటితమైంది. 'విధి సూత్రాలు మారవచ్చు కాని నా ఆత్మ సంకల్పం మారదు' అన్న మాటలో, సావిత్రి నిజానికి దివ్య మంత్రంలోని చైతన్య శక్తిని స్ఫూర్తి తెస్తుంది.

రచనలో క్రమ పరిణామ దశలు ఆరోహణ రూపాన్ని ఆవిష్కరిస్తాయి. తన భర్త సత్యవంతుని జీవితం పట్ల విధి విహితమైన మృత్యువు నీడతో పెనుగులాడి పోరాడవలసి వచ్చింది. ఇదో విధంగా 'రెజిల్ (wrestle) విత్ షాడో' లాంటిది. ఇదో ముందున్న సమస్య. అశ్వపతి యోగ సాధనతో దివ్య శక్తియైన మహామాత కృపకు పాత్రుడై పొందిన యోగఫలం సావిత్రి! రూపం ధరించింది. ఆ దేవి ఈ భౌతిక శరీరాన్ని పొందింది. ఆమెలో మూలమైన చైతన్య శక్తి గుప్తంగా ఉంది. ఇది సాధారణంగా సిద్ధించే యోగం కాదు. అసాధారణమైంది. సావిత్రి మహాకృతిలో అశ్వపతి యోగ సాధనం దాదాపు 250 పుటలు (15 సర్గలు) ఆవరించింది. ఆధ్యాత్మిక చైతన్యస్థాయిని పొందేందుకు మానవాత్మ ఎంత సాధన చేయవలసిందీ అవగతమవుతుంది.

సావిత్రి జననం, పెరగడం, వరాన్వేషణ సావిత్రి సత్యవంతుని కలవడం, విధి గురించి నారదుని అభిభాషణం, సావిత్రి కృత నిశ్చయం, ఇవన్నీ లౌకికమైన వ్యవహార దశలుగా కన్పిస్తాయి. కాని కావ్యంలో వీటి వెనుక అతీతమైన ప్రేరణ శక్తి ప్రసారం అనుభవానికి వస్తుంది. ఇక్కడ నుండి కథలో ఒక మలుపు! సావిత్రి సత్యవంతుల వివాహం మరో మలుపు. అడవికి వెళ్ళడం ఆపైన సత్యవంతుని మరణం, సావిత్రి యముల మధ్య సంభాషణ సత్యవంతుని ప్రాణశక్తి అవనిపైకి రావడం ఇంకో మలుపు. దీనితో రాత్రి అంతమవుతుంది.

అశ్వపతి యోగసాధనం ఎంత మహత్తరమైందో తత్ఫలితంగా జన్మించిన సావిత్రి జీవితంలో పతి ప్రాణాల్ని సాధించడంతో యముని జయించిన విధం, మాయకూ మృత్యువుకూ అతీతమైన చైతన్య శక్తి విలసనం అంతకన్నా మహనీయమైంది. ఈ ఆధ్యాత్మిక మహా కావ్యం దివ్యశక్తి సమావిష్కారం, మానసాతీత స్థాయిని పొందింది.

ప్రపంచ కావ్య చరిత్రలో స్త్రీ అవతారం ప్రధాన పాత్రగా నిర్వహింపబడిన ఏకైక మహాకృతి. ఇందులో స్త్రీ సావిత్రి సత్యానికీ వివేకానికీ ప్రతీక. మహాశక్తి సంభృతమయింది. చీకటి పోవడం, కాంతి రావడం మృత్యువును జయించడం, ఆనందాన్ని పొందడం అనే ఆధ్యాత్మికమైన ఆరోహణ దశలతో సంయుతమైంది. ప్రాచ్య పాశ్చాత్య సంస్కృతి విశేషాల్ని సంతరించుకుంది కావడం మరో విశేషం.

అశ్వపతి జీవాధిపతిగా, జవశక్తికి చిహ్నంగా కన్పిస్తాడు. భౌతికంగా నుండి మానసికం దాటి ఆత్మదర్శనంతో సత్యాన్వేషణ ఫలంగా సావిత్రి జన్మించింది. ఒక కొత్త వెలుగు సావిత్రి రూపంలో దివ్యశక్తి మయమైంది అవతరించింది. ఎక్కడైతే సత్యమనే సూర్యునికి అస్తమయం లేదో అజ్ఞానం లేదో అవిద్య లేదో, మృత్యువుకు స్థానం లేదో ఆ తేజోమయమైన జ్ఞానమయమైన / విద్యామయమైన అమృతమయమైన లోకాన్ని స్థాపించింది. ఈ మహా కావ్యంలో తాత్త్వికత ఆధ్యాత్మికత మనిషికి మానసికంగా ఆరోహణకుపకరించేవి. ఇది కవితాత్మచేతనతో ప్రకాశమానం కావడం చేత దీన్ని జగద్గీతం విశ్వగీతం అని పేర్కొనడం జరిగింది.

ఉదయంతో మొదలైన సావిత్రి క్రమంగా కావ్య చైతన్య స్థితిలో కాంతి ప్రసారంతో ముగిసింది. సావిత్రి పాత్ర మానసాతీత చైతన్యానికి విజయ రూపానికీ ప్రతీకగా నిలిచింది. అరవిందుల మాటల్లో ఇందులో మానసాతీత ప్రభావంపై స్థాయిలో మాత్రమే రూపు రేఖల్ని పొందింది. ఇందులో సత్యవంతుడు ఆధారంగా విధిని అధిగమించడం ముఖ్యమైంది. జీవితంలో గొప్ప సంక్లిష్ట స్థితిని దాటింది. అంతర ప్రకాశంతో దివ్యశక్తిని పొందింది కావడం చేత సావిత్రి మహాకావ్యం తాత్త్విక ఆధ్యాత్మిక ప్రాధాన్యాన్ని పొందింది.

మార్మిక తాత్త్విక ఆధ్యాత్మికేతిహాస వస్తువు మహాకావ్యానికి లౌకికస్థితి నుండి అలౌకిక దివ్యస్థితులకు దారితీసింది. సావిత్రి లౌకిక స్థితిలోను ఆదర్శ ధర్మపత్నిగానూ విశుద్ధమైన మనోరూపంతో వర్ధిల్లింది. అన్ని విధాలైన ఆటంకాన్ని ఎదుర్కొని చివరకు మృత్యువును గెలిచి విజయాన్ని పొందే స్త్రీ శక్తిలో సంకల్ప ప్రభావం అనితరమైంది. మానవ మేధ ఆమె సాధనా బలంతో అతీతమైన శక్తి పొందడమూ దృష్టికి వస్తుంది. భౌతికమైన ప్రకృతి రూపం అతీతమైన దివ్యరూపాన్ని సాధించింది. సత్యవంతుడు పరమ శక్తికీ సత్యానికీ తెగిపోని వీడని అనపాయమైన ప్రేమ బంధానికి ప్రతీకగా నిలుస్తాడు.

సావిత్రి సత్యవంతుల కథ చాలా ప్రసిద్ధమైంది, లౌకికం నుండి అలౌకిక దివ్య జగత్తువైపు ఆలోచల్ని ప్రసరింపచేసేది. సావిత్రి తన భర్తను హరించిన మృత్యువును జయించి భర్తను తిరిగి పొందడం, ధర్మనిష్ఠ చేత సాధనా బలం చేత మాత్రమే సాధ్యమన్న

వాస్తవాన్ని ఋజువు చేస్తుంది. అమృతమయమైన అంతిమ లక్ష్యాన్ని నిర్దేశిస్తూంది. రచనలో హైందవ పాశ్చాత్య పురాణ కథల ప్రభావమూ గోచరిస్తుంది. బాధ అనేది 'ప్రకృతి హస్తం'. ఇది మనుషుల గొప్పదనాన్ని శిల్పీకరిస్తుందన్న నారదుని మాటలతో సావిత్రిలో వేదనా రూపం తాత్త్విక స్పర్శను పొందింది.

ఇది వైదిక రచనా మార్గం, మార్మిక తాత్త్విక కవితా దర్శనంగా వర్ధిల్లింది. అరవిందుల దివ్య జీవనానికి కవిత్వ కళారూపంగాను ఈ రచన భావితమైంది. ఇందులో ప్రేమ, సౌందర్యం, సత్యం, ధర్మం, లక్ష్యం, ఆదర్శం మొదలుగా అనేక మౌలికాంశాలు చిత్రితమయినాయి.

ఇందులో మరో విశేషం, ఇది జాతీయ భావనతో గొప్ప సాహసకార్యంతో ఉత్తమ సాధనాన్వేషణంతో ఉదాత్త లక్ష్యంతో కథా కేంద్రంగా సాగిన తాత్వికాధ్యాత్మిక మార్మిక కృతి. భారతీయ జీవనంలోని మౌలికమైన విలువలపై ప్రధానమైన దృష్టితో నిర్మితమైంది ఇది. అరవిందుల అనుభవం, విజ్ఞానం, అన్వేషణ సాధన దర్శనం, కవితా హృదయం మూర్తీభవించిన బృహద్గ్రంథం. ఇందులో ఉదయావతరణం సావిత్రి ప్రవేశాన్ని సూచిస్తుంది. ఆమెలో భౌతికమైన పరిమితులు ఉన్నమాట వాస్తవమే. ఇది ఈ రచనలో గుర్తింపబడింది కూడా. భౌతికం ఆధ్యాత్మిక సాధనకు ఆధారం కూడా. ఈమె భౌతికేతర దివ్య లక్షణానికి ఇందులో అశ్వపతి తాత్త్విక పరిపూర్ణత మూలకేంద్ర స్థానాన్ని వహిస్తుంది.

మహా రచనలో మొదటి నుండి చివరి వరకూ వాస్తవాతీత చేతన శక్తిలో పై దశలు దివ్య భూమికల్లో చిత్రిత మయినాయి. మానవజాతి కోరికలు, అశ్వపతిలో ఉన్ముఖమై ఆత్మసాధనలో మూర్తీభవించి క్రమంగా ఫలవంతమయినాయి. దివ్యమైన మాతృశక్తి ఈ ప్రపంచానికి ఆధారమైంది. ఇది అనుభవానికి వస్తుంది. సావిత్రిలో దివ్య జీవితం నెలకొనే పరిస్థితుల్ని నిర్మించింది.

సావిత్రి మహాకృతి వేదోపనిషన్మార్గాన్ని అవలంబించింది. ప్రాచీన ఋషుల దర్శన మార్గం ఉంది. ఇందులో వివిధ పరిణామాల ప్రభావంతో ఆధునిక మానవునిలో సిద్ధించే అతీత మానవ చేతన కనుగుణంగా తీర్చబడింది. మానవాత్మ ఆరోహణ దశలు స్పష్టంగా కన్పిస్తాయి. ఇది మృత్యువును మరల్చ గలిగిన మహాశక్తి రూపం. మొదలు చివర కాంతివంతమయింది, దివ్యచేతనా మయమూ అయింది. సావిత్రి పాత్ర భౌతిక శరీరంలో నిహితమైన దివ్యమైన స్త్రీ చేతనకు ప్రతీక. మానవ జాతికి ఆదర్శంగా నిలిచే పవిత్రమైన ధర్మ రూపం. అతి మానస చేతనకు శక్తి కేంద్రంగానూ విలసిల్లింది.

## (3) రాయప్రోలు అభినవ కవిత్వ వ్యక్తిత్వం

తెలుగు సాహిత్య ప్రపంచంలో అభినవ కవితా బింబం రాయప్రోలు. కవిత్వాన్ని తపస్సుగా భావించిన మనిషి. చరిత్రలో ఎన్నో ఆఘాతవిఘాతాలకు తట్టుకుని నిలిచిన ఆర్ష సంస్కృతికి చెందిన సంప్రదాయ శక్తి భూమికగా, ఆంగ్ల విద్యా ప్రభావంతో సమకాలీన జీవితానుభవంతో సంస్కరణ హృదయంతో సంపన్నమైన మనస్వి. రాజకీయ చైతన్యం స్వాతంత్ర్యాభిలాష స్వేచ్ఛా ప్రకటనంతో మారే సమాజంలో, ఆ కాలాని కవసరమైన మార్పులకు విముఖం కాని నవ్య పథ ప్రదర్శకుడు. కవిత్వాన్ని తాత్త్విక తలంపై నిలిపినా, రచనలో అంతరంగ సౌందర్యాన్ని అభిలషిస్తూ, సామాజిక తలంపై అనివార్యమైన మార్పుల్ని గుర్తిస్తూ స్వాగతం పలికిన వైతాళికుడు. ఆధునిక సాహిత్యంలో ఈయన సాహితీ వ్యక్తిత్వం, అత్యంతమూ ప్రభావోపేతమైంది. ఇది సంప్రదాయ మార్గానికి నవ్యగుణాల్ని సంతరింప జేసి అభినవ రూపాన్ని సిద్ధింపజేసింది.

మొదట్లో ఈ వ్యక్తిత్వం స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తితో, దేశ భక్తి భావనతో ప్రకాశించింది. జాతి సంస్కృతి పట్ల బాధ్యతను గుర్తు చేసింది. గర్వాభిమానాన్ని వెలిగించింది. ఈయన కవిత్వం ఉద్యమతలంపై 'చేవ' కలిగిన పదాలతో ఆకర్షించింది. పాటశైలితో జనామోదాన్ని పొందింది. అమరావతి పట్టణంలో బౌద్ధులు విశ్వవిద్యాలయం స్థాపించిన నాటి చైతనోన్మేషంతో శాంతినీ, లోకమంతా కాక పెట్టిన కాకతీయుల కదన పాండితిని స్మరించే ఉత్సాహ సంరంభంతో తరంగితమైన వీరాన్నీ ప్రబోధించింది. ఇది ఆధునిక కవిత్వంలో తెలుగు కవిత్వానికి ఉత్సాహవంతమైన అరుణ రేఖ అనవచ్చు.

ఈయనలో సమకాలీన ఉద్యమాల ప్రేరణ ఉంది. తెలుగుదనంపై మక్కువతోను, ఆర్ష సంస్కృతిపై అభిమానంతోను సమస్యల పట్ల స్వతంత్రమైన ఆలోచనా ప్రపంచంతో తెలుగు సాహిత్యం ఈయన రచనలో మలుపు తిరిగింది. యువతరాన్ని సృజనాత్మక శీలంతో ఉత్తమమైన విలువల వైపుకు ఉన్నతమైన లక్ష్యం వైపు ఉన్ముఖం చేసింది.

పాశ్చాత్య భావ ప్రసారానికి లోనైనప్పటికీ భారతీయ చేతన ఈయన మానసిక ప్రపంచానికి మౌలికమైన జీవరూపంగా ఉంది. ఇది చివరిదాకా నిలిచి స్థిరపడింది. 'పాతగుడ్డలు పారవైతుము, కొత్త గుడ్డలు కట్టుకొందుము చావు బతుకుల సత్యమింతే;' "వాసాంసి జీర్ణాని యథావిహాయ నవాని గృహ్ణాతి నరోపరాణిః తథా శరీరాణి విహాయ జీర్ణాన్యన్యాని సంయాతి నవాని దేహీ" (గీత–11,22) ఇంకా "నీవారాగ్రము మాద్రి సూక్ష్మమయి హృన్నీలాభ్ర మధ్య స్థ లీలా విద్యుచ్ఛిఖలోని జీవుని మొదల్ దర్శించి" – హృదంతిక కోశమున నీవార శూకాగ్రముగ మెరసె తదంశమున్" – దీనికి నీవారశూక వత్తన్వీ పీతా భాస్వత్యనూపమా' ఇత్యాదిగా ఎన్నో ఉపనిషద్భావ వీచికలు ఈయన

రచనలో వివృతమైనాయి. ఈయన తాత్త్విక చింతన ప్రధానంగా భారతీయ వేదాంత భావనాత్మకమైంది.

రవీంద్రుని బలమైన ప్రభావం, ఈయనలో దివ్యత్వం అతీంద్రియ భావనతో ప్రాణితమైంది. చింతనలో, ప్రేమతత్త్వ స్వరూపానికి నవ నవోన్మేషాన్ని చేకూర్చింది. ఇది ఆయన సాహితీ వ్యక్తిత్వానికి అంతరమైన ఆధార శక్తి కేంద్రంగా నిలిచింది.

సామాజిక తలంపై ఎన్నో వాస్తవాలు. దీని చుట్టూ తిరిగే నిజాలెన్నో, రచనలో విశ్లేషణకందుతాయి. ఇవి సంస్కరణకు చెందినవి కావచ్చు, మార్పుకు దారి తీసేవి కావచ్చు. కేవలం విలువలకు చెందినవి కావచ్చు. ఉదాహరణకు వార్తాపత్రికలో కన్పించిన ఒక స్త్రీ ఆహుతికి హృదయ స్పందన రూపమే 'స్నేహలత' కావ్యం ఇతివృత్తం. ఈనాటికీ నిలిచి ఉన్న కన్యక వరశుల్కం. 'కన్నియను పెండ్లి యాడునో; తండ్రి అర్పణము చేయు శుల్కదివ్యాప్సరసను పెండ్లి యాడునో?' యని ఆవేదనతో ప్రశ్నించడం జరిగింది. దీని వెనుక జీవితానుభవ పరామర్శ ఉంది. తత్త్వాన్వేషణం ఉంది. లలిత తృణకంకణం అనుమతి స్వప్న కుమారం కష్టకమల స్నేహలత మొదలైన కావ్యాల్లోని పాత్రలన్నీ నిత్య జీవితంలో తటస్థపడేవి రచనలో సమకాలీన జీవితానుభవం చేత పరిపుష్టమైనవి. సంస్కరణశీలి సంస్కార హృదయాన్ని ప్రతిబింబించేవి. ఈ కృతుల్లో వస్తువరణం, ఆదర్శ రూపం, ఆనాటి విద్యావంతుల్ని బాగా ఆకర్షించాయి. వీటి నిర్వహణ రూపం ఆధునిక భావజాలంతో సమాహితమైంది. ఇతి వృత్తంలో పోయే పోకడలు, తీసుకున్న మలుపులు మార్పుకు సంకేతమైనాయి. అభివ్యక్తిలో నవ్యత, ప్రసన్నమైన శైలి, మధురభావనతో పాటు పద సంయోజనం, అర్థంలో మార్దవం - అభినవ రూపానికి ప్రాతినిధ్యం వహించాయి. సమాజ చరిత్రలో పరిస్థితుల ప్రభావం చేత వచ్చే, మార్పుల కనుగుణంగా ప్రసరించే ఆలోచనలకు, నిలయమైన సాహిత్యోద్యమానికి రాయప్రోలు స్పందన శక్తిగా కన్పించాడు. అటు కావ్య రామణీయకతతో పాటు ఇటు సామాజిక స్పందన కలిసి రూపొందింది, కట్టమంచి వంటి తీక్షణ విమర్శకుల ఒరపిడికి నిలిచిందీయన కవిత్వం, కట్టమంచి మాటల్లో His imaginative gifts are of a high order and his power of phrase is remarkable almost unique' (ఉత్తరం - (26-5-1919) తృణకంకణం - 1966) అనివార్యమైన చరిత్ర గతిని బట్టి లోక ప్రవృత్తి మారడం సహజం. దీనితో పాటు సాహిత్యం కూడా మారుతుందన్న వాస్తవాన్ని గుర్తించడం ఈయన దూరదృష్టికి సంకేతం. రాయప్రోలు సాహిత్యం - సంప్రదాయ మౌలికతను రక్షిస్తూనే క్షుణ్ణమైన మార్గంలో కాకుండా స్వతంత్రమైన ఆలోచనా పథంలో ప్రత్యేకతను పొందింది. ఈయనలో ఉన్న ఈ ప్రవృత్తే మొదట్లో ఆశుకవితా మార్గం నుండి సన్యాసానికి కారణమైంది. స్వతంత్ర మార్గంలో, నవ్యమైన

భావచిత్రాలతో పద బంధాలతో భావస్ఫూర్తితో ఉన్నత లక్ష్యానికి నిబద్ధమైంది.

జీవితంలో వలెనే సాహిత్యంలోను, ఎక్కడో ఒకచోట తత్త్వ ప్రపంచం అపరిహరణీయమై విలసిస్తుంది. తత్త్వం – సాహిత్యం రెండూ పరస్పరాశ్రయాలు, అన్యోన్యపోషకాలు. నిజజీవితంలో వికాసస్థితులకు దోహదాకారులు. తత్త్వపథంలోని హేతుగుణం అన్వేషణం దర్శనం అనేవి, కవిత్వంలోని రామణీయకతకు ఉదాత్తమైన ప్రయోజన రూపాన్నిస్తాయి.

ఈ ధోరణిలో ప్రేమతత్త్వం విశిష్టపథంలో ప్రవర్తిల్లింది. అంతఃకరణ సౌందర్యం – ప్రకృతి తాదాత్మ్యం – చైతన్యం – ఆత్మ అనేవి, ఈయన రచనలకు వివిధ స్థాయి భేదాలతో తాత్త్వికతను సిద్ధింపజేశాయి. 'నాకు మాత్రమన్నియు పువ్వులే నాత్మ సరణి' – సజీవ సౌకుమార్య సంస్కార గుణాలతో అనేక వ్యక్తిత్వాల్లో ఉండే చేతన ఒక్కటే నన్న పరమసత్యం వ్యంజితం.

"లలిత", "తృణకంకణం" మొదలుకొని "రమ్యాలోకం" "రూపనవనీతం" వరకు జీవితంలో వివిధ దశల్లో ప్రాణిధర్మమైన ప్రేమ పొందే అనేక రూపాలు, హృదయంగమంగా ఆలోచనాత్మకంగా ఆవిష్కృతమైనాయి, వ్యాఖ్యాతమైనాయి. జీవ చేతనాత్మకమైన ప్రేమతత్త్వం – విశాలమైన ప్రాతిపదికపై నిర్వహింపబడింది. వాత్సల్యం స్నేహం అనురాగం భక్తి మొదలైన భావదళాల చేత ప్రేమ సంపుల్లమైంది. రాయప్రోలు దృష్టిలో ప్రేమ – శృంగారం సమానార్థకాలు కావు. శృంగారం పరిధీకృతమైంది. ప్రేమ విస్తృతమైంది – నైకమైంది. స్త్రీ మాతృమూర్తి – సౌందర్యదేవత ప్రేమ స్వరూపిణి మొదలుగా ఆపైన జగన్మాత శక్తి రూపంగా దర్శితమైంది. మొత్తం మీద భౌతిక మానసిక ఆత్మదశల్లో పరిపూర్ణతకై అన్వేషణ సాగింది. ఈ కారణంగా ధర్మ లగ్నమైన మనస్సు మలినం కాని స్వచ్ఛమైన, ప్రేమను పొందే లక్ష్యంతో అమలిన శృంగార తత్త్వం ఆవిష్కృతమైంది. ప్రేమికుల మధ్య అనురాగం భావాత్మకమైన యోగం గాను పరిణమించింది.

ఇంద్రియ స్పర్శలేని, మలిన రహితమైన ఆదర్శ ప్రేమ రూపం కల్పితమైంది. ఇది పాత్రల మనోభూమికలపై ఎంతో ప్రతిభావంతంగా తీర్చబడింది. ఈ అనురాగ ధర్మం శుచిత్వంతో తాత్త్వికతను పొందింది. శుచిత్వంలో రసరామణీయకత ఉంది. ఈ విధంగా కావ్యతత్త్వం – కావ్యకళ రెండు సుసంయోచితమైనాయి. ఇతి వృత్త వికాసంలో కల్పన భావనలో అభివ్యక్తిలో తనదైన ముద్రతో మధుర శబ్ద సంయోజనం – దీని యోజనా నిర్మాణ రూపాలు. దీని వెనుక నుండి కవిత్వానికి మూల ద్రవ్యాలైన అంతఃకరణాన్ని రంజింపచేసే రసప్రవృత్తి ధ్వని ప్రసారం మొదలుగా ఆలంకారిక ప్రస్థానం ఉండనే ఉంది. ఈ దృష్టితో ఈ మహాకవి రచనల్ని 'ఆనందకళ'లనడం

ఔచితీ విలసితమైంది.

రాయప్రోలు సాహిత్యంలో అంతరంగ తత్త్వం ప్రత్యక్షమైన ఇంద్రియార్థం నుండి ప్రేమను, వికారం నుండి పరిపుల్లతను, వికలం నుండి పరిపూర్ణతను కోరేది – తొలి నుండి చివరిదాకా ఈయన సాహిత్య సాధన అంతా హ్లాదైకమైన మధురమైన, కావ్యోదయం కోసమే. ఈయన కవిత్వం హ్లాదైక రమణీయమైన నవనీత శిల్పంగా భావించవచ్చు.

ఈ సందర్భంలో రస నిమగ్నత అర్థ సౌకుమార్యం–వ్యంజన–హృదయ స్పందనం మొదలైనవన్నీ పూర్వాలంకారికుల ప్రశస్తమైన ఆలోచనా రూపాలే. ఇవి ఈ కవి ప్రతిభ చేత స్వతంత్రమైన భావోపసంస్కృతిని పొందాయి. ఈ కారణంగా అంతఃకరణ తంత్రుల్ని శ్రుతి చేసేది. భావ సౌందర్యాన్ని ఉన్మీలితం చేసేది. ఉపాస్య దేవతా స్థాయిలో ప్రకృతిలో దివ్య భావనతో ప్రకృతితత్త్వాన్ని ఆవిష్కరించేదిగా ఉంది. ఈ విధంగా తత్త్వ ప్రపంచాన్ని వహిస్తూనే రాయప్రోలు కవిత్వం ప్రసన్నమైన కృతితో సంపుల్లమైంది. సౌందర్యమన్నా రసమన్నా ఆనందమన్నా 'ఏకావరణ జన్యాలే' అన్న కవిమాట కవితా రహస్యం పొరల్ని ఒలిచి చూపుతుంది.

రాయప్రోలు కవిత్వం ఎంతో లలితమైన కళాసాధనతో మాధుర్య రసాస్వాదనా యోగ్యతను పొందింది, సామాజికేతివృత్త స్పర్శ చేత, ప్రయోజన విస్తృతిని వహించింది. కవి దృష్టిలో హితమంటే మనోవాక్కాయ కర్మల కత్యంతమూ ప్రియమైంది. ఇది పూర్వ ప్రసక్తమైన విధంగా వికారంలేని కపటం లేని వికలంగాని రూపంతో ప్రసన్నమైందీ రమణీయమైందీ, ఆ పైన సంపుల్లమైందీ పరిపూర్ణత నభిలషించేదీ. దీని కోసమే ఈయనలో కవిత్వ సాధన ఏర్పడింది. ఈ సాధనలో ప్రతిభాస్పర్శచేత రమణీయమైన కల్పన, మనోహరమైన భావ బంధురత, మధురమైన శబ్దానువృత్తి పలికింది. ఈ మార్గంలో రాయప్రోలు సాహితీ వ్యక్తిత్వం ప్రసిద్ధమైన ఆలంకారిక మార్గాన్ని వదలకుండా స్వతంత్రమైన భావోపస్కృతిని పొందింది.

ఈయన ఆదర్శాలు కొన్ని ఈనాటి సంక్షుభిత సమాజ స్థితికి బాగా అనువర్తిస్తాయి. ఈయన దృష్టి మతం దైవాన్ని సమీపింపజేసే ఉత్తమ సాధనం. మానవత్వాన్ని కోల్పోయేట్లు జేయడం ఆచరణీయం కాదు.

**"రాష్ట్ర రాష్ట్ర దురాక్రమణలన్ మత మతాంతర మత్సరంబులన్**
**ప్రేమమయ మగు విశ్వమానవ గర్భమే గాయాలు పడిన"**

సమయంలో జరిగేది రాక్షస తాండవ ప్రభావమే. ప్రేమమయమైన నరనారీ సమాజం అవతరిస్తుందనే భవిష్యత్తుపై ఆశతో మానవ సమాజంలో దీనికి

మానవత్వంలో సౌకుమార్య శోభాదులు ప్రసన్నంగా పరిణతం కావాలనే 'చిత్త ప్రసాదనం' పొందాలనే రాయప్రోలు ఆకాంక్ష.

(1) దేశ భక్తి ఆర్ష సంస్కృతి పట్ల అభిమానం (2) కుటుంబ జీవితం దాంపత్య భావన (3) స్త్రీ పట్ల ఉదాత్త వైఖరి (4) కలుషితాచారాల నిరసనం - సంస్కరణ హృదయం (5) సామాజిక చలనంలో పురోగమన పదం (6) మానవతా పూర్ణమైన ప్రేమతత్వంతో రూపొందిందీ ఆధునిక సాహిత్య యుగానికి ప్రాభాత "హిరణ్మయ ద్వారం" మహాకవి రాయప్రోలు అభినవ వ్యక్తిత్వం.

**2**

సంప్రదాయంలోని మౌలికత, ఆధునికంలోని ఆవశ్యకతతో అవతరించిన రాయప్రోలు కవిత్వం తెలుగు సాహిత్య ప్రస్థానంలో ప్రముఖమైన దశగా గుర్తింపును పొందింది. ఇది 1) స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తితో దేశభక్తి భావన 2) శాంతినికేతనం వాతావరణం రవీంద్రుల అంతేవాసిత్వంతో. ఆంగ్ల సాహిత్యంలో కాల్పనిక ప్రభావంతో కలిగిన భావనవ్యత 3) భారతీయ సాంస్కృతిక చేతనలో మౌలికతతో, 4) వర్తమాన జీవితంలో సంస్కరణావశ్యకతతో సంపుల్లమైంది. ఆధునిక యుగాన్ని ప్రకాశమానం చేసింది. ఇది పూర్వ స్థితి కన్నా భిన్నమైన ఆలోచనా ప్రపంచాన్నీ అనుభవ రూపాన్నీ సంతరింపజేసింది.

ఈ భూమికపై తృణకంకణం కావ్యాన్ని సమాలోచనం చేస్తే, రాయప్రోలు వ్యక్తిత్వ సూత్రం అందుతుంది. ఈ కృతిపేరే కొత్తగా ఉంది. తృణాన్ని అంటే గడ్డిపోచను చేతి కడియంగా తోరంగా వర్తింపజేసిన చర్య నిరాడంబరమైందీ, ప్రకృతి దగ్గరగా ఉందీ, సహజత్వాన్నీ భావింపజేసేదీ. ఇది కథాభాగంలో సోదరీభావ సూత్ర బంధంగా పరిణమించింది. శృంగార భావన ప్రియుల మానసిక తలంపై స్నేహరూపాన్ని పొందింది. 'ప్రేమ' పదంలో భావజగత్తూ విస్తృతిని పొందింది. ఇందులో వస్తువు యువతీయువకుల ప్రేమ, చివరకు సోదరీ సోదర స్నేహమయంగా మలుపు తిరిగింది. ఇది విస్తృతమైన దర్శనస్థాయిలో చిత్రితమయింది. కథాగమనం, పాత్రచర్యల దృష్ట్యా పైన పేర్కొన్న మానసిక భావ సమన్వయం కృతిలో నవ్యత కాస్కారమైంది.

కథలో యువతీ యువకులిరువురూ బాల్యం నుండి ప్రేమభావనతో మెలగిన వాళ్ళు. యౌవనం తొలిదశలో స్త్రీ పురుష సహజమైన శృంగార భావన మొగ్గ తొడిగింది. కాలాంతరాన పరిస్థితుల ప్రభావం వల్ల విడిపోయారు. ఆమెకు మరో వ్యక్తితో వివాహమయింది. ఆమె తల్లిదండ్రుల ఆజ్ఞానువర్తి. కన్నతల్లి ఆజ్ఞను పాలించడం కర్తవ్యంగా భావించింది. అప్పటికీ, కాలంలో మార్పు తల్లిదండ్రులను కాదని

స్వతంత్రంగా వ్యవహరించే స్థితి విస్తరించలేదు. పైగా కవి కోరే మార్పుకూడా కొన్ని పరిమితులకు కట్టుబడింది, మరీ ముఖ్యంగా తాను ప్రకాశమానం చేయదలచుకున్న మనోరూపమూ వేరయింది.

ఇపుడామె వివాహిత. అతడు విరాగి. ఇదీ స్థితి. ఇరువురూ భిన్న పరిస్థితుల్లో ఉన్నారు. ఒకనాడు అనుకోకుండా ఊరు బయట తటస్థపడతారు. "చిత్రార్పితం"గా నిలిచిపోయారు. ఇరువురి చేతులు కలిసాయి. మనస్సులోని ప్రేమభావం పైకి ఉద్గమించింది. పాత్రల్లోని మనోరూపానికి ప్రాధాన్యమీయబడింది. ఆమె గద్గద స్వరంలో కుశల ప్రశ్న తొణికింది. ఈతడు తనలో నీడని, ఆమె రూపంతో, వేదనతో బ్రతుకుతున్నాడు. ఆమె అతని ఈ సంక్లిష్ట స్థితిని అర్థం చేసుకుంది. తల్లిదండ్రుల అభిప్రాయాన్ని మన్నించాలనే ధర్మాన్ని పలికింది. అతనికామె హృదయం అవగతమయింది. ఆమె పట్ల అతనికున్న ప్రత్యయానికి నిదర్శనంగా, హితబోధ విన్నాడు. ఆమె మాటలు అతనిలో విరాగ భావాన్ని పోగొట్టాయి - జీవితాన్ని ఆశా రంజితం చేసాయి. వారి అతిలోకమైన స్నేహబంధానికి చిహ్నంగా, అతడు ఆమె మణికట్టుకు తృణకంకణాన్ని ధరింపజేస్తూ "సోదరీ" అన్న సంబోధనం కథలో భావపరివర్తనకు దారి తీసింది. ఆమె తన ఉంగరాన్ని అతని వ్రేలుకు తొడిగింది. "నీడలట్టుల ఐక్యమందెదమని", ఎవరి దారిన వారు వెళ్ళిపోయారు. కాలగతిని బట్టి నీడలు! వస్తురూపాల స్థానాలతో దగ్గర దూరం అవుతాయి. మరో విధంగా నీడ స్మృతికి సంకేతం కావచ్చు. ముగింపు ఎంత భావ బంధురంగా ఉందో కావ్యం ఆరంభమూ అంత భావమహితంగా ఉంది. ఇది పాత్ర ప్రవేశంతో ఆరంభం కావడం ఉత్సుక భావాన్ని పొందింది.

**"అడుగులు బొబ్బలెత్త వదనాంచల మందున చెమ్మటల్**
**మడుగులు గట్ట మండు కనుమాలపు టెండ వడంతియోర్తు"**

కాలినడకన పోతూంది. ఇది ఆమె తోటలోకి పోయే దృశ్యం. దీనితో మొదలైన స్థితులన్నీ ఇతివృత్తంలో చాలాభాగం నాయికా కేంద్రంగానే సాగాయి. ఇదో విశిష్టమైన దృష్టికోణం. వస్తుపరంగా కవి నాయికకిచ్చే ప్రాధాన్యాన్ని సూచిస్తుంది. ఇక్కడ మరో విషయం కావ్యారంభం 'శ్రీ'తో కాక 'అ'తో మొదలైంది. కాబట్టి నవ్యగుణంగా పేర్కొనడం జరిగింది. కానీ 'అక్షరాల్లో ఆకారాన్ని' అన్న గీత వాక్యం ఈ సందర్భంలో గుర్తుకు రావడాన్ని బట్టి, శ్రీతో ఆరంభమయ్యే దశకన్నా వెనక్కి వెళ్ళి ఉనిషద్భావగతమైన తాత్త్వికపరమైన అవతారస్ఫూర్తికి దోహదం చేస్తుంది. పై పద్యంలో ఎండకు వేసిన విశేషణం - 'కనుమాల' పదం. కఠినత్వాన్ని నిర్దయనూ సూచిస్తోంది. ఆమె సుకుమారవతి, లేప్రాయంలో ఉంది, వివేకవతి. కష్టాలు తప్పలేదు. ఇది విధి నియతి.

ఎండ అనేది కాలగతిలో భాగం. కాలమంటే విధిస్వరూపం. ఆ యువతి తాను ప్రేమించిన వ్యక్తికి దూరం కావడం, మరొకరితో వివాహం జరగడం, మానసికమైన వ్యధకు లోనుకావడం. మొదలైన స్థితులన్నీ విధివైపరీత్యాన్ని సూచించేవే. ఇట్లా అర్థాంతరాన్ని భావింపజేసే లక్షణం అనేక సందర్భాల్లో కన్పిస్తుంది. ఆమె తన జీవితంలో విపర్యస్తమైన పరిస్థితి నెదుర్కొంది. మానసికమైన ఒడుదొడుకుల్ని అధిగమించింది. విధి వికటించినపుడు క్రుంగిపోకుండా వ్యక్తి తనలో శక్తిని సమీకరించుకొని, జీవితాన్ని సుందరంగా మలచుకొనే ఉద్దేశంలో పాత్ర వివాహబంధంతో పవిత్రమైన దాంపత్యధర్మంతో ఉన్నతిని పొందింది.

తృణకంకణంలో రచన సంప్రదాయమార్గంలో భాష, భావం, అభివ్యక్తిలో రాయప్రోలు ముద్రను తలపిస్తుంది. సామాజికతలంపై పూర్వంకన్నా భిన్నమైన వస్తు నవ్యతను పొందింది. అభినవ కవిత్వంగా రూపొందింది. ఇతివృత్తం విషాద గమనం నుండి విషాద రాహిత్యానికి, ఆశావహమైన సుస్థితికి మలుపు తిరిగింది. కథా ప్రణాళికలో ఆధునిక కవిత్వానికవసరమైన ప్రేరకస్థానాల్ని గుర్తించి సావయవపూర్ణంగా నిర్వహించడంతో, సంపూర్ణమైన కావ్యరూపాన్ని పొందింది. తృణకంకణంలో కీలకమైన అంశం, స్త్రీ పురుషుల మధ్య మానసికమైన అనుబంధం. రాగ రంజితమైన ప్రేమ ప్రపంచం. సాధారణ స్థాయి నధిగమించింది. కేవల శారీరక సుఖాతీతమైంది. దీనికి ప్రేమికుల్లో సంయమనం, త్యాగం, సమచిత్తం అవసరం. కావ్యంలో ఇతివృత్తం మొదట్లో భౌతిక తలంపై పాత్ర ఆవిష్కృతమయినప్పటికీ, చివరకు పరివర్తనతో మానసిక తలాన్నే వర్తించింది. ప్రేమికులిరువురూ నీడలవలె విడిపోయారు. స్మృతులు మిగిలాయి. ప్లెటోనిక్ ప్రేమ, ఇందులో భారతీయ చింతనకూ మర్యాదకూ అనుగుణంగా మలచబడింది. అభినవ రూపాన్ని పొందింది. ఇందులో ఒక శ్రేణిలో, సంస్కరణ దృక్పథం మరో శ్రేణిలో ఆంగ్ల కవిత్వంలోని కాల్పనిక ప్రభావం ఇంకో శ్రేణిలో భారతీయ సంస్కృతిలోని దాంపత్య ధర్మనిర్వాహణం దృష్టికి వస్తాయి.

స్త్రీ పురుష సంబంధాలు మానవ జీవితంలో స్వేచ్ఛ పేరుతో కుటుంబంలో విషమత్వానికీ, విచ్ఛిన్నతకూ దారితీయకూడదనే! ఇటువంటి పరిస్థితుల్ని వివేకంతో సముచితంగా పరిష్కరించుకోవాలనే! అవసరమైతే స్వసుఖాన్ని త్యాగం చేసే భావమూ నాయిక ముఖతః ప్రతిపాదితమయింది. ఈ కావ్యంలో ఈ ఆదర్శంతో విషాదం తొలగింది. ఇది పాత్రలో మానసికమైన మార్పుతో సాధ్యమయింది. సంక్లిష్టస్థితిలో చేయగలిగిందేమిటన్న ప్రశ్నకు సమాధానమే 'తృణకంకణం'. కావ్యంలో స్థాపితమైన స్నేహకళారూపం. ఇందులో వాస్తవ జీవితం; అనుకోని పరిస్థితులు, కాలం లేదా విధిపై నిర్మితమైన కథారూపంలో విపర్యాసం సత్సంకల్పంతో పరిష్కృతమయింది.

స్నేహం నిలిచే ఉంది. కస్తూరి పరిమళం, పాత్రను కడిగినప్పటికీ వాడని విధంగా, మనసును అంటి పెట్టుకొనే ఉంటుంది. ప్రతికూల పరిస్థితుల్ని అనుకూలంగా మలుచుకొనే ఉదాత్తమైన మనోరూపం ఇందులో ప్రేమతత్త్వానికి, స్నేహకళకూ తాత్త్విక భూమికను చేకూర్చింది. ఇది సాహిత్య విమర్శలో అమలిన శృంగారంగానూ కొందరిచే భావితమైంది. ఇందులో నాయకుడు కోరేది.

**"మరువంబోకుము నెచ్చెలీ! ప్రణయ రమ్యంబైన యావళ్ళనే**
**మరువంబోకుము జీవితాంతమును ప్రేమన్, ప్రేమభాష్పాంజలిన్**
**మరువంబోకుము ఈ కథన్ మరచిపొమ్ము! సర్వమున్ శాంతికై"**

తృణ కంకణాన్ని సిద్ధింపజేసే చేతిలోనున్న తృణం ఒక కొస ఈ పద్యం. మరొక కొస తరువాతి వచ్చే మరో పద్యం. నాయిక ముఖతః ప్రకటితమైంది.

**"విషయ సుఖేచ్ఛలన్ తనియ! విహ్వలమైన హృదంతరమ్ముక**
**ల్మషమయి పోవనీక, అకలంకమృదూకృత సాధనన్మనో**
**విషయగతిన్ మరల్చుటె వివేకము!"**

అన్నది. ఈ రెండు కొసలు కలిస్తేనే, స్నేహబంధం చేకూరేది.

జీవితంలో "ప్రణయ రమ్యతనూ ప్రేమ బాష్పాంజలి" నీ "ముగ్ధరాగ" పరిణామాన్నీ మరవ కూడదని నాయకుని కోరిక! ఇవి మనస్సులో ఎప్పటికీ నిలచే ఉంటాయి. ఇరువురు విడిపోయినా స్మృతి పరిమళాన్ని వెదజల్లుతూనే ఉంటాయి. అయితే దృష్టి వేరు. ఈ అనుభవం మానసికమైంది, స్వచ్ఛమైంది. ఇందులో గాఢమైన వేదన ఉంది, ఆర్ద్రత ఉంది, ఆత్మవిశ్వాసమూ ఉంది. ఇక మరిచిపోయేది మిగతావి సర్వమూ! ఒక్క శాంతికోసమే! సర్వమంటే భౌతికమైంది. ఇంద్రియమైంది. కథ శరీరస్థానీయం. శరీరమున్నంత వరకూ నిలచే ఉంటుంది, దృష్టికోణం మాత్రం మనోగతంగా మారింది. నిజమైన ప్రేమ-స్నేహం అనేవి ఎప్పటికీ వాడిపోవు, వీడిపోవు చెదరిపోవు. నాయకుని మాటల్లో పాత్ర ఉన్నతమైన అంతరంగం ధ్వనిస్తుంది. కవి దృష్టిలో ఇది, అమలిన తత్త్వానికి బీజ భూతమైంది.

ఇక నాయిక ముఖతః పలికిన మాటల్లో కేవలం భౌతికమైన ఇంద్రియ సుఖాలకే జీవితం పరిమితం కాకూడదు. హృదయం కల్మషం కాకూడదు. భయాదుల చేత పట్టు తప్పిపోకూడదు. దీనికి మృదువయిన అంటే సాత్త్వికమయిన సాధన అవసరం. ఇది కళంకరహితంగా స్వచ్ఛంగా సాగాలి. అట్లా పవిత్రమైన స్థితిని పొందడం, దాన్ని నిలుపుకోవడం కష్టం. దీన్ని సాధించే ప్రయత్నం చేయడం వివేకం, ఇది అవసరం. దీనివల్ల లగ్నమైన ఆర్ద్రమైన మానుషదశలు కృతార్థాన్ని పొందడం విశేషం. ఇది

మానవశక్తి కతీతమైంది కాదు. మనస్సును దారితప్పకుండా, చెడిపోకుండా, నిలపడం అవసరం.

సాధనలో విషయగతిని పవిత్రంవైపు, ధర్మం వైపు మరల్చడం వివేకంతో కూడిన పని. దీనివల్ల మానుషత్వానికి కృతార్థత చేకూరుతుందనే కవి భావన ఉదాత్తమైంది. ఇది భారతీయ చింతనలో భాగమైంది. ఉపనిషన్మూలకమైంది. ఈ రెండు పద్యాలూ తృణకంకణం కావ్యాని కెదురెదురుగా నున్న రెండు బిందువులు, రెండు కొసలు, వీటి మధ్య జీవితం స్నేహ సుందరమైంది. తృణకంకణ పరమార్థం సార్థకతను పొందింది.

ఒకవైపునుండి కవిత్వకళ మరోవైపునుండి తాత్త్వికాంశ కలిసి రూపొందిన అభినవ కావ్యం, తృణకంకణం. ఇందులో ప్రేమరహస్యం, విస్తృతార్థాన్ని పొందింది. అస్ఖలితమైంది అంటే ద్యుతం కానిదీ, సమున్నతమైందీ అని. ఇంకా అమలినమైందీ, మలినం అంటనిదీ, కళంకరహితమైందీ, స్వచ్ఛమైందీ అని. ఈ ప్రేమసూత్రం, అనురాగ పూర్ణమైంది. ఒక్క హృదయానికి మాత్రమే అవగతమై చిరంగా నిలచేది. మనస్స్థానీయమైంది. స్మృతిలో మిగిలింది. కావ్యంలో ప్రతీయమానత్వాన్ని పొందింది. "ప్రతీయమానం పునరన్యదేవ వస్త్వస్తి వాణీసు మహాకవీనామ్" అన్న ఆనందవర్ధనుని మాట అన్వర్థమవుతూంది.

# (4) అహంకార కళ - అభివ్యక్తి శిల్పం

అహంకారం మనిషిలో సహజ గుణం. ఏ రూపంలో ఏ స్థాయిలో ఎట్లా ఎంత వరకు ఉంటే మంచిది (ముఖ్యంగా కవుల్లో) అన్నది వేరే విషయం. అభిమానం యొక్క శిఖర రూపం అహంకారం. ఇది క్రియా శక్తిని పురికొల్పుతుంది, వేగవంతం చేస్తుంది. సత్క్రియతో కళాత్వాన్ని పొందుతుంది. సృజన ప్రపంచంలో మంచి ఫలితాన్ని ఇస్తుంది. కార్యసాధనలో ఆత్మ విశ్వాసాన్ని నిలుపుతుంది. అపుడు "అహంకారం" మనిషి అస్తిత్వానికి మూలమైన ప్రేరణ శక్తి అవుతుంది. "నేను" అన్న భావన నుండి "నేనే" అన్న భావన వరకూ వ్యాప్తమయ్యే వీలుంది. అందువల్ల అహంకారం యొక్క ప్రసార విస్తరణ వికాస శిఖర రూపాలెన్నో! దృష్టికి వస్తాయి. జీవితంలో తటస్థపడతాయి. సత్త్వ రజస్తమో గుణాల్లో ఒక్కొక్కటీ వీటి కలయికలో వేరు వేరు నిష్పత్తుల్లో అనేకమైన భేదాలతో ప్రాధాన్య వివక్షచేత కవుల వ్యక్తిత్వాలు విశ్లేషణ కందుతాయి. ఏమైనప్పటికీ కవితా ప్రపంచంలో అహంకారం అనేది ఆత్మాభిమానం ఆత్మవిశ్వాసంతో కార్యపరంగా క్రియాశక్తి మయమై కార్య ఫలాని కుపకరించే సాధనంగానూ ఆలోచన కందుతుంది. ఇది వ్యక్తి మనస్తత్వాన్ని బట్టి ప్రకటిత మవుతుంది. అదీ సందర్భాన్ని బట్టి స్థితి హేతువులతో ఆవేశం ఆవేదన కోపం అభిమానం కర్తవ్యం బాధ్యత మొదలైన అంశాలు కారణంగానూ ప్రసార రేఖల్ని పొందుతుంది. ఒకే వ్యక్తిలో వివిధ సందర్భాల్లో భిన్న భిన్నంగా గోచరించడమూ చూడవచ్చు. దీనికి తత్కాలంలోని మానసిక స్థితి విషయం అనుబంధం సందర్భం ప్రయోజన దిశ మొదలైనవి ఆవిష్కారానికి దోహదం చేస్తాయి.

కవిత్వంలో సృజనక్రియలో దీని ప్రాధాన్యం స్పష్టం. అహంకారం ఒక కళగా పర్యవసిస్తుంది. అదీ విశేషం. ఒక అందాన్ని మెరపిస్తుంది. రచనలో శిల్ప గుణంతో ఆకర్షణీయతను పొందుతుంది. ఈ ప్రక్రియ (process) లో కవి తనకు సంబంధించిన విషయాన్ని (1) గొప్పగా భావించడం (2) అతిశయంగా వర్ణించడం (3) వర్ణనీయ వస్తువును కప్పేసే విధంగా తన అస్తిత్వానికి ప్రాధాన్యం ఇవ్వడం (4) స్వీయ వ్యక్తిత్వ ప్రభావ ముద్ర పట్ల ఆసక్తి చూపడం (5) ఆత్మ ప్రత్యయాన్ని స్ఫుటంగా బలంగా ఆవిష్కరించడంతో కూడిన మనోరూపం స్పష్టంగా కనిపిస్తుంది. ఇది కొందరు ఉత్తమ కవుల్లో గొప్ప రచనల్లో కొందరు ఉత్తమ నాయకుల్లో గొప్ప కార్యాల్లో నిబద్ధతకూ ఆకర్షణీయతకూ దారి తీస్తుంది. ప్రపంచ స్థాయిలో మినహాయింపులు లేకుండా ఆ శ్రేణికి చెందిన రచయితలందరికీ వర్తిస్తుంది. అయితే ఆ కవుల్ని అభిమానించే వారూ ఆ కవిత్వాన్ని ప్రేమించేవారూ ఈ మనోరూపానికెంతో ఉత్సాహపడతారు, మానసికంగా ఉత్సాహాన్ని పొందుతారు. సహృదయులు దీన్ని కళారూపంలో భాగంగానూ పరిగణిస్తారు. రచనా శిల్పాన్ని గుర్తిస్తారు. వీటిలో కొన్ని "ఆత్మాభిమాన" గుణంచేత ఆ పైన ఆ భాషా

సాహిత్య సంస్కృతులకూ ఆ దేశ జాతి ప్రశస్తికీ ప్రాతినిధ్యం వహించడమూ జరుగుతుంది. ఇది కాలం గడిచే కొద్దీ చరిత్రలో కనిపించే వాస్తవం. ఇక కవిత్వ విషయానికి వస్తే ఆత్మ ప్రత్యయం కొన్ని సందర్భాల్లో కవి వ్యక్తిత్వ ప్రకాశనంతో కళాత్మకతను పొందుతుంది. రచనా శిల్పం చేత ఆకర్షణీయతను కలిగి ఉంటుంది. దీన్ని విశేష స్థితి చేత "అహంకార కళ"గా పేర్కోవడం సముచితం.

ఒక స్థాయికి చెందిన పరిణత కవి వ్యక్తిత్వంలో ఏదో ఒక రూపంలో 'అహంకార' లక్షణం విహితమై ఉంటుంది. మూల హేతుత్వాన్ని పొందుతుంది. కొన్ని సందర్భాల్లో ఉద్వేగంతో ప్రత్యక్షంగానూ కొన్ని సందర్భాల్లో సంయమనంతో పరోక్షంగానూ అవగతికి వస్తుంది. దీనికి సంబంధించిన అనేకమైన కథలూ కవిత్వమూ సాహిత్య జగత్తులో దృష్టికి వస్తాయి.

ఒక ప్రసిద్ధమైన పద్యం. దీన్ని ఎందరో సమావేశాలలో ఉదహరిస్తూ ఉంటారు. చర్చకు అవకాశమిస్తారు. కాని చర్చించరు. ఇది రామాయణ కల్పవృక్షంలో అవతారికలోది. "ఎవరి అభిప్రాయాలు వారివి" అన్న సాధారణ సూత్రం ఉన్నప్పటికీ విషయాన్ని వివేచించడం వలన సాహిత్య సమాలోచనం పరిపుష్టమవుతుంది. కొందరికైనా విషయం తెలుస్తుంది. కొత్త కోణాలేర్పడతాయి. అనుమానాలు తీరుతాయి. ఉత్సాహం పెరుగుతుంది. ఆ పద్యం "అల నన్నయ్యకు లేదు తిక్కనకు లేదా భోగమస్మాదృశుండ"నేది. ఆత్మ ప్రత్యయ భాసురమయింది. అహంకార కళ చేత సమున్మీలితమయింది. రచనా శిల్పం చేత ఎందరినో ఆకర్షించింది. ఉదాహరణ యోగ్యంగా నిలిచింది. అందుకు ప్రేరేపించే లక్షణం కలిగి ఉండడం సామాన్య విషయమూ కాదు. దీన్ని పేర్కొనే వాళ్లలో దాదాపు అందరూ ఆ ప్రవాహ వేగంలో పయనించే వారే! కొందరు భయంతో ఒడ్డున నిలిచి చూచే వారూ! చిత్రమేమంటే సాహిత్యంలో ఒక స్థాయికి చెందిన కవిత్వాభిరుచి ఉన్న ప్రతి వ్యక్తీ దీన్ని గుర్తించడం జరిగింది. దీన్ని సంపూర్ణంగా అర్థం చేసుకోవడమో! కళాత్మకతను ప్రశంసించడమో అనేవి వేరే విషయాలు. ఈ పద్యం వినగానే కొందరు మెచ్చుకుంటారు. ముఖాల్లో ఆ వెలుగు కనిపిస్తుంది. ఆ ప్రక్కనే ఉన్న మరొకరు "అర్థంకాలేద"ంటాడు. దీన్ని కొంచెం నొక్కి పలకడం గమనించవచ్చు. ఇక్కడ ఉంది విచిత్రం!

ఈ అర్థం కాకపోవడం అనే విచిత్రం అనేక విధాలుగా ఉంటుంది. ఇది ఎట్లా ఉన్నా! ప్రస్తుత విషయానికి వస్తే! అర్థం కాకపోవడమనేది, వివేచనలో అనేకాంశాల కారణం కనిపిస్తుంది.

1. పద్యంలో సమాసాల్ని సందర్భానికి అనుగుణంగా విగ్రహ వాక్యాలతో సమన్వయం చేసుకోలేక పోవడం. 2. పద్యంలో వివిధ స్థానాల్లో ఛందస్సుతో పాటు అభివ్యక్తి విధం కారణంగా నిహితమైన శబ్దాల్ని భావానుగుణంగా ఒకచోట చేర్చుకోలేక

పోవడం. 3. పద్యంలో భావ పూర్ణతకు సంబంధించిన విభాగాల్ని (units) సరిగా అమర్చుకో లేకపోవడం. 4. కవి ప్రత్యేకతతో ఉండే పద్య నిర్మాణంలోని కట్టు కొత్తది కావడం. 5. ఆ పద్యానికి వెనుక ముందూ ఉన్న సన్నివేశాన్ని సందర్భాన్నీ స్థితిగతుల్ని వదిలి వేయడం. 6. పద్యం మొత్తం మీద కవి హృదయ గతమయిన భావనా క్రియను ఖండఖండంగా చూడడం, ఏకరూపంగా గుర్తించకపోవడం. 7. కవిని గురించి కొందరి విషయంలో మరీ వ్యక్తిత్వం పట్ల ఇంతకు ముందే ఏర్పడిన వ్యతిరేకమయిన అభిప్రాయాల కనుగుణంగా ఏర్పడే దృష్టికోణంలో చూడడం. 8. అల్పమైన లౌకికమైన సంకుచితమైన పరిధుల్లో ఆలోచన వర్తించడం. 9. సైద్ధాంతిక విభేదాలకు పెద్దపీట వేయడం. 10. సభను సమావేశాన్ని అల్పస్థాయిలో అరించే విసుర్లా కబుర్లా వేసి ఆకట్టుకునే విమర్శకు ప్రయత్నం చేయడం. 11. మానసికంగా సమాన ధర్మాన్ని అవసరమైన స్థాయిలో అవలంబించకపోవడం. 12. దేన్ని ఎట్లా చూడాలి అన్న స్థాయి భేదాల్ని గుర్తించకపోవడం, సరియైన అవగాహన కలిగిన వివేచనపై శ్రద్ధ లేకపోవడంతో పాటు సాహిత్యేతరమైన అంశాలకు ప్రాధాన్యం ఇవ్వడం.

వీటిలో ఏవైనా కావచ్చు. చాలా భాగం పద్యానికి సంబంధించిన బాహ్యమైన ఆవరణానికి సంబంధించినవే ఉన్నాయి.

ప్రస్తుతం పేర్కొన్న పద్య విషయంలో ఎత్తుగడలో ఆకర్షణ ఉంది. నన్నయ తిక్కన ఇరువురూ మహాకవులు! తెలుగు సాహిత్య చరిత్రలో సమున్నతమైన గౌరవ స్థానాన్ని పొందిన వారు. వారిని పేర్కోవడం ఆరంభం కావడం పద్యంలో భావ స్థానానికి ఉన్నతమైన స్థాయిని లభింపజేస్తుంది. అంతవారికీ లేని అంశం ఒకటి కవి భావనలో మెలగింది. ఇదొక చమత్కారమైన ఊహా విలసనం! దాన్ని గురించి ఉత్సుకత సహజం! ఒక విషయమేమంటే, పద్యం మొదలు పెట్టగానే ప్రవాహ సదృశంగా రచన పరుగెత్తుతుంది. మెరపు తీగెల్లా భావం అల్లుకుంటుంది. ఇది రచనా శిల్పానికి సంబంధించింది.

నన్నయ తిక్కనలకు లేని అంశం. ఒక భోగం, భోగం అంటే సంపద యొక్క సుఖానుభవం. సంపద అనేది దేనికి సంబంధించిందైనా కావచ్చు. ఇక్కడ శిష్య సంపదకు చెందిన భోగం, మానసికమైంది. 'ఆ'భోగం – నిర్దిష్టమైంది అనితరమయింది సంపూర్ణమయింది. పద్యంలో ఇక్కడితో ఒక విభాగం (unit) అయింది. ఆలోచనకు స్వల్ప విరామం!తో "అస్మాదృశుండు," ప్రత్యక్షంతో కవి ప్రమేయం మొదలైంది. వీరివంటి వాడు! వీరితో సమానమైన వాడు! ఎవరితో? నన్నయ తిక్కనలతో నన్న సూత్రాన్ని అందుకోవడం సులభం! ఊహగతంగా భావగతమైన సంబంధాన్ని అందుకోవడం కవిత్వంలో ఉన్నదే! ఇక్కడ "అహంకార" స్పర్శ ఉన్నట్లు అనిపిస్తుంది. అయితే కవికి సంబంధించిన సంపూర్ణమైన వ్యక్తిత్వ స్ఫూర్తితో సందర్భంతో అనుమానం పరాస్తమయ్యే

అవకాశమూ ఉంది. నన్నయ తిక్కన విశ్వనాథ కవులుగా వారి వారి విశిష్టతలు వేరు, కాని వారిని నిలిపే స్థాయి మాత్రం ఒకే పంక్తిలోనన్న విశేషార్థం మెదలుతుంది. దీన్ని అంది పుచ్చుకున్న విశేషణం “అలఘు స్వాదు రసావతార ధిషణాహంకార సంభార దోహల బ్రాహ్మీమయ మూర్తి”! అన్నది. ఇది దీర్ఘమైన సంస్కృత సమాస బంధురమయింది! చర్చకు స్థానమయింది. అయితే ఒక సుగుణం ఉంది. సమాసంలో పదాల చలనం ప్రవాహంలో అలలుగా సాగింది. నాలుగు చోట్లనే సంయుక్తాక్షరాలు కనిపిస్తాయి. ఇందులో దీర్ఘాక్షరాల ప్రసారగుణం రచనకు సుగమత్వాన్నీ సుస్వరతనూ ప్రసాదించింది. పద్యప్రియుల్ని అలరించే శిల్ప విన్యాసం ఉన్న సమాసం! ఆరంభం నుండి చివరిదాకా ఆగకుండా సాగే ప్రవాకతతో అనుభవాన్ని వేగవంతం చేస్తుంది. లఘువు కానిది, అలఘు అంటే గొప్పదీ మహనీయమైందీ. స్వాదువయింది ఇంపైంది రుచికరమైంది. ముఖ్యమైన రసం యొక్క ఆవిష్కారమూ దీనికి సంబంధించిన బుద్ధి చేత కలిగే “అహంకారం” ప్రసక్తమయింది. ఇందులో తాను చేపట్టిన రామాయణ రచనా సత్కార్యాన్ని చక్కగా నిర్వహించే ఆత్మ ప్రత్యయం కలిగింది. అభిలాష ఉత్సాహం కలిగిన “బ్రాహ్మీమయ” రూపం, కవి సృజన వ్యక్తిత్వాన్ని బింబిస్తుంది. మహనీయమయిన మనోజ్ఞమయిన రసం యొక్క ఆవిష్కారాన్ని – దీనికి హేతువయిన బుద్ధి వల్ల కలిగే అహంక్రియను వహించే అభిలాషతో సరస్వతీ రూపం ఉన్మీలితమయింది. సమాసంలో “ధిషణ”, మరియు “బ్రాహ్మీమయ మూర్తి” మొదలైన పదాలలో అనురణన శబ్ద సౌందర్యం అర్థ విస్తృతితో పద్యానికి కొత్త శక్తి నిస్తున్నాయి. దీన్ని మించి కావ్యానికి ఆత్మ యైన “రసోవైసః” తత్త్వాన్ని ఉద్దేశించింది. ఉదాత్త శ్రేణిని తలపిస్తుంది. (దీనికి సాహిత్య తత్త్వ శాస్త్రాలకు సంబంధించిన వివరణం వేరు) ఇటువంటి విశిష్ట లక్షణాలు కలిగిన కవి ఆ మహా గురువులకు శిష్యుడయినాడన్న మాట, సత్కీర్తి పద్యంలో ప్రభావ స్థానాన్ని వహించింది. అది ‘అన్యోమ పేశల చాంద్రీమృదు కీర్తి’తో సంపన్నమయింది. ఈ శోభావహమైన యశోరూపం నన్నయ తిక్కనలకు లేదని – అదొక విశేషమైన భోగమనీ కవి కల్పన! రమణీయమైంది. కవిత్వంలో కల్పనకు గల స్థానం అమేయమయింది. తమ గురువుల గొప్పదనాన్ని సంభావించడంలో పొందే తృప్తి ఆనందం ప్రకాశిస్తాయి. ఇది చమత్కారమైన భావన! వాగ్వైచిత్రికి సంబంధించింది మాత్రమే. దీన్ని కల్పనా ఛాయలోనే దర్శించవలసి ఉంటుంది. “బ్రాహ్మీమయ మూర్తి శిష్యుడయినా” దన్న కీర్తి ఆకాశమంతా వ్యాపించింది. ‘అ’ సమంతాత్ అన్న అర్థంలో మొదటి నుండి చివరి వరకూ సంపూర్ణంగా ఆకాశాన్ని వెన్నెల వలె హ్లాదమయం చేస్తుంది. వెన్నెలకు పేశలత్వం కీర్తికి మృదుత్వం గురువుల అందమైన మెత్తనైన శిష్యవాత్సల్య వ్యక్తిత్వాన్ని భావింప జేస్తున్నాయి. ఇందులో పేశలత్వం అందానికీ (చక్కదనానికీ) మృదుత్వం మెత్తదనానికీ కీర్తిపరంగా అన్వయ శోభను పొందేవి. ఈ హ్లాదకరమైన శోభాభోగం ఎవరికీ లేదన్నది కల్పనా రమణీయమైంది.

ఈ పద్యం ఆధునిక కాలంలో వెలువడిన సంప్రదాయ కవిత్వంలో విశేషఖ్యాతిని పొందింది, స్థిరపడింది. ఇందులో కవి వ్యక్తిత్వం లోని ఆత్మ ప్రత్యయంతో దీప్తమయ్యే భావ జగత్తు సహృదయుల్ని ఆకర్షిస్తుంది. ఇదొక "అహంకార కళ"గా రచనా శిల్పం చేత వాఖ్యానానికి వీలు కల్పిస్తూంది. ఉత్తమ గురువుకూ ఉత్తమ శిష్యాను బంధానికీ సంబంధించిన అనుభవం ఒక భోగ సదృశమయింది. అందరికీ లభించదు. తెలుగు సాహిత్యంలో పూర్వం ఎవరికీ ఈ విధమైంది లభించలేదని కవి అభిప్రాయం. ఈ యశోరూపం శుభ్రమైందీ, విస్తారమైందీ మనోజ్ఞమయిందీ. దీన్ని కల్పనా రమణీయమైన గురుశిష్యుల అనుబంధ చిత్రణంగానే చూడవలసి ఉంది. ఎవరినీ ఎక్కువ తక్కువ చేసి చూపడం కాక వాగ్వైచిత్రిని మాత్రమే! ఇందులో చూడవలసి ఉంది

**"అల నన్నయ్యకు లేదు తిక్కనకు లేదా భోగ మస్మాదృశుం**
**దలఘుస్వాదు రసావతార ధిషణాహంకార సంభార దో**
**హల బ్రాహ్మీమయ మూర్తి శిష్యుడయినాడన్నట్టి దావ్యోమపే**
**శల చాంద్రీ మృదుకీర్తి చెళ్ళ పిళ వంశ స్వామికున్నటుగన్"**

ఈ పద్యంలో కవి పేరు లేదు, కవి అంతస్స్వ రూపం కవిత్వ వ్యక్తిత్వ పరంగా చిత్రితమయింది. సమకాలీనంగా కొందరు ఒక్కొక్క కవి వ్రాసిన కవిత్వాన్ని మన్నించక పోవడం ఇష్టపడకపోవడం నిరసించడం వెనుక కారణాలెన్నో ఉంటాయి. 1. సైద్ధాంతిక విభేదాల వల్ల 2. గొప్ప కవుల విషయంలో పద్య రచనలో వారి ముద్రను తలపించే ఒక ప్రత్యేకమైన కట్టు ఉండడం - దానితో పరిచయం లేకపోవడం వల్ల 3. అభివ్యక్తిలో శబ్దాల ఎన్నిక వాటి పొందిక భావ ప్రసారం నిర్మాణ విధం అప్పటికి ప్రచురంగా ఉన్న దానికన్నా భిన్నంగా ఉండడం వల్ల 4. పద్యంలో లో పొరల్లో నిక్షిప్తమయిన తాత్త్వికమైన ఆధ్యాత్మికమైన స్పర్శను అందుకోకపోవడం వల్ల 5. విశిష్టమైన స్థాయిలో ఆవిష్కృతమయిన భావరూపాన్ని ప్రత్యక్షీకరించు కోలేకపోవడం దీనికి తగిన పరిజ్ఞానం లేకపోవడం వల్ల - జరుగుతుంది. దీని స్వరూపంతో పరిచయమూ అవగాహన ఏర్పడితే బహు సులభంగా అనుభవ వేద్యమవుతుంది. ఇది అన్ని కాలాల్లోనూ అన్ని దేశాల్లోనూ ఉన్నదే. కొంత సమాన గుణంతో అంటే కవి అంతర్యాన్ని గ్రహించే సాధన సంపత్తిని పొందడం చేత కాస్త సహనభావంతో కేవలం సాహిత్యపరమైన జిజ్ఞాసతో అధిగమించవచ్చు. పోనుపోను కాలం మీద అట్లాగే జరుగుతుంది.

ఉత్తమమైన సృజనశక్తి గల మహాకవుల్లో 'అహంకారం' ఒక కళగా భాసిస్తుందనీ ఇది వాగ్విలసంతో అభివ్యక్తి శిల్పంలో భాగంగా ఆకర్షణీయమైన రూపాన్ని పొందుతుందనీ ప్రతిపాదించడమే ప్రస్తుతోద్దేశం. వేరే అంశాల్ని స్పృశించలేదు. ఈ పద్యాన్ని విశ్వనాథలో 'అహంకారకళ'కు సంబంధించిన అభివ్యక్తి శిల్పఖండంగానే భావించడం సమంజసం.

## (5) జాషువా ఆధునిక కవిత్వ వ్యక్తిత్వం - స్పందన

రస హృదయంతో మానవీయమైన విలువల్ని భావింపజేసేది జాషువా కవిత్వం. వ్యక్తిగతమైన దుస్థితి నుండి సమాజపరమైన అసమాన గతుల దాక వివిధ శక్తుల సంచలనంతో ఈయన రచనల్లో వస్తువు విశ్వభావన వైపు ఉన్ముఖమైంది. యాభై అరవై ఏండ్ల క్రితం దేశంలో నెలకొన్న స్థితి వేరు. ఈనాటితో పోలిస్తే చాలా వెనుకబడిన దాని క్రిందే లెక్క. తన చుట్టూ నిరాకృతులూ దూరీకృతులూ అయిన కొందరూ, దీనులూ వంచితులూ అయిన మరి కొందరూ ముఖ్యంగా దళితులూ వస్తువుకు కేంద్ర స్థానాలుగా ఉన్నారు. ఈ అభాగ్య దరిద్ర సమూహాల పట్ల సానుభూతి కనబరచడంతో ఆగిపోకుండా, వాళ్ళ బాధలతో కష్టాలతో ఒకటై వాళ్ల పక్షం వహించే కవి బాధ్యత అనితరమైంది. కరుణ హృదయంతో, వేదనా స్పందనతో సాహిత్య ప్రపంచంలో హతాశుల సమస్యల్ని అవగతం చేసుకుని ప్రతిస్పందించిన ఏకవీరుడు జాషువా. దీనుల పట్ల తిరస్కృతుల పట్ల వంచితుల పట్ల కవి ఆత్మీయత అనితరమైంది.

ఫిరదౌసి, గబ్బిలం మొదలైన కృతుల్లోను ఇతర ఖండికల్లోను, వస్తువు ఎన్నికలో దాని నిర్వహణలో ఏర్పరచుకొన్న లక్ష్యంలో ఈ అంశాల్ని స్పష్టంగా చూడవచ్చు. ఈ కారణంగా ఈనాడు ప్రచలితంగా ఉన్న దళిత స్పందనం, ఈయన కవిత్వ పరిధిని పెంచుతూంది. కాలం గడిచే కొద్దీ కొత్త కొత్త భావక్షేత్రాలకు ఆస్కారంగా విలసిల్లడం గొప్ప రచనల ప్రత్యేకత. ఈయన రచనల్లో సామాజిక పురోగమన తత్త్వం పోనుపోను సందర్భాన్ని అన్వయ గుణంతో ఆకర్షించడం సహజంగా ప్రాప్తించింది. ఇది అంటే దళిత స్పృహ ఈయన కవిత్వంలో ఆధునికమైన శక్తి పరిధిని పెంచుతూంది. సామాజికమైన బాధ్యతను తలపింపజేస్తూంది.

ఈ దృష్టితో చూస్తే జాషువా రచనల్లో గబ్బిలం హృదయ స్థానీయమైంది. ఇది కన్నీటితో స్విన్నమైన సృజనరూపం. భరతమాత కడగట్టు బిడ్డ ఒక పరమ దరిద్రుని నికృష్టమైన జీవిత చిత్రణంతో దీన హీన దళిత ప్రపంచానికి ప్రాతినిథ్యం వహిస్తోంది. అతడు కైలాస వాసికి పంపే సందేశం ఒక కరుణ తరంగం, వాస్తవమైన గతిశీలం కలిగింది. గబ్బిలం అక్కడికి వెళ్ళే వరకూ, అనేకమైన చారిత్రక సామాజిక స్థితిగతులు చిత్ర పరంపరవలె క్రమిస్తాయి. ప్రస్తుత సామాజిక వ్యవస్థలో నెలకొన్న ఆర్థికమైన విషయ గతులూ, వాటి పరిమితులూ ఏ విధంగా నికృష్టమైన దశకు దారితీసేది మన దృష్టికి వస్తుంది. ఈ భౌతికమైన రూపం వెనుక నుండి, కరుణాత్మకమైన మనోరూపం దీనహీన జీవితాల అంచుల్లో నుండి ఉద్గమించింది. ఈ స్పర్శతో జాషువా కవిత్వానికి ఒక ప్రత్యేకత సిద్ధించింది.

**"నాడు కన్నీటి కథ సమన్వయము సేయ**
**ఆర్ద్ర హృదయమ్ము కూడ కొంతవసరమ్ము"**

సమాజంలో భౌతికతలంపై ఆర్థిక శక్తుల ప్రాబల్యమూ, వాటి విపరీత ధోరణులు, దోపిడీలూ వాటి దుష్పరిణామాలూ అట్లా ఉంచి, వైయక్తికమైన ఆర్ద్రత ఎట్లా లోపించిందీ, హృదయానుబంధం ఎట్లా కొరవడిందీ, తెగిపోయిందీ మనసులో మెదలుతుంది. ఈ కారణంగా ప్రజల్లో కొన్ని సమూహాలకు సమూహాలు విదళితులయ్యారు. తిరస్కృతులయ్యారు. దూరభావాన్ని పొందారు. వీరిలో కొందరికి గబ్బిలాలు నివసించే స్థానమూ ఆవాస యోగ్యమైంది. వీరిపట్ల కవి హృదయం వ్యక్తిగత సానుభూతితో పాటు, సమాజ గతమైన ప్రేమనూ ఆకాంక్షిస్తోంది. జీవితంలో అనేకమైన అనుభవ పరంపరలతో పీడిత దళిత ప్రజల పక్షం వహించిన ఈ కవిలో శ్రమశక్తిని గురించి శ్రామిక జీవితాన్ని గురించి కన్పించే అవగాహన దళిత స్పృహకు బలాన్ని ఇస్తోంది. కవిత్వ లక్ష్యాన్ని నిర్దేశిస్తోంది. దీని సీమల్ని పెంచుతూంది. హేతుదృష్టికి పదునూ వెలుగునూ ఇస్తోంది.

"వాని రెక్కల కష్టమ్ము లేనివాడు సస్య రమ పండి పులకింప సంశయించు వాడు చమ్మట లోడ్చి ప్రపంచమునకు భోజనము పెట్టు వానికి భుక్తి లేదు". శ్రమ చేసే శక్తులు ఒకవైపూ, ఆ శ్రమ ఫలాన్ని ఆరగించే శక్తులు మరోవైపూ ఇరువురి మధ్య పెద్ద అఖాతం! ఎన్నో శతాబ్దాలుగా ఉంది. పూడ్చరానిదిగా ఏర్పడింది! శ్రమ శక్తి కొల్లగొట్టబడుతూన్న యధార్థ జీవన స్థితిగతులు చిత్రితమైనాయి. పంట పండించే చేతులు, శూన్యంగానే మిగిలిపోయాయి.

"ఈ అభాగ్యుల రక్తమ్ము నాహరించి ఇనుప గజ్జెల తల్లి జీవనము సేయు" కష్టాలతో క్రుగ్గే దరిద్ర జీవిత రూపానికి ఇనుప గజ్జెల తల్లి సంకేతింప బడింది.

సమాజంలో చారిత్రకంగా ఏర్పడ్డ ఈ వ్యత్యాసం కాలం గడచే కొద్దీ పెరుగుతూనే పోయింది. అప్పుడప్పుడూ ఏవో అభయ ముద్రలతో ఊరడించే పలుకులతో వచ్చారు, వెళ్ళారు. బుద్ధుడూ ఇటీవల మహాత్ముడూ ఏదో కొంత సరి చేసే ప్రయత్నం చేశారు. అయితే మార్క్సిజం ప్రవేశంతో సైద్ధాంతికంగా వ్యవస్థాపరంగా మూల రూపంలో మార్పుల కారణంగా పరిష్కార మార్గానికి విస్తృతమైన అవకాశాలు లభించినట్లని పించింది. సంపూర్ణ విజయం ఇంకా దూరదూరంలోనే ఉంది. ఇక్కడ ఖండ ఖండంగా కొంత జరిగింది కాని ఇది సరిపోదు. అన్ని రంగాల్లో మార్పుకు సంబంధించిన స్పృహనూ వాతావరణాన్నీ నిర్మితమయిందనే మాట వాస్తవం. ఆకలి తీరని, కనీసం అవసరాలు నెరవేరని బ్రతుకులతో క్రుగ్గే వారూ సమయ సందర్భాల్ని బట్టి పీడితులు గానూ దళితులుగానూ ఆలోచనలో నిలిచే మూల రూపం ఒకటే!

**"వాని తలమీద పులిమిన పంకిలమ్ము**
**కడిగి కరుణింప లేడయ్యె గగన గంగ"**

ఈ దేశంలో అతి పవిత్రమైన గంగా జలం కూడా శుభ్రపరచలేని పంకిలం ఉంది. అది అభాగ్యుల తలపైనే నిలిచింది. ఆధ్యాత్మిక చింతనతో పూతమైన వాతారణంలోనూ అస్పృశ్యత ఒక కళంకం వలె జాతి జీవితంలో మిగిలే ఉంది. ఇది చరిత్రలో దయనీయమైంది సమగ్రతను భంగం చేసే విధంగా పరిణమించింది. సంపూర్ణతను కుంఠితం చేసే విధంగా తయారైంది. ఇది ఉజ్వలమైన భారతీయ సంస్కృతీ బింబంలో బాధించే చీకటి ముద్ద! ఈ మచ్చవంటి చీకటి తొలగి పోవాలి. వెలుగుతో తళతళలాడాలి. పూర్ణబింబంలో ఒకటై పోవాలి. ఈ మహా ప్రయత్నానికి మహాకవి కోరేదీ, సానుభూతి, సహనం, స్నేహంతో కార్యాచరణమూ. జాషువా కవిత్వంలో మానవ ప్రేమ – సమాజంలో సమత ధ్వనిస్తాయి.

సబర్మతి ఆశ్రమంలో గాంధీజీ దర్శనం స్వాతంత్ర్యోద్యమంతో పాటు హరిజనోద్యమాన్నీ ఆకర్షించింది. ఈ కవి హృదయం గాంధీజి వెలుగు జాడల్ని గుర్తించింది.

"ఎవరీ అర్ధ దిగంబరేశ్వరుడు! మా ఇండ్లన్ ప్రవేశించె" నంటూ సందర్భం వేరైనా సంతోషంతో కవి మనస్సు ఉప్పొంగిపోయింది! ఈ మనస్వి మహాత్ముడు కలలుగన్న "హింసా కాలుష్యము లేని భవిష్య ద్దివ్య సామ్రాజ్యాన్ని" దర్శిస్తాడు. జాషువా వ్యక్తిత్వంలోని ఆలోచనా రమణీయమైన ఈ స్థితి ఈనాటి సమాజానికి ఆవశ్యకమైంది. దేశ సమైక్య భావన అంతస్సూత్రంగా సాగిన మహాకవి రచనోద్యమం నిర్మాణాత్మకమైందే ఒక అభాగ్య జగతికీ దళిత ప్రగతికీ ప్రేరకమైంది.

నవ్య సంప్రదాయ కవుల నుండీ మరియు భావకవుల నుండీ పృథఃకరింపబడిన జాషువా కవితా వ్యక్తిత్వం స్ఫుటంగా మన దృష్టికి వస్తుంది. ఇది వివిధ స్థాయిల్లో విద్యావంతుల్ని ఆకర్షించింది. సమాజ స్థితిగతుల్ని గురించి ఒక్కోమారు పునరాలోచనకు గురిచేసింది. అశేష ప్రచార బంధురమై భావ కవుల కీర్తి శిఖరాల్ని జాషువా ఉజ్వలమైన యశోబింబం కప్పేసింది. మరీ ముఖ్యంగా ఆ కాలంలో ఆధునికుల్లో తెలుగు కవిత్వం పట్ల అభిలాషను నిలిపింది. అభిమానాన్ని పెంపొందించింది. చారిత్రకంగానూ ఆంగ్ల విద్యా ప్రభావంతోనూ హేతు దృక్పథం చేత ఏర్పడిన సంస్కరణ పథంలో పరివర్తన కోరే కొత్త వాతావరణాన్ని వికసింపజేసింది. ఆ కాలంలో జాషువా కవిత్వం సామాజిక సంకల్పంగా ప్రముఖమైన పాత్రను నిర్వర్తించిందనే చెప్పాలి.

సంప్రదాయ మార్గంలో పరిక్షుణ్ణమైన పద్యాన్ని ఆధునిక భావ ముద్రతో, అభివ్యక్తి సౌందర్యంతో ప్రజల నాల్కలపై నర్తింపజేసిన శిల్పి జాషువా పద్య ప్రపంచంలో ప్రగతి భావాల్ని ప్రవేశపెట్టి విజయాన్ని సాధించిన కీర్తి ఈయనదే! ఈ ప్రయత్నం పద్యంతో

ఏర్పడిన బంధాన్ని దృఢతరం చేసింది. అంతేకాక హృదయాకర్షణీయమైన స్థానంలో నిలిపిన మాట వాస్తవం. ఇటు శైలీ సమ్మోహనంతో సంప్రదాయ నిరతుల ఆమోద ముద్రను పొందింది. ఇటు అభాగ్యుల జీవితాన్ని వస్తువుగా చేసికొని ఆధునికుల అభిమానాన్ని చూరగొంది.

దీన్ని సమాలోచనం చేస్తే సంప్రదాయం పట్ల అభిమతితో సంస్కరణ దృక్పథంతో పరివర్తన లక్ష్యంతో ఆయన వ్యక్తిత్వం రూపొందినట్లు కన్పిస్తుంది. విశ్వజనీన రేఖల్ని సంతరించుకుంది. ఇది కుల మతాల కతీతమైన స్థాయిలో సార్వజనీనమైన సమాజ శ్రేయోభావనతో పరిణతమైందిగా కన్పిస్తుంది.

**“విశ్వమానవ గోత్రేయ వీరులైన**
**కవులకున్ కర్మ బంధాలు కట్టిపెట్టి**
**పులుముచుందురు తల మీద కులమురంగు**
**తొలగిపోవదు లక్ష సబ్బులకునైన”**

జాషువా జీవితంలో తటస్థపడిన కొన్ని విచిత్ర సంఘటనలు అతని వ్యక్తిత్వంపై ప్రభావాన్ని నెరపాయి. వాటిలో ఒకటి కులం పేరుతో ఎదురైన అనుభవం. తిరస్కారానికీ అవమానానికీ గురిచేసింది. ఈ స్థితి ఇతనిలో వేదనా శిఖల్ని రగిల్చింది. హృదయం బాధతో పరితప్తమైంది. ఇంటి ముఖం పట్టాడు. ఇంట్లో తిక్కన మహా భారతాన్ని శాంతంగా పఠించడం మొదలుపెట్టాడు. మనిస్వియైన జాషువా, వ్యర్థమైన విజల్పనలతో కాలం గడిపే కన్నా సార్థకమైన సాహిత్య వ్యాసంగాని కుపక్రమించాడు. ఈ సద్భావన క్రమంగా మనఃపరిణతికి దారితీసింది. అతనిలో సంకల్పం దృఢతరమైంది. ప్రతిభ నవనవోన్మేషంగా విజృంభించింది. శక్తి ప్రవాహానికి గమనం సిద్ధించింది. ఒకదారి ఏర్పడింది. వేదనా భరితమైన కవిత్వం ఉత్తమ స్థాయినందుకుంది. స్వయం కృషిపైనే ప్రయాణం సాగించింది. ఇంకా అవమానితులూ తిరస్కృతులూ దళితులూ వొద్దున నిలబడే ఉన్నారు. వీరంతా ఈయన ఆలోచనా ప్రపంచంలో తిరిగే వారే! ఒక సందర్భంలో ‘గవ్వకు సాటిరాని పలు గాకుల మూక లుపేక్షసేసిన న్నెవ్విధి దూరినన్ నను వరించిన శారద లేచిపోవునే, ఇవ్వసుధా స్థలిన్ పొడమరే రసలుబ్ధులు గంట మూనెదన్ రవ్వలు రాల్చెదన్ రవ రవల్ సవరించెద ఆంధ్ర వాణికిన్.

తన ప్రతిభచేత, సంస్కారం చేత వరించిన శారద అల్ప మనస్కుల ఆగడాలకు తన హృదయం నుండి నిష్క్రమించదు. విపరీతవాదుల కుండే విలువ అంతం మాత్రమే! రసలుబ్ధులైన సహృదయులే దీనికి ప్రమాణం! అతని ఈ ఆత్మ ప్రత్యయం కవితా వ్యక్తిత్వానికి వెన్నుముక వలె పని చేసింది. విద్యా శక్తికి దేశ కాలాలతో పనిలేదు, కులమతాలతో ప్రసక్తి లేదు. వెలుక్కి అంటరానితనం లేదు. ప్రతిభకు అందనిది ఉండదు. ఏవేవో స్వల్ప

కారణాల్ని గురించి పట్టించుకోకుండా తానేదో వేరుగా గాక భారత జాతి జీవన సంస్కృతిలో భాగంగా, తనవంతు బాధ్యతల్ని ఉజ్వలంగా నిర్వహించిన మనిషి, మనీషి జాషువా.

ఈ మనిషి వ్యక్తిత్వంలో అసహనం కోపం ద్వేషం మొదలైన వికార గుణాలకు బదులు సహనం సానుభూతి స్నేహం చోటుచేసుకున్నాయి. ఇవి హేతు సహితమై మానవతారంగంతో ఆలోచనా రమణీయంగానూ కన్పిస్తాయి. వేదనా తప్తమయిన హృదయం నుండి మహితమైన హిరణ్మయ వ్యక్తిత్వం ఆవిష్కృతమైంది. ఇది రచనా స్వరూపానికి జీవ ధాతువైంది. దళిత స్పందనం మొత్తం మీద సామాజిక స్పృహలో భాగమైంది. జాషువా రచనల్లో సంవేదన రసావిష్కారం రచనా శిల్పం మొదలైన కవిత్వ కళకు సంబంధించిన అంశాలు వేరు. ఈ అంశాలన్నిటికీ కేంద్రం, హిరణ్మయ వ్యక్తిత్వమే. ఇది ఆలంబనంగా పనిచేసింది. పుటపాక ప్రతీకాశమైంది. తెలుగుభాష ఉన్నంతవరకూ జాషువాను మహాకవిగా నిలుపుతుంది.

జీవితంలో ప్రాప్తమైన అనుభవ పరిణతి క్రమక్రమంగా హేతుబలంతో నిర్మాణాత్మకమైన ప్రతిక్రియకు దారితీసింది. ఇది మౌలికమైన ఆత్మరూపాన్ని ప్రకాశమానం చేసింది. జాగ్రత్తగా పరిశీలిస్తే సాహిత్య ప్రయోజనాన్ని, తత్కాలమైన ఆవేశంతో ఏర్పడిన సంకుచిత పరిధుల నుండి బయట పడేసింది. రచనలో సామాజిక స్పృహకు గాఢత్వాన్ని ప్రసాదించింది. అట్టడుగున ఉన్న దళిత ప్రజలకు ప్రేరణగా నిల్చింది. మార్పుకోరే ప్రగతి శక్తులకు బలాన్ని ఇచ్చింది. చారిత్రకంగా పరిశీలిస్తే "నా కవనం ఐహింస సహనంబను ఆయుధమున్ ధరించి" అని ఉద్యమించే గాంధీజీ ప్రభావం ఈ కవిపై అనితరంగా ప్రసరించింది. దేశ స్వాతంత్ర్యోద్యమంతో పాటు మహాత్ముని హరిజనోద్యమమూ అతణ్ణి ఆకర్షించింది. సమస్యను వ్యక్తిస్థాయిలో కాక ఆ పైస్థాయిలో సమాజ శ్రేయస్సుకై పాటుపడే ఆదర్శంతో నిలిపింది.

"నరుడు చేయలేనిదేమిటన్న" ప్రశ్నలో నిక్షిప్తమైన సమాధానం కొండంత అదృశ్య బలాన్ని ఇచ్చింది.

"అమృతము చిల్కి చింతల నవనయించు హృదయము గలట్టి నవ రచయితను నేను" జాషువా కవితా స్వరూపమూ, దాని పరమార్థమూ చారిత్రకంగా నిర్వహించిన పాత్ర గురించి తలెత్తే ప్రశ్నలకు సమాధానం ఉంది.

ఇట్లా ఎన్నో గుణాల సంపుటి చేత ఏ వెనకబడిన ఆధార సూత్రమూ లేకుండా, ఏ దళిత ముద్రా లేకుండా, ఆధునిక యుగంలో గొప్ప కవుల్లో నిలిచే ప్రతిభామూర్తి జాషువా.

**"కలుపుం గోలు తనమ్ము కోలుపడి, ముక్కల్ ముక్కలై, హెచ్చుత**
**గ్గుల తత్త్వాల మహాపిశాచముల ఉక్కుం గోరంజిక్కి, శో**

**షిలు మర్త్యత్వము నుద్ధరించి చనియెన్ శ్రీ గాంధి రాజర్షి కా**
**గల హిందూ సఖ! నిల్పు కొమ్మిక! నిజాంక ప్రాప్త రాజ్యేందిరన్"**

స్వాతంత్ర్యం సిద్ధించాక, మహాత్ముడు రంగం నుండి నిష్క్రమించాక ఇదో వార్నింగ్ మాత్రమే!

సర్వమానవ సమానత, మానవత, ప్రగతి తత్వంతో విశ్వజనీన దృక్పథాన్ని ప్రకాశింపజేస్తోంది నవయుగ కవి చక్రవర్తి జాషువా కవిత్వ వ్యక్తిత్వం.

**"కులమతాలు గీసుకున్న గీతలం జొచ్చి పంజరాన కట్టు వడను నేను**
**నిఖిల లోక మెట్లు నిర్ణయించినగాని తిరుగులేదు! విశ్వనరుడ నేను!"**

## (6) మహైక - కవిరాజ మూర్తి అభ్యుదయ దృష్టి

రెండు మూడు దశాబ్దాలుగా అభ్యుదయ సాహిత్యం ఎన్నదగిన పురోగతినే సాధించింది. సమకాలీన సమాజ రూపాన్ని యధాతథంగా దించడం కన్న సామ్యవాద దృక్పథంతో భావించి, విశ్లేషించి వ్యాఖ్యానించి చిత్రించడం ఈ సాహిత్య ప్రధాన లక్షణం. శ్రీశ్రీ కవితా మార్గంలో అభ్యుదయ భావనతో, ఇలియట్ ప్రభావసూచనతో అవతరించిన కావ్యం మహైక. ఇందులో అభ్యుదయ భావన, స్వేచ్ఛాతత్వం, మానవతా దృష్టి కలిగిన మూర్తి వ్యక్తిత్వం ఇందులో రూపుకడుతుంది. మహైకను స్థూలంగా

1. కవి ఆలోకనం, మానవ జీవన దర్శనం ప్రబోధం. 2. కార్మికుడు, మధ్య తరగతి మనిషి పతితల గాథా కథనం. అని విభజించవచ్చు. ఒక అన్వేషణతో, ప్రశ్నాలోకంతో కావ్యం ఆరంభమవుతుంది.

**"ఎవరో ఎవరెవరో నా శిథిలగృహ ప్రాంగణంలో కేకలు వేస్తున్నారు**
**ఎందరో ఎందరెందరో గొంతులు చించుక అరుస్తున్నారు**
**ఈ జీర్ణ కవాటాన్నెందుకు తడుతున్నారు?.. దేన్ని వెదకుతున్నారు?"**

శిథిల స్థితిలో నున్న పురాతన వ్యవస్థ నుండి, అభ్యుదయాత్మకమైన నవ వ్యవస్థ నిర్మాణాన్ని కవి ఆకాంక్షిస్తున్నాడు. సంతోషప్రదమూ, సుఖం కరమూ కాని ప్రస్తుత సమాజానికి కవి, కార్మికుడు సామాన్యుడు పతిత పాత్రలను ప్రతినిధులుగా గ్రహించి వారిక్లిష్ట సమస్యలనూ దయనీయస్థితులనూ విశ్వజనీన దృష్టిరేఖలతో చిత్రించాడు. అన్నలు తమ్ములు అక్కలు చెల్లెళ్ల అరపులలోని ఆవేదన, గుండెలలోని బాధ, గళంలోని గాద్గద్యంలోని ఆంతర్యం అవగతం చేసుకోడానికి ప్రయత్నించడంలో నిండైన కవిహృదయం భావ చిత్రణలతో కళాబుద్ధి ఒక ప్రమాణాన్నందుకొంది.

**"నీరసించిన మీ కళ్ళలో పరిశ్రాంతి నిలువుటద్దంలోని నీడలా కన్పిస్తుంది**
**సింహం ముందరి వలల ఖండం దరిద్ర జీవిత క్షణక్షణ గండం"**

**"కర్మఫలం కాదు కాదు క్రియలేందే కర్మరాదు**
**కర్మల మర్మాలన్నీ కలవారి దోబూచులు**
**సమాజం మనపై వదలిన వడిగల రేచులు"**

ఈ పంక్తుల్లోని కవిత్వానికి వ్యాఖ్యానమలా ఉంచి, కవిదృష్టిని (attitude) ఎత్తి చూపవలసి ఉంది. ఇది రెండు ముఖాలు కలిగింది. మొదటిది కవి ఊహాశాలిత్వాన్ని, రెండవది సామాజిక బాధ్యతాభిజ్ఞతను సూచించేవి. మొదటిది రెండవదానికి అంగభూతంగా ఉంది. ఇది ఇతనికి గల సామాజిక దృష్టికి ఒదిగిన కవితా ప్రత్యయ హేతువుగా భావించవచ్చు. కర్మ సిద్ధాంతం చాటులో దుర్మార్గాల్ని కప్పి పుచ్చి తమ స్థిరత్వానికి ప్రయత్నించే ఒక వర్గం (పీడకుల) మనస్తత్వం ఎత్తిచూపే వాక్యాలివి. మతం, సాహిత్యం,

అధికారం స్వప్రయోజనాలకు ఉపకరణాలుగా చేసికొని ఒక వర్గం, మరోవర్గంపై సాగించిన ప్రతారణ (exploitation) ఫలితంగా పోనుపోను మార్చు చారిత్రక గతివాద దృష్టితో తప్పని వర్గ సంఘర్షణం సూచితం.

**"పతితుని గుండియ క్రక్కిన క్రోధం**
**నిర్హేతుకమై పోదు పోదు నిర్వీర్యతకు తావు లేదు"**

పీడకులపై పీడితులు, తిరగబడి 'దోబూచులను మటుమాయం చేసి' 'రేగినరేచు' లను అణచివేస్తారనే కవి విశ్వాసం. ఆశా పతాకతో, వెనుకబడిన వారికి ధైర్యమిస్తూ, విశ్వాసం కలిగిస్తూ ఉత్తేజకరమైన మాటలు పలుకుతాడు.

**"నిస్తబ్ధతతో క్రుంగి పోవడం క్షుద్రం**
**దరిద్రులమనుకోవడం మహాదరిద్రం"**
**జీవించడానికి సంఘర్షణ కదిలేందుకు ప్రేరణ**
**అవసరం అన్నలూ! అవసరం" "అకిల జగత్ సోదరులను కలవాలి మనం"**

నాడులూ, సీమలూ, రాష్ట్రాలూ, దేశాలూ, మతాలూ, జాతుల నధిగమించిన సర్వమానవ సౌభ్రాత్ర భావన ఈ కావ్యానికి వెన్నెముకగా గ్రహించాడు కవి. సమాజంలో దుస్థితికి కారకులైన అభ్యుదయ నిరోధకులను ఎదిరించే బలం జవం చేకూర్చుకొని ప్రజలు ధైర్యంతో నిలవాలంటాడు.

**"పారద్రోలాలి ఈ మాంద్యాన్ని విసర్జించాలి ఈ మౌఢ్యాన్ని"**

**"ఏ కిరాతకుని శాసనాలు మీ బ్రతుకును వంచించాయి,**
**హృదయం చిక్కబట్టి ఆశను వరించండి, అధైర్యపడకండి"**

**"గాలిక్షణం స్తంభిస్తే భూగోళం తిరగడం మానదు**
**జీవితం గరళం మ్రింగితే తీపి కోల్పోదు**
**నెత్తురు చుక్కల కాంతిలో జీవితం రంగు కోల్పోదు**
**మందుగుండు పేలితే సూర్యోదయమవదు."**

కష్టాలు, దుఃఖాలు తాత్కాలికాలు. ఆనందం, సుఖం మునుముందు ఉంది. దీనికి కార్యాచరణ అవసరం. అందుకై చేయవలసిన కర్తవ్యబోధ ఇందులో కన్పిస్తుంది. ఆటంకాలు, ఆపదలు చావులు ఒక మహాకార్యసాధనలో లెక్కలోనివి కావన్న భావం చక్కని కవితా రూపాన్ని అందుకుంది. ఉన్నత లక్ష్యంతో నిర్దిష్ట గమనం చేరే ఉత్సాహంతో అభ్యుదయోన్ముఖుడైన కవి సామాజికంగా చూపే తన పాత్ర నిర్వహణకీ భాగం దర్పణం.

మానవ జీవిత కథా భాగం అనాది నుండి నేటివరకూ మానవుడు కేంద్రంగా సాగిన ప్రపంచ చరిత్ర, పీడిత మానవ పరంగా దర్శితమైంది. ఊడల తొట్టెలలో మైమరచి

నిద్రించినప్పటినుండి, తరాల యుగాల చరిత్ర అతణ్ణి తొక్కిరక్కిన స్థితీ, తెగలుగా విడిపోయి కూటికి కుమిలి, బంగారపు దీనారాలకు అమ్ముడు పోవడమో వరసగా చిత్రింపబడినాయి.

**"నా జీర్ణ జీవిత కుటీరం నిలచి ఉంది**
**ఈ ద్వారాన్ని ఎవరో తడుతున్నారు**
**నా గుండియలోకి ఎవరో అవతరిస్తున్నారు."**

శిథిల సమాజం ఇంకా ఊగిసలాడుతూ నిలచి ఉంది. దాని స్థానంలో క్రొత్తది రావలసి ఉంది. అది రూపుమాయడానికి ఇంకా కొంతకాలం పడుతుంది. ఈ పని త్వరగా జరగడానికి కావలసినది వ్యక్తులలో చైతన్యం. దీన్ని గుర్తింపజేయడానికి గుండెలలోకి ఎవరో అవతరిస్తున్నట్లుంది. ఈ రూపం అభ్యుదయ భావసంపుటికి ప్రతీక (Symbol).

జీవన్మరణపు అంచులపై అంచంచల విశ్వాసంతో ఉన్న ఆశాజీవి, అభ్యుదయమతిగా మానవుడీ భాగంలో దర్శనమిస్తాడు. అతనితో కవి తాను మానవతను గుర్తించిన స్థలాలు చెపుతూ సమాజంలోని అసమానత, అన్యాయం, మొదలైన వికృత రూపాల్ని ఎత్తి చూపుతాడు.

**"శూన్యంలోకి దీనంగా చూచే ఖైదీ కన్నులలో**
**ఆకలి కన్నులతో అమ్మవైపు చూచే పసిపాప నీరసవదనంలో**
**కర్షక వీరుని స్వేదబిందు కాంతిలో కార్మికుని కండరాల కదలికలో"**

ఈ భావ పరంపర ప్రజలు బ్రతకడానికి పడే ఘర్షణ, జరిగిన ప్రతారణలో మానవత చితికిపోయి కారుణ్యం పల్లవించే స్వరూపంతో కవి హృదయం పొందే అభేదాన్ని స్ఫూర్తి కట్టిస్తూంది.

**"యుగయుగాల నైరాశ్యం మన బ్రతుకుల యమపాశం"**

నిరాశనూ, నిస్పృహనూ, నిర్వీర్యతనూ, నిరుత్సాహాన్నీ నిరసించినంతగా కవి దేన్నీ నిరసించడు. కష్టాలు నష్టాలు ప్రజల నిజమైన చైతన్య వికాసాన్ని అణచలేవు సరికదా, వర్గ సంగ్రామ స్ఫూర్తి ఉన్న వ్యక్తికి కార్యాచరణకు అధికంగా తోడ్పడుతాయనే కవి విశ్వాసం. ఈ దృష్టితో

**"మన కాళ్ళలో బొబ్బలు దౌర్జన్యానికి చావు దెబ్బలు"** అంటాడు. మానవ సంఘటిత శక్తిపై విశ్వాసంతో మహైకలోని కావ్యార్థాన్ని ప్రకాశవంతం చేసే మాటలతో ఈ భాగం ముగుస్తుంది. ఈ భాగంలో భావ చిత్రణ రీతిలో కవి కెమెరా దృష్టి స్ఫుటంగా కన్పిస్తుంది.

**"మనమంతా మానవులం ఏక వృక్ష భాగాలం**
**మనలో మన చీలిక మన పతనానికి ఏలిక, మృత్యుదేవికి నాలుక"**

రెండవ భాగం (1) కార్మికుడు (2) మధ్య తరగతి వ్యక్తి (3) పతిత వీరి హృదయ వేదనా సమర్పకమైంది. కవి వేదనా స్వభావాన్ని సామాజిక రూపచిత్రణ శక్తిని తెలియజేసేది. వీరొక్కొక్కరూ వరుసగా అనుభవ పరమార్థంగా ఆవేదనను వెళ్ళబోసుకుంటారు. అపుడపుడూ వారి కంఠాల్లో నిరాశ కన్పిస్తుంది. కవి ఏమీ మాట్లాడడు. అతనిపై వారి విషాదస్థితి కథన ప్రభావం సూచితం అదీ పాత్రల ముఖంగానే చెప్పించడంలో రచన కథనాన్ని సంతరించుకుంది. ఉదాహరణకు – **"అదేమిటన్నా నీ కళ్ళలో నీరా"** కావ్యం చివర ఈ మాటలకు సమాధానంగా **"ఆశాపాశాలతో బ్రతకాలి మనం నేటి చీకటి రేపు ఉండదు"** అని ఆశాశబలితమైన వాక్కు వినిపిస్తుంది. ఇలాంటి సంవిధానం శ్రీశ్రీ తరువాత చాలా కొద్దిమంది అభ్యుదయ కవుల్లో మాత్రమే కనిపిస్తుంది.

కార్మికుడు కవి ఆశించిన భవిష్యత్తును కాదనడు. వర్తమాన దుర్భరస్థితి మరచి పోలేడు. మరచిపోక పోవడంలోనే భవిష్యత్తులో ప్రోగుచేసికొన్న ఆశలు సాధించడానికి పూనికకు అవకాశముంది. దుర్భరస్థితిలో తలమునకలుగా నున్న వ్యక్తి, భవిష్యత్తుపై ఆశపెట్టుకొని ఉన్నా ప్రస్తుత స్థితి తలపోయడం సహజం. ఇతడు కర్మవీరుడు. ఇతడు త్రవ్విన నేలబొగ్గు **"ధనవంతుల బ్రతుకుల కుగ్గు"** అయింది. ధనవంతులకి తన శక్తి ప్రాణాధారమైంది. ఇతడు లేనిదే వారి అస్తిత్వమే లేదని ధ్వని.

**"నా కాయం యజమానులు మాగ్నేటులు నా బ్రతుకున దేగవోలె తరుముతూంటె మార్గం తెలియని బ్రతుకుకు తీరం కలదంటావా? అన్నా!"** అన్న కారుణ్య పూరిత కంఠరవంలో నిరాశ ధ్వనిస్తూంది. ఇంతవరకూ వారు 'అరుణోదయాన్ని' చూడలేదు. ఎక్కడ చూచినా 'బ్రతుకులో బాటలో చిక్కులో దృక్కులో "కాకి నలుపు–నలుపు–నలుపు–నలుపు" ఇది ప్రతీకాత్మమైంది. 'బ్రతుకు–బాటలు' 'దిక్కులు–దృక్కులు' చాలా అర్థవంతంగా ఉపయుక్తమైనాయి. ఒక్కొక్కరి బ్రతుకు ఒక్కొక్క మార్గం కలిగింది. మార్గాలు వేరైనా ఇవన్నీ ఎక్కడో కలుస్తూ చీలుతూ సాగిపోయేవి. మార్గాలు మానవులనొక ధ్యేయానికి చేర్చగలవు. ప్రయాణం సుఖప్రదం కానపుడు, ఒక్కొక్కపుడు నిరాశ జనించడం సహజం. దిక్కులు దగ్గరలో పరిమితమై, దూరానికి విస్తృతమై కన్పిస్తాయి. దృక్కులు దగ్గరి వస్తువును పెద్దగా, దూరవస్తువును చిన్నగా కన్పింపజేస్తాయి. దిక్కులకు దృక్కులకు మధ్య అంతరాయముంటే వస్తువు కన్పించదు. దిక్కులు ఆశానిలయాలకూ దృక్కులు భావనా రూపాలకూ, నలుపు అవరోధానికి ప్రతీకలు. పిల్లల ముఖాలు ఆనందరూపాలకూ, అరుణోదయం కవి ఊహలోని నవ సమాజావతరణకు సంకేతాలు. ఈ మాటల్లో ఆశారూపానికీ, భావగమనానికీ అవరోధంగా ఉన్న నిరాశాజనకమైన విషాదస్థితులు వ్యంజితం.

రెండవ విషాదగాథ మధ్య తరగతి వ్యక్తిది. అతడు రచయిత, సైనికుడు, గుమాస్తా మొదలైన రూపాల్లో కన్పిస్తాడు. 'దినదిన గండంతో' అతని 'ఆయుష్యం నూరేండ్లు'. దరిద్రానికి పతనానికి అతని బ్రతుకు భావ్యం. ప్రతి ఉదయం వారికొక 'మహా చెడ్డ

భయం'. 'ఆరోజు గడవడమే ఒక ప్రశ్న. ఉదయం సహజంగా ఆనందప్రదమైంది. ఇక్కడ భయం కలిగించేదిగా భావించడంలో మేరలు మీరిన దుర్భర స్థితి సూచితం.

**"కాషాయాలు కట్టగలం కాని కడుపులు మాడ్చేయగలమా?**
**కండువా కప్పుకోగలం కాని మచ్చలు మాపేయగలమా?"**

ఆకలి చంపుకొని, కష్టాలు దాచుకొని, పైకి నిండుగా కన్పించే మధ్యతరగతి ప్రజల స్థితి చిత్రణం, పై పాదాలలో దాగని సత్యం వలె కన్పిస్తుంది. పాల అబ్బి, చాకలివాడు, ఫీజు లేని కుర్రవాడు పత్రికకు కథ పంపడానికి కానీ లేని రచయిత, దుస్థితులీ విధంగానే చిత్రింపబడినాయి. బ్రతుకు భరించరాక చావుకు పాల్పడినా "మృత్యుముఖం ముందు కూడా No vacancy బోర్డు ఉంది" అనడంలో కారుణ్యం పరాకాష్ఠనందుకుంది.

**"ఇంటావిడ గుండెల్లో వంటపొయ్యి మండుతోంది'**

వంటపొయ్యి మంటలు దేనికవసరమో ఆ వస్తు సముదాయం లేక దాని వలన బాధ గుండెలనే దహించి వేస్తోంది. ఈ పాదాలు వ్యంగ్య స్ఫోరకమైన కరుణమయ రూప చిత్రణలకు ప్రాతినిధ్యం వహించేవి. నిమిషాలు, ఘడియలు అద్దాలు, యుగాలు గతిస్తున్నాయి. కాని మధ్య తరగతి ప్రజల వేదన మాత్రం అణుమాత్రం తగ్గలేదంటాడు. అన్నీ సమస్యలే! కవి మౌనంతో మరొక కథ అంది పుచ్చుకుంటుంది. అది పతిత గాథ!

"అన్నా! మరి నా సంగతి ఎన్నాళ్ళీ దుర్గతి" అని ఆరంభించి సమాజంలో అణగి ఉన్న కామాగ్నికి పతితలే విధంగా ఇంత కాలమూ ఆహుతి ఐపోయేదీ చెప్పబడింది.

**"కామోద్రిక్తుల కళ్ళు చల్లాయి నా బాటకు ముళ్ళు**
**సమాజంలో పాతకుళ్ళు తొక్కింది నాపై పరవళ్ళు"**

సమాజంలో కొందరు హేయమైన వంచితమైన బ్రతుకు గడపడం, కవి దృష్టిలో మరి కొందరి స్వప్రయోజనాల కోసం నియుక్తులై ఉండడం వల్లనే దీన్ని పాత్రముఖంగా వెలువరించడంలో సన్నివేశానికొక ఔజ్జ్వల్యం చేకూరింది. ఇది పాఠకుని మనస్సులో సానుభూతి కలిగించి, ఆలోచింపజేసేది.

**"వరసౌఖ్యపు కాంక్షలతో నా శీలం పరువు తీసింది"**

**"కామాంధులకు నా బ్రతుకు కొవ్వొత్తి**
**కరుగుట తప్ప కాదిందుకాంతి ఉత్పత్తి"**

**"రాత్రిళ్ళు జివ్వుమనే నరాలు నా జీవిత విపంచికి అపస్వరాలు"**

మొదలుగా శబ్ద సంక్షిప్తత, భావ సాంద్రత గల పాదాలు వరుసగా కన్పిస్తాయి. తిండికై, బట్టకై డబ్బు కోసం ఇతరులకు సౌఖ్యం చేకూర్చడానికి అలవర్చుకొన్న నడవడి,

బ్రతుకులోని సుస్వరతను భగ్నం చేసింది. బ్రతుకు అందం పోయింది. నిజమైన ఆనందం రూపుమాసింది. కొవ్వొత్తి వలె కరిగిపోయే వారి బ్రతుకులో, చీకటివలె చివరకు దుఃఖం దాపురించనున్న సూచన ఉంది. బ్రతుకులో కాంతి, మాధుర్యం, ఆనందం ఎక్కడా కన్పించని ఆమె స్థితి చిత్రణలో, వీటి ఆభాసను కన్పింపజేస్తూ కవి ఈ పాత్రను వాస్తవ రేఖలతో తీర్చాడు.

కావ్యపీఠికలో శ్రీ బెల్లంకొండ రామదాసు, శ్రీ రెంటాల గోపాలకృష్ణ 'మహైక' చదువుతూంటె టి.ఎస్.ఇలియట్ Waste Land జ్ఞాపకం వస్తోంది. "మార్క్సిస్టు దర్శనంగల ఉత్తమ కావ్యాలలో మహైక ఒకటి" అన్న మాటలు ఈ కవి విశిష్ట వ్యక్తిత్వాన్ని సూచిస్తుంది. ఇలియట్ సంప్రదాయ తత్వానికీ మార్క్సు విప్లవ సిద్ధాంతానికీ ఏ మాత్రం పొత్తు కుదరదు. ఇలియట్ ఆంగ్లో కాథలిక్ మతంలో సంపూర్ణ విశ్వాసం కలవాడు. రాజకీయాలలో royalist గా, కళారంగంలో classicist చాటుకున్నాడు.

ఇలియట్ Waste Land ఇరవయ్యో శతాబ్దపు యాంత్రికయుగంలోని మానవ జీవిత చిత్ర పరంపరల సంపుటి అనవచ్చు. ఇందులోని భావరూపాలు (images) ఒకదాని తరువాత వేరొకటి flight after flight సంయోజింపబడి ఉంటాయి. ఇవి దశలు దశలుగా ఎదురౌతున్నా రచనలోని ప్రవాహగుణం, శిల్పరీతి మనస్సును ఆకట్టివేస్తాయి. రచనలోని ఉద్రేకం కన్న సంయమనం, చాతుర్యం ఎక్కువ, భావరూపాలు ఎక్కువగా కన్పిస్తాయి. అవీ అస్ఫుటంగా ప్రతీకాత్మకంగా ఉంటాయి. వీటిని మనస్తత్వ విశ్లేషణ విధానంతో పలువురు విమర్శకులు వ్యాఖ్యా విభాసితం గావించారు. మహైకలోని భావ చిత్రాలు, స్ఫుటంగా కవి సహజోద్రేక స్వభావం చేత ఎక్కడికక్కడ కుండపోతగా వర్షించినట్లు కన్పిస్తాయి. వేస్ట్‌ల్యాండ్‌లో, మధ్య మధ్య నాటకీయ ధోరణిలో భిన్న కంఠ ధ్వనులు వినిపిస్తాయి. ఇవి అంతశ్చేతనా జగత్తు (sub-conscious state) లో కవి సృజించినవి. సన్నివేశాన్ని బట్టి పాఠకుడు చదివేటప్పుడు సంబంధం చేకూర్చుకోవలసి ఉంటుంది. ఒకే ప్రతీక ఎన్నో భావాలను సూచింపజేసేట్లు ఉండడమే ఈ దీనికి కారణం. మహైక లోని కవి, మానవుడు కార్మికుడు మధ్యతరగతి మనిషి, పతిత కంఠాలు నేరుగా సంభాషణా రూపంలో వినిపిస్తాయి. మరో ముఖ్య విషయం వేస్ట్‌లాండ్ ప్రధానంగా జ్ఞానం కన్న విజ్ఞానానికి అధిక ప్రాముఖ్యం గల ఆధునిక నాగరకతచే ప్రభావితమైన సమాజ విషాద గాథా చిత్రం. జీవిత పరమార్థమేమిటి? ఇంత సాధించి మానవుడెక్కడికి పోతున్నాడు? జీవితంలో తృప్తి, శాంతి ఎక్కడ లభిస్తుంది? మొదలైన ప్రశ్నలకు హేతువులైన స్థితులు, ఆధునిక జీవితంలోని దృశ్య రూపాలు చిత్రింపబడ్డాయి. చివరకు సమాధానం Then spoke the thunder అని కవి సందేశంలో వ్యంజితమైంది. ద,ద,ద అని వినిపించిన ఆ శబ్దాలకు దత్తదయధ్వమ్ దమ్యత అన్న అర్థాలు ఆయా ఆత్మ లక్షణానుగుణంగా ప్రకాశితమయిన బృహదారణ్యకోపనిషత్తులోని మాటలు వ్యాఖ్యాత మయినాయి. శాంతిః శాంతిః శాంతిః అన్న శబ్ద త్రయంతో కావ్యం ముగుస్తుంది.

కాబట్టి రెండింటి పోలిక అనవసరం కవిని ప్రశంసించే గుణం ఎక్కువ కావడం వల్ల నిజ విషయ సమాలోచనం మరుగునపడింది.

1922లో ఎదురైన క్లిష్ట సమస్యలు, ఆధునిక నాగరకత పెంపు చెందుతూన్న కొద్దీ పరిష్కృతం కాకపోగా ఇంకా క్లిష్టతరమౌతున్నాయనే ఇలియట్ విశ్వాసం. రచయిత పురాతత్త్వ, పౌరాణికం మతం, స్వీయ జీవితానుభవం మొదలుగా వివిధ భూమికలలో విహరిస్తాడు. ఇతని దృష్టి కెమెరావలె సమాజంలోని, మనో భూమికలలోని అవసరమైన భాగాలను కథలు, గాథలు, మనస్తత్వం, లోక పరిశీలనం మొదలుగా ఆలోచనా ప్రధానంగానూ, అనుభూతిప్రదంగానూ సాగుతుంది. ఈ స్థితిలోనూ రచయిత చరిత్ర వెనుక తత్త్వం చాటున దాగిపోయే లక్షణం కన్పించకపోవడం విశేషం. ఇతనిపై బైబిల్, బౌద్ధం, భారతీయ వేదాంతం ప్రభావమూ కన్పిస్తుంది. ఈ దృష్టితో వేస్ట్‌లాండ్‌లోని కవితా వస్తు పరిధి, దాని స్వరూపమూ వేరు.

మహైక మార్క్సు వర్గ సంగ్రామ సిద్ధాంత రేఖలతో విప్లవ భావనతో పీడకవర్గ నిర్మూలనం, పీడితవర్గ అభ్యుదయం ధ్యేయంగా సాగింది. కార్మికుడు, మధ్యతరగతి వ్యక్తి, పతిత ముప్వురి కంఠధ్వనుల వెనుకనుండి మానవమూర్తి, కవి హృదయం వర్గ సంఘర్షణ, విప్లవ భావస్ఫోరకంగా ఆవిష్కృతమైంది. ఇతని సామాజిక దృక్పథం వేరు. కాబట్టి వస్తు పరిధి, దాని స్వరూపమూ వేరు. ఈ పరిశీలనం కవి వ్యక్తిత్వం ఎత్తి చూపడానికే ఉద్దేశింపబడింది. ఇలియట్ బహుముఖ వ్యక్తిత్వం గల కవి. ఒక్కొక్క దానిచే ఒక్కొక్కరు ప్రభావితులయినారు. ఏ గొప్పకవీ సంపూర్ణంగా అనుకరణ కందదు. మహైకలో చివరకు కవి, ఆశామయమైన మాటలు వినిపిస్తాడు.

**"ఆశాపాశాలతో బ్రతకాలి మనం అంబరాన్ని చుంబించాలి మనం**
**భానూదయం కాకపోదు నేటి చీకటి రేపు ఉండదు"**

ఈ కావ్యం మార్క్సు సామాజిక దర్శన రేఖలకొదిగి, శ్రీశ్రీ కవితామార్గంలో, ఇలియట్ శిల్ప ప్రభావం సూచనగా కలిగి కవిరాజ సర్వదేవరభట్ల నరసింహమూర్తి గొంతుక స్పష్టంగా వినిపించేది. అభ్యుదయ కావ్య ప్రపంచంలో మహా ప్రస్థానం తరువాత చెప్పుకోదగ్గ కావ్యాలలో మహైక ఒకటి.

# (7) అవధానం - ఒక కవిత్వ క్రీడ

అవధానం ఒక సాహిత్య క్రీడ. ఇందులో ఒక్క కవిత్వ పరంగానే కాకుండా, అప్రస్తుత ప్రసంగం మొదలుగా పృచ్ఛకుల ప్రశ్నాపరంపర చేత విస్తృతమైన సాహిత్య వాతావరణాన్ని పొందుతుంది. దీనికి సమయం కూడా తక్కువేమీ కాదు. సుదీర్ఘకాలం ఆ సభను ఆ విధంగా నిలిపి ఉంచడం, సభికుల్లో ఉత్సుకతను కాపాడడం, వ్యగ్రతను కలిగింప జేయడం, సాహిత్య ప్రేరణను సహృదయుల్లో కలిగించడం సామాన్యమైన పనికాదు. అదీ చతుర చతురంగా హాస్యసుందరంగా నిర్వహించడం అవధానం చేసే సాహితీ మూర్తి ప్రతిభకూ నిదర్శనం. దీనితో పాటు వ్యుత్పత్తి లేకపోతే ఈ సాహసానికే ఉపక్రమించడం జరగదు. పద్య విద్య వశం కాకపోతే ఒకవిధంగా ధారణతోనో, స్మరణతోనో అభివ్యక్తి శక్తితోనే విడంభించకపోతే సాధ్యమే కాదు. అవధానం సరియైన ఉచ్చారణ, అభివ్యక్తి, భాషాసౌందర్యంతో కవిత్వానికి సంబంధించిన మంచి సాహిత్య వాతావరణానికి సహాయపడుతుందనడంలో సందేహం లేదు.

పద్యానికి ఆదరణ ఎప్పుడూ ఉంటుంది. దాని ఆకర్షణ అలాంటిది. ఏ విధంగానైతేనేం! కావ్య పఠనం - పౌరాణిక నాటకాల్లో పద్యపఠనం - అవధానం - ఇవన్నీ సాహిత్య పరంపరలో భాగాలు; సంస్కృతీ జీవిత నిక్షిప్తరూపాలు, అవధాన కవిత్వంలో కవిత్వం ఉదా? అంటే అప్పటికప్పుడు సద్యః స్ఫూర్తితో నిర్మింపబడే సాహిత్య ప్రపంచంలో మొదటినుండి చివరివరకూ మంచి కవిత్వం రావడం కష్టమే! అయితే ఒక్క మాట! సభలో వివిధ స్థాయిలకు సంబంధించిన సహృదయలోకం ఉంటుంది. ఆ స్థితిలో ఆ క్షణంలో ప్రశ్నను బట్టి ఏ రూపం వహించేదీ ముందుగా తెలీదు. ఇంకా అనేక పరిమితులూ ఉన్నాయి. కూర్చుని సావకాశంగా వ్రాసే కవిత్వంతో పోల్చకూడదు. అందులో మటుకు ఎంత కవిత్వం ఉంటుంది? ఏది కవిత్వం? ఇవన్నీ ప్రశ్నలకు జవాబులు సులభం కావు. దీనికొక నిర్దిష్టమైన ప్రణాళిక ఉంటుంది. దత్తపది అప్రస్తుత ప్రశంస మొదలుగా దాని ప్రకారం జరుగుతుంది. ప్రస్తుతం గురించి మాత్రమే ఆలోచన ఉంటుంది.

అవధానంలో ఇతివృత్తమంటారా? దీన్ని మనం రూపొందించడాన్ని బట్టి ఉంటుంది. ఇదో సమస్య కాదు. మహాకావ్యంలోనూ కొన్ని ఘట్టాలూ అందులో కొన్ని పద్యాలే నిలిచాయి. ప్రచారాన్ని పొందాయి. మిగతా కొన్నిచోట్ల పాచ్‌వర్క్ (Patch work) తప్పదు. అవధాన విద్యలో గొప్ప కవిత్వం ఉన్న పద్యాలూ ఉన్నాయి. మంచి కవిత్వం ఉన్నవీ వచ్చాయి. ఫరవా లేదన్నవీ ఉన్నాయి. పరిమితమైన సమయంలో ఉనరాలోచనకు వీలులేని స్థితిలో ఇన్‌స్టంట్ (instant) క్రికెట్ లాంటిది. లిమిటెడ్ ఓవర్లలో పరిమిత సమయంలో ఎట్లాగో ఆడి పరుగులు సాధించాలి. బౌల్ చేయాలి! సభికుల్ని అలరింపజేయాలి. ఒక ఉద్దేశంతో ఉపక్రమించే కార్యక్రమంలో మరో ఉద్దేశంలోని

ప్రయోజనాల్ని ఆశించకూడదు. యాదృచ్ఛికంగా లేదా సంబంధ కారణాల వల్ల అనుకున్న ఫలితాలు వస్తే మంచిదే. అవును! గాథా సప్తశతి ముక్తకాలే! శ్రీనాథుని చాటువులూ! మహాకవుల జీవితానుభవ రూపాలు పద్య రూపంలోనే నిలిచాయి. కవితాశక్తిని ఎట్లా ప్రదర్శించాలో అది కవి ఆశించే ప్రయోజనాన్ని బట్టీ ఆ ప్రక్రియా రూపాన్ని బట్టీ ఉంటుంది. గొప్ప సంస్కృతీ వారసత్వం గల సమాజంలో రకరకాల ప్రక్రియలు వస్తాయి. "ఇది అట్లాలేదు! అది ఇట్లా లేదు!" అనుకోవడం సమంజసం కాదు

సమాజంలో, వ్యక్తిలో ఎప్పుడూ తన గతాన్ని గురించి, తన వారసత్వం గురించి, తన జాతి వ్యక్తిత్వం గురించి మూల రూపంలో అభిమానం, అభిలాష, ఆదరణ తప్పకుండా ఉంటాయి. ఈ భావం అనేక కారణాల వల్ల కప్పి వేయబడుతుంది. మరుగున బడుతుంది. ఒక్క కాంతి కిరణంతో అనుభవానికి వస్తుంది. ఇది ఎప్పుడూ సజీవంగానే ఉంటుంది. ఒక్క వర్షబిందువుతో మొక్కలు తల లెత్తుతాయి. ఈ సాహిత్య క్రీడ వ్యక్తిలో ఆనందించే గుణం, ఆలోచించే లక్షణం సమయాన్ని సంస్కృతీపరమైన మంచి వాతావరణంలో నిర్మించుకోవాలనే ప్రయత్నం ఉన్నంతవరకూ నిలిచే ఉంటుంది. కాకపోతే కొద్ది మార్పులకు లోనవుతుంది, ఇది సహజం.

కొన్ని సందర్భాల్లో ఆకాశంలో విమానాల విన్యాసం జరుగుతుంది. ఎంతో సాహసంతో కంటికి ఉత్సవంగా హృదయాన్ని అలరిస్తుంది. ఆ పైలట్ నేర్పూ, శక్తీ యుక్తీ ఆకర్షిస్తాయి. "యుద్ధం చేయమను" అంటే ఏ సమయంలో ఏదో అది జరుగుతుంది. పద్యం అంటే చందోగతమైన విన్యాసరూపం. ఒక నియమం, ఒక కదలిక, ఒక నడక, ఒక విరుపూ, ఒక నిలుపూ, ఒక పరుగూ, నిర్మాణం పట్ల అభిరుచీ ఉన్నంతవరకూ ఈ దేశం ఆ దేశం ఏమిటి? ఎక్కడైనా ఎప్పుడైనా అస్తిత్వాన్ని కలిగే ఉంటుంది. అలరిస్తుంది. తెలుగులోనే కాకుండా సంస్కృతం లోనూ విశేష వృత్తాల్లోనూ అవధానం చేసిన వ్యక్తుల్ని గమనిస్తే తెలుస్తుంది. పద్యం తెలుగు జాతి సంస్కృతీ వారసత్వం. అవధానం ఉత్సాహ సమాజానికి సాహిత్య క్రీడా రూపం. కవితా నైపుణీ ప్రకారం.

# (8) పోతన భాగవతం - భూమిక

సర్వ భారతదేశంలో ఆయా ప్రాంతీయ భాషల్లో భిన్న కాలాల్లో భిన్న రీతుల్లో భాగవతం ఆవిష్కృతమైంది. సంస్కృత భాషలోని పరమార్థాన్ని దేశభాషల్లోకి ఆయా సాంస్కృతిక వాతావరణాలతో పరివర్తనం చేసి ప్రజలకు అందివ్వడం ప్రధానమైన ఉద్దేశం. ఈ మహా ప్రయత్నంలో రచయిత వస్తుగతమైన తాదాత్మ్యాన్ని పొందడాన్ని బట్టీ ఆవిష్కృతిలో వైవిధ్యాన్ని పొందాయి. ఇది సహజం కూడా. అనువర్తన భాగాలను పరామర్శించేప్పుడీ అంశాన్ని మరవకూడదు. ఇది చారిత్రక సాంస్కృతిక కారణాల వల్ల ఆ ప్రాంతంలోని భాషా సాహిత్య పరిణామంలో భాగమైంది. దీనికి ఒక దేశభాషలో రూపొందిన సాహితీమార్గం, స్థానికమైన ఆలోచనా ధోరణులూ విశ్వాసాలూ రచయిత వ్యక్తిత్వమూ అన్నీ కలసి పనిచేస్తాయి. తెలుగుదేశంలో వెలసిన పోతన భాగవతం ఈ దృష్టితో సాహిత్య పరంపరలో భాగంగా దేశ సంస్కృతీ బింబంలో కళారూపంగా నిలచింది.

కవిత్రయం సాహిత్యమార్గం పోతనకాదర్శం. నన్నయ నుండి విశ్వనాథ వరకూ సంప్రదాయ మార్గంలోని మహాకవులందరి లక్ష్యంలో పరమమైన వస్తు సాంతత్యం ఉంది. ఇది తెలుగుజాతి ఆలోచనా శిఖరాన్నీ, అనుభూతి గాంభీర్యాన్నీ స్పృశిస్తూ లౌకికమయి జీవనతలంపై ప్రయాణాన్ని సాగించేది. అదృష్టవశాత్తు తెలుగులో సాహిత్యం ఆరంభమూ దీన్ని అందుకున్న తిక్కన రచన ఆపైన పరిణామమూ పరతత్త్వాన్ని ఉన్మీలనం చేసే అంతర్భావంతో కావ్యానందాన్ని అనుసంధితం చేసే విధంగా సాగింది. నన్నయ భారతం ఆరంభ శ్లోకంలో 'శ్రేయో'భావం ఉపనిషద్గర్భితమైంది.

**"శ్రేయశ్చ ప్రేయశ్చ మనుష్యమేతత్ స్తౌ సమ్పరీత్య వివనక్తి ధీరః**
**శ్రేయోపి ధీరోభి ప్రేయసో వృణీతే**
**ప్రేయో మన్దో యోగక్షేమా ద్వృణీతే"** (కఠోపనిషత్తు - 1,2)

తిక్కన జన్మాంతర దుఃఖం తొలగేట్లు అనుగ్రహం కోసం ఆర్తి, పోతన శ్రీకైవల్యపదం చేరే లక్ష్యం, 'పునర్జన్మ లేకుండా' ఈ జన్మను సాఫల్యం చేసే అభిలాష విశ్వనాథ (జనూరుజాతతి' విచ్చిపోయేట్లు అనుగ్రహం కోసం తపన, అన్నీ మౌలికంగా ఒకే తత్త్వప్రవాహ రూపాలు. ప్రబంధాలలో ఇది అక్కడక్కడా సూత్రప్రాయంగా నిహితమైంది. కావ్యసౌందర్యం స్ఫుటాకృతిని పొందింది. కవిత్రయం తరువాత, ప్రబంధ యుగానికి పూర్వమూ అయిన పోతన భాగవతంలో అటు అంతస్తత్త్వతేజం, ఇటు కావ్య సౌందర్యం, రెండూ సమ్మిళితమై దివ్యమైన రమణీయాకృతిని రూపొందింది. ఇది తెలుగు సాహిత్య పరిణామంలో భాగమై చారిత్రకంగా కాల ప్రభావం నుండి విడదీయలేని అంశం. సంస్కృత భాగవతంలో వస్తువు భగవంతుడు పరతత్త్వం - భక్తి మోక్షం. ప్రధానంగా పురాణానికి మోక్షశాస్త్రమనీ పేరు. తెలుగులో దీనిపై మరికొంత విశిష్టత సాధింపబడింది. మూల

గ్రంథంలో పాటు శ్రీధరుని వ్యాఖ్యానమూ అనుసరింపబడింది. దీనితో ఆ తరువాత వచ్చిన అద్వైతభావనతో గ్రంథంలో సాధనమైన భక్తి యోగమూ యోజితమై తాత్త్వికమైన విశాలతకు దారితీసింది. స్వతంత్రమైన కథా నిర్వహణం, రచనాశిల్పం, రచనకు మరింత ప్రత్యేకతను కలిగించాయి. దీనితో తత్త్వ ప్రకాశనం, కల్పనాలోకం, కవిత్వ సౌందర్యంతో వస్తువు తాదాత్మ్య భావనావధిగా రూపొందింది. అందువల్ల ఈ గ్రంథాన్ని 1. మూలభాగం; 2. శ్రీధరుని వ్యాఖ్యానుసరణం; 3. స్వతంత్ర రచన అని స్థూలంగా విభాగింపవచ్చు. కాని సావయవశోభా సంపన్నమైన గ్రంథం. తెలుగు పాఠకులకు ఏకాకృతి భావనయే తన్వయత్వం కలిగిస్తుంది. రచన, వ్యాఖ్యానమూ వేరు వేరు కాదు. ఒక సిద్ధాంతంలో విశిష్టమైన ఆలోచనతో చేసిన వ్యాఖ్యానం ఆ గ్రంథం నుండి వేరు కాదు. ఎందుకంటే ఒక దృక్పథంతో గ్రంథంలోని అనేక సూక్ష్మాంశాలను పరిశీలించి, వివరిస్తుంది కాబట్టి. పూర్వం లేఖనం, పఠనం ప్రమేయం తక్కువగా ఉండేది. దీనికి కావలసిన సాధనలూ అంతంత మాత్రమే. కాబట్టి విషయాన్ని చాల సంక్షిప్తంగా జ్ఞాపకం పెట్టుకోవడానికి వీలుగా చెప్పేవారు. ఇవి ధారణలో ఉంచుకొని ఎక్కడో అవసరమైనచోట్ల నోటి మాటలలోనే వివరణం జరిగిపోయేది. తప్పనిసరి అనుకున్నవి సంగ్రహ రూపంలో నిబంధించి కంఠస్థం చేసేవారు. మళ్ళీ వీటికీ విస్తరణరూపాలు రావడమూ జరిగేది రానురాను విద్యావ్యాప్తితో ఒక్కొక్క శ్లోకానికీ సూత్రానికీ – ఒక్కొక్క దృక్పథంతో చేసిన ఆలోచనా వ్యాసంగం ఒక్కొక్క మార్గంలో, ఆ గ్రంథం నుండి విడదీయరానిదిగా తదభిమానులకు తత్పథావలంబకులకు సంప్రదాయ పరంపరను ఏర్పరచింది. అది ఆ గ్రంథంలోని భాగంగానే నిలచింది. ఒక గ్రంథానికి భిన్న వ్యాఖ్యానాలుంటే ఎవరి కిష్టమైంది వారు ఎన్నుకొనేవారు. ఒక్కొక్కపుడు అభిలాష, జిజ్ఞాస ఉన్నవారు మిగతావీ చూచేవారు. ఇలా భిన్నమతాలు వాదాలు సమీకృతమైన గ్రంథాలు లేక పోలేదు. పోతన భక్తి నిష్ఠతో, అద్వైత భావనామతి కాకపోతే తత్త్వ విషమయ వివరణంలో శ్రీధరుని వ్యాఖ్యానంతో భాగవతాన్ని పరిపూర్ణం చేసేవాడు కాదు.

(1) ఎ) శ్రీధరాచార్యులు – భాగవత భావార్థదీపిక (అద్వైత వ్యాఖ్యానం)

బి) వేంకటకృష్ణాచార్యులు – భాగవత చంద్రిక (విశిష్టాద్వైత వ్యాఖ్యానం)

సి) విజయధ్వజాచార్యులు – విజయధ్వజీయము (ద్వైత వ్యాఖ్యానం)

(2) "యే భజ న్తి తు మాం భక్త్యా
మయి తే తేషు చాప్యహమ్" (భగవద్గీత IX–29)

ఆయన భాగవతత్త్వ ప్రకాశనంలో అద్వైతదృష్టిని సిద్ధింపజేయడానికే దీన్ని స్వీకరించాడు. ప్రతిభామూర్తి కావడంతో కథా నిర్వహణంలో, భక్తి భావనచేత అనుభూతి

గాఢత్వాన్ని చేకూరుస్తూ స్వతంత్రమైన రచనాస్వరూపాన్ని ప్రదర్శించాడు వ్యాసుడు – శ్రీధరుడుకు పూర్వ సంస్కృతాంధ్రకవులు ఈ నాలుగు ప్రభావ స్థానాల పర్యవసానంగా తెలుగు భాగవతం ఆకృతి వహించింది. అందువల్ల మూలాన్ని ఎలా అనుసరించాడన్న ప్రసక్తి లేదు. కాలం యొక్క అంతరం పరిస్థితుల భిన్నత్వం. విషయ పరిణామం వైవిధ్యం; మొదలుగా వాస్తవ శక్తుల ప్రభావం మొదట గుర్తించవలసి ఉంటుంది. లేకపోతే సరియైన అవగాహన ఏర్పడదు. పూర్వ సంపద ఎలా కొత్త పరిణామ రూపాలకు కారణమౌతుందో, అదేవిధంగా పైన పేర్కొనబడిన అంశాలు ఒకదానికొకటి ఉపస్కారకాలుగానై భారతీయ సంస్కృతీ తేజంలో భాగంగా నిలచేవి. ఆరంభంలోనూ ఆ తరువాత, సంస్కృత భాషను మూలధనంగా గ్రహించి దేశభాషలనేకం ఆయా కాలపరిస్థితుల కనుగుణంగా సంపన్నమై ఎంతో అభివృద్ధిని పొందాయి. ఈ ప్రయత్నం, ఇవి ప్రజల చిత్తవృత్తిని ఒక క్రమంలో తీర్చడానికీ జీవనాన్ని ప్రకాశవంతం చేయడానికీ తోడ్పడినాయి. ఒక్కొక్క భారతీయ భాష ఒక్కొక్క తేజో రూపాన్ని పొందింది. అందులో భక్తి ఒకటి, భగవంతుని పట్ల భక్తిభావనా తత్పరంగా, పరతత్త్వం ప్రసారితమైంది, భాగవతంలో భక్తియోగం ప్రధానంగా ఉన్నప్పటికీ తక్కినవి జ్ఞానకర్మయోగాలకూ స్థానముంది. భక్తభావన మనస్సును భగవత్ సాక్షాత్కారానికి సిద్ధం చేస్తుంది. భక్తుడు వేదనతో ఆర్తితో వంటచెరకు అగ్నిరూపాన్ని పొందినట్లు సాధర్మ్యాన్ని పొందుతాడు. ఆత్మ నివేదనం గావిస్తాడు. ఎవరైతే భగవంతుని భక్తితో భజిస్తారో వారు అతనిలో ఉంటారు. అతడు వారిలో ఉంటాడు. పోతన ఈ భావస్థానాన్ని కేంద్రంగా విష్ణువును ఆలంబనంగా శ్రీకృష్ణుని శాంతదాస్య సఖ్యవాత్సల్య మాధుర్యాది భావోపేతంగా అనేక కథల్ని రసధునులుగా ప్రవహింపజేసాడు.

## II

ఆధునిక యుగంలో, ప్రజాస్వామ్య వ్యవస్థ ఏర్పడింది. హేతువాదం ప్రబలింది. వివిధాభిప్రాయాలు చర్చలు ప్రకటితం కావడం మొదలైంది. శాస్త్రీయ దృక్పథం అలవడింది. సంఘంలో ప్రతిదీ చర్చకూ పరీక్షకూ గురి ఐంది. సాంకేతిక ప్రగతి జీవితాన్ని సుగమం చేసింది. మానవశక్తులపై విశ్వాసం దృఢతరమైంది. మానవ జీవితం భౌతికమైన సుఖాల్లో గుణాత్మకమైన పరివర్తనం పొందింది. కాని సులభంగా సుఖాన్ని సంపాదించే అభిలాషలో నైతికమైన విలువలు పడిపోయాయి. మనస్సు యాంత్రిక జీవనగతిలో విసుగు, అలజడి, ఘర్షణకు లోనయింది. పూర్వం నుండి వచ్చేవన్నీ కొత్త ఆలోచనల ఒరపిడి గురియైనాయి. భౌతికమైన సుస్థితికి పనికి వచ్చేది. ఏదో ఒకవిధంగా అవలంబించ దగిన ధోరణి వ్యాపించింది. సమాజంలో మతం పట్ల విశ్లథభావమూ ఏర్పడింది. వ్యక్తి, కుటుంబం, సమాజం, ప్రపంచం – వలయాలుగా ఒకదానినొకటి క్రమిస్తూ, యాంత్రిక నాగరికతలో పరస్పరమూ తీవ్రమైన ప్రభావాన్ని పొందాయి. రాజకీయ చైతన్యం, సంస్కరణాభావం, వైజ్ఞానిక స్పృహ, వ్యక్తి అస్తిత్వాన్నీ సమాజగతినీ ప్రభావితం చేయడంతో కొత్త జీవితం

రూపొంది కొత్త మానవుడు అవతరించడం మొదలైంది. పూర్వ కాలానికీ నేటి కాలానికీ మధ్య అంతరాన్ని భావింపజేసే స్థితి ఉత్పన్నమైంది. ఇదొక పార్శ్వం.

మరొక పార్శ్వం, ఎన్నో యుగాల పరిణామంతో శిఖరాలనందుకున్న జాతి, భద్రపరచుకొన్న విశిష్టమైన సంస్కారం, విజ్ఞానం, సాహిత్యం మొదలుగా అనేక ముఖాలుగా విస్తరించి ఈనాటికీ ప్రపంచ సంస్కృతీ దర్శనంలో భాగమై జీవితాన్ని అనివార్యంగా ఆవహించి ఉంది. దీనిలో అంతర్భాగమే భాగవతం. "పురాకృత శుభాధిక్యం" తెలుగులో ప్రఫుల్లమైంది. ఈనాడు చెల్లని ఆలోచనలతో మత విశ్వాసాలతో కూడిన పురాణ కథలతో, మడికట్టుకొని కూర్చున్న ఎవరో కొందరికి మాత్రమే పనికి వచ్చేదన్న అభిప్రాయమూ సరియైందిగాదు. దీనిలో ఈ సాధారణమైన లక్షణాన్ని అధిగమించిన విశిష్టత ఉంది. అది మానవీయ కోణం ఈ కాలానికి సరిపడింది. ఆ తరువాత భౌతికేతర కోణం.

పోతన భాగవతాన్ని అర్థం చేసుకోవడానికి సరియైన అవగాహనతో కూడిన అధ్యయనం మొదట అవసరం. తరువాత వివిధాంశాల పరిశీలనం ఏ దృక్పథంతోనైనా జరపవచ్చు. ఈ సందర్భంలో వ్యతిరేక ధోరణికన్నా, సమన్వయ పద్ధతి వల్ల సమాజానికీ సాహిత్యానికెక్కువ ఉపకృతి జరుగుతుంది. ఈనాటి వ్యవస్థలో ప్రస్తుత సామాజిక పరిస్థితుల్లో పోతన భాగవతం ఎంతవరకు ఉపయోగకరం? అంటే ప్రపంచంలోని అన్ని మహాగ్రంథాలకూ ఇది వర్తిస్తుంది ఆధునిక వాతావరణ ప్రభావానికి గురిఐన గురికాని సమాజం లేదా వ్యక్తుల అభిప్రాయాలు ఆలోచనలు వేరువేరుగా ఉంటాయి. అయినప్పటికీ, ఒక మహాగ్రంథాన్ని చదివేటప్పుడు అనుభూతిస్థితి నిస్సందేహంగా స్థలాన్నీ కాలాన్నీ అతిక్రమించిన నిఖిల మానవభూమికలో ఉంటుంది. వివిధ మానస దశలనూ ప్రేరేపిస్తుంది. కింది దశలో ఆకర్షించే విషయసమూహం వేరు. ఎన్ని మార్పులు వచ్చినప్పటికీ ఒక మహాకృతిని సమాజం నుండి తొలగించలేం. కాకపోతే ఇందులో కొన్నిటిని అంగీకరించకపోవచ్చు, కొన్నిటికి అంగీకరించవచ్చు. మరికొన్నిటికి కొత్త దృష్టితో చూడవచ్చు. కొన్నిటితో విభేదించవచ్చు. మరి కొన్నిటికి మనస్సు అప్పటికి ఆయత్తం కాకపోవచ్చు. కొంతకాలానికి పరిణతివల్ల దర్శితం కావచ్చు. ఈ విధమైన చర్చలకూ, అభిప్రాయాలకు అవకాశమివ్వడంలోనే ప్రజాస్వామ్య వ్యవస్థ యొక్క తీరు ఉపయోగకరంగా పరిణమిస్తుంది. స్వేచ్ఛనూ, వికాసాన్నీ విలసింపజేస్తుంది. దేన్నీ నశింపజేసే స్థితి రాకూడదు.

ఈ విధంగా ఎప్పటికప్పుడు ఆలోచనా స్పృష్టమై అనుభవయోగ్యమైందే మహాకృతి. ఈ అభిప్రాయం పోతన భాగవతానికి బహుధా వర్తిస్తుంది. ఎన్నో మనం పరిహరించరాని శాశ్వత సత్యాలు, లోకవృత్త బాహుళ్యం, మనస్తత్వ వైవిధ్యంతోపాటు, ఇందులో ప్రకృతికీ – మనిషికీ మనిషికీ మనిషికీ – మనిషికీ ప్రపంచానికీ – గల అనుబంధాన్ని స్థాపిస్తూ, సర్వసృష్టి భావన చేయబడింది. దశమస్కంధం నుండి ముఖ్యంగా ఎన్నో ఉదాహరణ లీయవచ్చు. అన్నిటిని మించి, మానవుని అన్వేషణం – ప్రస్థానం – గమ్యం – ఆలోచనకూ

ఆనందానికీ శాంతికీ మూలమైన స్థితులూ భిన్న కథల్లో ఘటనల్లో పౌరాణిక భూమికలో ఊహకు రాకమానవు. భగవంతుడు ఆలంబనంగా మూలంలోని బీజశక్తి, తెలుగులో శాఖా సమాకీర్ణమై, పుష్పితమైంది. ఇవన్నీ ఉత్తమ సంస్కారం గల వ్యక్తి తెలుసుకోదగినవే.

ఏ సమాజంలోనైనా పూర్వపు రూపాలు మనస్సు నుండి పూర్తిగా తొలగించలేం, అంతకన్నా నశింపజేయలేం. కాకపోతే మార్పులతో మరో మరో రూపంలో అవతరించవచ్చు. యుగయుగాల ప్రాచీన స్మృతిరూపాలు మనస్సులో పొరల్లో దిగిపోయి ఎక్కడో దాగి, అణగి సామూహిక అవ్యక్త చేతనాంశంగా రూపొందడం జరుగుతుంది. ఈ పురారూపాలు (Archetypes) మానవ జాతి యొక్క బహు పురాతన వారసత్వ రూపాలు. పురాణాల్లో ఆత్మయొక్క తత్త్వాన్ని ఆవిష్కరించే మానసికమైన విచిత్రరీతులు కన్పిస్తాయి. ఇవి సామూహికమైన అవ్యక్తచేతన (Collective unconsciousness) కు సంబంధించిన పురారూపాలకు నిలయాలు. భాగవత పురాణంలోనూ ఈ విషయాలను పరిశీలించవచ్చు. దీని ప్రభావం వల్ల, మతతత్త్వం పట్ల వ్యతిరేకత ఉన్నా, కొంతకాలానికి మనస్తత్వగతమైన శూన్యతను, తొలగించడానికి, సౌముఖ్యం ఏర్పడుతుంది. కొత్త దృక్పథంతో పరిశీలించాలనిపిస్తుంది. సుదీర్ఘమైన మానవుని చరిత్రలో మత ప్రస్థానాన్ని పరిశీలిస్తే ఈ అంశం బాగా స్ఫుటమౌతుంది. వేదయుగంలో ఉన్నట్లు ఉపనిషత్కాలంలో తత్త్వస్వరూపం లేదు. ఆ తరువాత ఎన్ని మలుపులు తిరిగిందీ, చింతన ఎలా సాగిందీ సుపరిచితమే. ఈ బలమైన పురారూప మనస్తత్వం, పోతన భాగవతాన్ని తెలుగు ప్రజలకు సన్నిహితంగా ఉంచేదే.

ప్రతి జాతికీ వారసత్వంగా లభించిన ఒక తత్త్వ దృష్టి ఉంటుంది. ఆలోచనా ధోరణి ఉంటుంది. ఒక విధమైన స్పందనశక్తి ఉంటుంది. ఒక జీవ సరళి అలవడుతుంది. ఇందులో మార్పులు రావనికాదు. వస్తాయి, తప్పదు... ఇది వ్యక్తిలో అంతర్ బహిర్ సమస్యలను ఎదుర్కొనేందుకు, పరిష్కారాన్ని కనుగొనేందుకు, ఎంతోకాలంగా నిర్మితమౌతూ వచ్చే రక్షణ యంత్ర రూపంగా ఎప్పటికపుడు పనిచేస్తూ ఉంటుంది. ఆధునిక వాతావరణంలో దీనిమీద జరిగే పెంపు వేరు, జరుగుతూనే ఉంటుంది. అనాది నుండి వచ్చే మార్పులకు లోనవుతూనే జీవశక్తితో, స్థూల దృష్టికీ అవగతమౌతుంది. ఇది అన్ని జాతులకూ వర్తిస్తుంది. దీనినుండి శాశ్వతంగా విముక్తం కావడం జరగని పని. ప్రతిభాషకూ సాహిత్య సంపద ఉంటుంది. కొన్ని భాషల్లో ఇది ఉత్తమ స్థితిని పొందుతుంది. ఇది ఆ తరువాత సాహిత్య ప్రమాణాన్ని కాపాడగలిగింది; అభిరుచిలో ఉన్నతమైన సంస్కారాన్ని నిలిపే శక్తి కలిగిందిగా నిలుస్తుంది. తెలుగు సాహిత్యంలో పోతన భాగవతం ఈ కోవకు చెందింది.

మానవ దానవత – రెండింటి సంస్కరణలో ఒక్కొక్కపుడు దానవత పెచ్చు పెరగడం,

మానవ గెలవాలనే ఆకాంక్ష – సహజం. నిరాశ, ఆశ – అహింస, హింస – యుద్ధం, శాంతి మొదలైన ద్వంద్వాల ఘర్షణలో చివరకు ఆనందాన్ని సౌభాగ్యాన్ని శాంతిని ప్రసాదించి ఉదాత్తమైన గుణంవైపు మనస్సు క్రమంగా ఉన్ముఖమై, మానవత్వం నుండి దివ్యత్వంలో భావతృప్తిని పొందుతుంది. కాబట్టి దానవతపై మానవత, ఆపై దివ్యత్వం దశలుదశలుగా విజయం పొందే స్థితి మనస్తత్వపరంగా ఎంతో ఉత్సుకతను కలిగించే భాగం. ఇది భాగవతంలో దానవ మానవ దేవతలకు సంబంధించిన అనేక కథల తీర్పులో స్పష్టంగా గుర్తించవచ్చు.

అణువు నుండి మహీయం దాకా అనేకమైన చైతన్యదశలు, పెక్కు అవతార గాథలు, పద్యరచననుండి, కథా నిర్వహణం వరకూ పర్యాప్తమైన శిల్ప రామణీయకత అనుభూతి దఘ్నంగా సహృదయలోకాన్ని తాదాత్మ్యస్థితిలో ఉంచగలుగుతూంది. సృష్టి రహస్య విజ్ఞానం, చారిత్రక సమాచారం, తత్త్వ ప్రపంచనం, ప్రాచీన రేఖల్లో మూర్తీభవించిన మాట వాస్తవం. వివిధ కథారూపాలు నవవిధ భక్తి భావనతో విషయ సంయోగం చేత విష్ణుపారమ్యంలో వర్తమానుభవంలో ద్రవీభూతమై రసాకృతిగా ప్రవహించడమూ జరిగింది.

**"ద్రుతస్య భగవద్ధర్మాద్ధారావాహికతాం గతా**
**సర్వేశే మనసోవృత్తిర్భక్తి రిత్య భిధీయతే"**

– మధుసూదన సరస్వతి, భక్తి రసాయనం

పోతన భాగవత విషయంలో అంతే సత్యం. చైతన్యమూ జడమూ మధ్యగల తారతమ్యాన్ని, ఏయేపాళ్ళలో ఏ స్థితిలో వీటి కలయికవల్ల ఏతత్త్వం రూపొందేదీ – ప్రకృతి జంతువులు, దానవుడు మానవుడు – సామాన్యుని నుండి జ్ఞానివరకూ గల వివిధ మనస్తత్వ రూపాలు మనలోకంలో పాత్రల రూపంలో దర్శనమిస్తాయి. గజేంద్ర మోక్షం, ప్రహ్లాద చరిత్ర, కుచేలోపాఖ్యానం, మొదలైన ఎన్నో కథల్ని గమనించవచ్చు.

## III

జీవుడు–జన్మ–కర్మ–భగవంతుడు–పరలోకం–పరతత్త్వం–మోక్షం– అన్న అంశాలు ఈ గ్రంథానికి, కీలకమైనవి. ఉపనిషత్తు, ప్రవచనాలు, చర్చలు, వ్యాఖ్యానాలు దీన్ని స్థాపించడానికి ఉపయుక్తమైన సాధన సంపత్తి. వీటిపై విశ్వాసం కొంత సడలిన నేటి సమాజంలో ఈ రచన ఏ ప్రతిక్రియను కలిగించేదీ స్థూలంగా పరిశీలించడం జరిగింది.

ఈనాడు ఎన్ని విధాలుగానో సంక్షుభితమైన జీవితంలో, విషాదం నుండి, మనస్సును విముక్తంజేసే శక్తి నిలయంగానే భావింపవచ్చు. ఎన్నో సమస్యలు – సందేహాలు – ఎప్పటికీ! ఒక సమస్యను సందేహాన్ని తీర్చే శక్తి అందులోనే నిహితమై ఉంటుంది. బీజభేదనం నుండి చివురు వస్తుంది. లయం నుండి సృష్టి ఉద్గమిస్తుంది. పరస్పర విరుద్ధంగా

కన్పిస్తుంది. కాని తగిన వాతావరణం అనుకూలించడంతో సమస్య పరిష్కృతమౌతుంది. ఈ పరిష్కారం సమస్యలోనే ఉంది. అలాగే జీవితంలోనూ హేతువుకు అందీ అందనివి కొన్నీ సూక్ష్మంగా ఆలోచిస్తే తెలిసేవి కొన్నీ హేతువుకు అతీతమైనవి కొన్నీ తటస్థపడతాయి. అలాగే ఈ సందర్భంలోనూ, మనకు కన్పించేదాన్నీ, కన్పించనిదానినీ, అందేదాన్నీ, అందనిదాన్నీ, తెలిసినదాన్నీ, తెలియనిదాన్నీ కలిపే వంతెన వంటిది మనస్సు. ప్రయాణంలో అఖాతం తటస్థపడినపుడు, ప్రయాణం దుస్తరమైన ఈ వంతెనపై ప్రయాణం చేయడం తెలియాలి. ప్రయాణం సాగించాలి అపుడే గమ్యం చేరుకోగలం. భాగవతం ప్రయాణ సాధనంగా ఉపకరిస్తుంది.

భగవంతుడు - మానవుడు - ప్రపంచం ఈ మూడింటి సంబంధం ఇందులో స్థాపితమైంది. జీవితాన్ని సుపరిష్కృతం, సుసంపన్నం చేసి ప్రయోజన సహితం చేసే ఆదర్శం ప్రపంచితమైంది. భక్తుని ఆర్తి, సంఘర్షణ - భగవంతుని దయా ప్రసాదంతో తృప్తి, ఆనందం, శాంతికి సానుకూలమైన వాతావరణ నిర్మాణం ఇందులోని తుది రేఖలు.

పోతన భాగవతంలో చాలాచోట్ల హేతువుకీ చర్చలకీ అందనిస్థితి ఉంటుంది. ఇది అనుభవానికి సంపన్నమయ్యే తాదాత్మ్యగుణంతో నిండి ఉంటుంది. చైతన్య రూపమైన మనస్సు, మననం చేత మధింపబడినపుడే కామధేనువు, కల్పతరువు, చింతామణి అమృతం ఫలసిద్ధి కలుగుతుంది. ఇవి మానవ జీవితానికీ వర్తించే అనుభవ ప్రతీకలు!!

పౌరాణిక కథాగతిలో, ప్రకృతి సహజమైన ప్రేమ ద్వేషం, ఆర్ద్రత కాఠిన్యం, శత్రుత్వం ఆత్మీయత మొదలైన మనస్తత్వరూపాలు ప్రవర్తనమౌతూ మనల్ని ఆకర్షిస్తాయి. ఇవి మనల్ని భౌమస్థితిలో నిలిపేవి. ఈ ప్రయాణంలోనూ తెలుగు భాగవతం జనాదరాన్ని పొందింది.

మూలంలోని కథాంశాలకు సంఘటనలు కల్పించడంలో, సంఘటనలకు పాత్ర ధోరణి మలచడంలో, పాత్రకు మనస్తత్వాన్ని రూపొందించడంలో - మొత్తం మీద దీప్తినిచ్చే తత్త్వప్రకాశనం - ఆర్ద్రతను కలిగించే కళారూపంతో పోతన భాగవతం సాక్షాత్కరిస్తుంది.

గ్రీష్మార్తిలో ఆర్ద్రమేఘం వలె ఇన్ని వందల ఏండ్లు నిలిచింది. పోతన కవిత్వం చేత తెలుగు ప్రజలు అమృత సేవనాన్ని పొందారు. నిరంతర చింతనమూ, రసానుభూతి రెండూ కలిసి దర్శనమూ స్పందనంతో రచన మంత్రమహితమైంది. కావ్యానంద పరిధి దాటిన శక్తి ప్రసాదమూ ఈ కృతికి మాత్రమే సంక్రమించిన మరో ఉదార గుణం.

# (9) సీతారామాంజనేయ సంవాదము - కవిత్వ స్ఫూర్తి

ఈ కవి ప్రధానంగా పరమమైన తాత్త్విక భూమికలో జీవించేవాడు. ఈ జీవనం చాలమంది పూర్వ మహాకవుల్లో అంత స్వాభావికమై కన్పించేదే. ఈ గ్రంథంలో సర్వేసర్వత్రా పరమైక లక్ష్యమై ప్రకాశిస్తూంది. ఇతని రచనా ధ్యేయంతో పాటు ఎన్నుకొన్న వస్తువు పరిధి ఈ లక్షణాన్ని కత్యంత దోహదకారిగా ఉంది. తాత్త్విక భావనావిష్కారానికి పద్య రచన ఒక సాధనంగా గ్రహించినట్లు కన్పిస్తుంది. ఈ ప్రయత్నంలో అక్కడక్కడా పూర్వ కావ్య పరిచయాధిక్యం వల్ల, కవి ప్రతిభానమున్మీలనం వల్ల రచనలో కవిత్వమూ శిల్పమూ తొంగిచూడడం జరిగింది. శాస్త్రీయమైన విషయాన్ని ప్రపంచించే సందర్భంలో పద్యంలో క్లిష్టత పరిహరించ రానిదిగా కన్పిస్తుంది. దీన్ని పరిహరించి ప్రసన్నత సిద్ధింపజేయడానికి శిల్పమెరిగిన రచనా శక్తి అవసరం. ఈ కవి దీన్ని సాధించడంలో కృతకృత్యుడైనాడు. ఈ దృష్టితో తెలుగు సాహిత్య జగత్తులో ఈ గ్రంథానికి గల స్థానం కావ్యకోటిలో భిన్నమైంది. విషయంపై సాధికార లక్షణమూ, రచనలో ధారావాహిక గుణమూ, గహనమైన శాస్త్ర రహస్యాలను చివరిదాకా చదివింపజేసే రచనా రూపము మనల నాకర్షిస్తాయి. ఈ కవి దీనినొక చోట ప్రబంధమనినాడు. ప్రకృష్టమైన ఉదాత్తమైన శాస్త్ర రహస్యాలను పద్య రచనలో బంధింపబడడం వల్ల ఈ మాట సార్థక్యాన్ని పొందుతూంది. ఈ బంధం శాస్త్రగత క్లిష్టత్వం నుండి సుబోధకత్వం వైపు ఎక్కువ మొగ్గుదల కలది. ఈ దృష్టితో శాస్త్రబోధ పరమావధిగాగల ఈ గ్రంథంలో కవితాస్ఫూర్తి నీలిమబ్బులో మెరపుతీగల వలె గుర్తించవచ్చు.

గ్రంథావతారిక శ్రీరామ బ్రహ్మావిష్కారంతో ఆరంభమైంది. మొట్టమొదట రామస్తుతిలో గుర్తింపదగిన అంశాలు రెండు. ఒకటి శ్రీజానకీ రామ బ్రహ్మాన్ని అంతరంగంలో ధ్యానించే (సాధకుడు) కవి ఉన్నత కోటికి చెందిన మానసికస్థితి. రెండవది రామబ్రహ్మం ఆంజనేయుని 'ఈవ నేను' అన్న (సాధ్యము) మహావాక్యార్థబోధ. ఇది గ్రంథంలోని వస్తుపరమార్థాన్ని సూచిస్తుంది.

శ్రీ జానకీ రామబ్రహ్మ మనగా శుద్ధమైన మాయ చేత కూడుకొన్న పరమాత్మ అని అర్థం. సీత మాయ. రాముడు పరబ్రహ్మ. ఆంజనేయుడు ముముక్షువైన జీవుడు. ఈ మూడు భావస్థానాలు కేంద్ర బిందువులుగా నిర్మితమైందీ శాస్త్ర గ్రంథం. జీవ బ్రహ్మైక్య నిరూపణం దీని పరమోద్దేశం. హనుమంతుడు రామచంద్రుని పరమభక్తుడు. శరీరం చేత రాముని సేవించువాడు. వాక్కు చేత రాముని గుణాలను కీర్తించువాడు. మనస్సు చేత రాముని పరరూపము ధ్యానించువాడు. కాయము, వాక్కు, మనస్సు ఉత్తరోత్తరము సమున్నత చిత్తవృత్తి కలవారిలో బలీయమైనవి ఆరోహణలో చివరి దశ శిఖరభూతమైంది. ఈ పరమ లక్షణం 'తనరన్ కాయము చేత' అన్న పద్యంలో చిత్రితమైంది. అవతారికలో

కావ్య వస్తు ప్రతిపాదనం తరువాత కవిని గురించి ప్రశస్తి పేర్కోదగింది. ఈ కవికి గురువు లిరువురు. ఒకరు నారాయణ గురువులు, రెండవ వారు మహదేవులు. నారాయణ గురువులు కవికి బాల్యంలో తారకయోగం ఉపదేశించిన వారు. 'ఆరయ మద్బాల్యంబున' అన్నపుడు బాల్యదశలో పరతత్త్వోపదేశం పొందుట ఆశ్చర్యంగా తోచవచ్చు. ఇది సామాన్య ఘటన కాదన్నది నిస్సంశయమైంది. "గ్రహణధారణ పటుర్బాలః" అన్న తర్కశాస్త్రోక్తిని బట్టి గ్రహధారణ పటుత్వం కలిగిన స్థితిని సూచించేదిగా గ్రహించవచ్చు. ఆపైన పూర్వజన్మ సంస్కార వశం చేత గురుప్రసాద బలం వల్ల సాధ్యమయ్యే ఈ ఘటన కవి పరిపాకమైన మానవస్థితిని పట్టిస్తూంది. మహాదేవ గురువులు కవికి బ్రహ్మానంద స్వరూపం బోధించినవారు. ఇతడు కవి దృష్టిలో దత్తాత్రేయ యోగితో సమానుడు. ఈతని గురు పరంపరకు మూల పురుషుడు దత్తాత్రేయుడు. ఈ గ్రంథం మహాదేవ గురువుల కంకిత మొసగబడింది. ఒకనాడు రామమూర్తి గురురూపంలో గోచరించి "బ్రహ్మాండ పురాణంబు నందాధ్యాత్మ రామాయణంబు మహేశ్వర సంవాద రూపంబై యెప్పునందు శ్రీరామ హృదయం బను నితిహాసంబు సీతారామాంజనేయ సంవాదంబునం ప్రవర్తిల్లునది సంక్షేమ రూపంబుకావున నయ్యర్థంబు విస్తరించి యొక్క ప్రబంధంబుగా రచించి నా పేర అంకితంబు సేయునున్న" ఆజ్ఞను పురస్కరించుకొని గ్రంథ రచన కుద్యుక్తుడైనాడు.

**"కమనీయ వర రత్న కాంచన చేలంబు కాషాయ వస్త్రంబు గాధరించి**
**చాప భూషణములు చంచత్క మండలు దండముల్గాగ హస్తములు బూని**
**శ్రీ మహదేవ గురుడైన రామ విభుడు కరుణ తోచుగ నెదుర సాక్షాత్కరించె"**

రాముని లక్షణాలు కాంచన చేలం, చాప బాణాలు, రత్నహారాలు, సీతా వధూది క్రమంగా దేవగురు చిహ్నాములు కాషాయ వస్త్రము, కమండలు దండము, రుద్రాక్షమాల, రాజయోగము పేరిటి ఆధ్యాత్మిక విద్యగా పరివర్తింపజేసి ఇరువరి కభేదస్ఫూర్తితో వర్ణించుట కవి కవితా శక్తికి నిదర్శనం. ఈ గ్రంథంలోని రాజయోగం జీవ్యంహ్మైక్య సాక్షాత్కార కారణం. ఇది తారకసాంఖ్యం అనునస్మాత్మకం. వస్తువు ప్రధానంగా ఆధ్యాత్మిక ప్రబోధాత్మక మవడం వల్ల బహు క్లిష్టమైన గహనమైన శాస్త్ర విషయమెంత సులభ సుందరంగా అందివ్వగలిగాడనే ప్రశ్నకు తృప్తికరమైన సమాధానమే లభిస్తుంది.

అవతారికలో ఇతడు వెలిబుచ్చిన అభిప్రాయాలు కవితా పరిశీలనకెంతవర కుపకరిస్తాయో మొదట చూడవలసి ఉంది. సంస్కృతకవుల స్తుతి సుందరంలో –

**"లోకాలోక పరీతభూచర మహాలోకోపకారంబుగా**
**శ్రీ కల్యాణకరోరుకావ్య చయముల్ సిద్ధంబు గావించి సు**
**శ్లోకుల్ పుణ్యమతుల్ జగద్గురువులై శోభిల్లు ఉన్నట్టి వా**
**ల్మీకి వ్యాస మయూర బాణకవి కాళీదాసులన్ గొల్చెదన్"**

ఇందులో పేర్కొన్న కవులు సంస్కృత సాహిత్యంలో ఒక్కొక్కరు ఒక ప్రత్యేక స్థానమున్నవారు. ఈ పద్యంలో అందరిలోనూ కన్పించే మహాలక్షణం లోక హితైకదృష్టి. వీరినందరినీ తరతమభావం లేకుండా లోకోపకారగుణంలో సాధారణీకరించి చూచినట్లు కన్పిస్తుంది. ఈ విశ్వశ్రేయోదాయక లక్షణం సాహిత్య ప్రయోజనాల్లో ముఖ్యమైందిగా భావించడమున్నదే. 'సుశ్లోకుల్ పుణ్యమతుల్' అన్న రెండు విశేషణాలూ కవితా స్వరూప పరిధులు దాటిన ఉదాత్త లక్షణాన్ని పేర్కొనేవే. ఇవీ సాధారణీకృతమైనవి. మరొక పద్యం ఉంది. ఇది అంతకంటె కాస్త దారిని పట్టిచ్చేది.

**"మహితగురు లఘు వర్ణధర్మములు నియమ**
**ములు కలిత కర్తృకర్మ క్రియలను దెలిపి**
**నామరూపావ్యయ విలక్షణంబు ఆత్మ**
**నెరిగిన కవీశ్వరుండు కవీశ్వరుండు"**

నామము (ప్రాతిపదికకు సంబంధించినవి), రూపము (విభక్తి వికారాదులు), అవ్యయము (లింగ విభక్తిలేని శబ్దాలు) వీటి విలక్షణత్వం ఛందశ్శాస్త్రాను సారంగా, వ్యాకరణ శాస్త్ర సమ్మతంగా తెలుసుకొని రచన చేసినవాడే నిజమైన కవీశ్వరుడని అభిప్రాయం. ఇక్కడ అర్థాంతరంగా మరో విషయాన్ని ఆశించి, కవి ఈ శబ్దాలేరుకోవడం జరిగింది.

సందర్భంలో కవి ఛందోవ్యాకరణశబ్ద పరిధుల దాటి కవిత్వానికి జీవభూతమైన అంశ ప్రసక్తి లేకపోవడం గమనించదగింది. దీనికి కారణమతని రచనాపరమార్థం వేరు కావడమే. ఈ పద్యంలో కవి ఉద్దేశించిన అర్థాంతర స్ఫూర్తి – గురు (అగ్రవర్ణాలకు చెందిన) లఘు (తక్కువ వర్ణాలకు చెందిన) వారి యొక్క ధర్మనియమాలు, కర్తృత్వానికి తగిన కర్మలు, కర్మలకు తగిన క్రియలు (ఫలరూపాలు) తెలుసుకొని నామరూపాత్మకమైన దృశ్యమానకల్పిత జగత్తు మరియు వయరహితమైన నిత్యమైన వస్తువు ఆ పర బ్రహ్మము– వీటికి గల భేదము తెలిసినవాడే కవీశ్వరుడని. ఇందులో కవి విశ్వసించే ఒక సామాజిక వ్యవస్థను తీర్చే తాత్త్విక భూమిక దర్శనమిస్తుంది. ఇక్కడ ఈ విషయం అర్థాంతరంగా చెప్పే వైఖరి కవితా స్ఫూర్తిని, కవి శబ్దం యొక్క అర్థ విస్తృతీ కలిగింది.

అడుగడుగునా కవి తాత్త్వికదృష్టి పాఠకుని మనస్సులో వీడకుండా శిఖరభావంతో సాగి నిలుస్తుంది. నన్నయ తిక్కన సోమన భాస్కర పోతనాది తెలుగు కవులు "అభీష్టఫలాప్తి దనర్చునట్లుగా" "కవి నెమ్మనమున" ఎన్నబడి నమస్కృతులైనవారు.

**"గరిమన్ స్వర్ణ మనేక భూషణములై కన్నట్లు చందంబునన్**
**పరమాత్ముండఖిల ప్రపంచ మయుడై భాసిల్లు నట్లొటచే"**

అన్నమాట లీగ్రంథానికీ అనువర్తిస్తున్నాయి. బ్రహ్మవిద్యా స్వర్ణకల్పిత భూషణ మీకావ్యం. పోతన భాగవతంలోను ఇలాంటి తత్త్వ ప్రతిపాదక భావాలు, సమ్మోహనాత్మక శైలీరామణీయకత కలిగి ఉన్నాయి. దీనికి వెనుకనున్న బలమైన కథలు, సన్నివేశాలు, పాత్రల మానసికతత్త్వ చాలనము, మొదలైన వాటి వల్ల ఆ సందర్భాన్ని బట్టి రచనకు దీప్తి చేకూరింది. ఇక్కడ ఇలాంటి కథావస్తువు లేదు. కేవల శాస్త్ర విషయం ప్రపంచించడమే ధ్యేయం కావడం వల్ల కవితాశక్తి వలసనానికి ఆస్కారం లేదు. ఈ గ్రంథాన్ని గురించి కవి

**"దివ్యము భవ్యంబగు మ త్కావ్యము సంతతము మోక్షకాములచే శ్రో**
**తవ్యము వక్తవ్యము మం తవ్యము భావ్యమును కీర్తితవ్యము గాదే"**

సర్వోత్కృష్టము, మంగళప్రదము ఐన ఈ కావ్యము మోక్షకాములచే వినదగినది, చెప్పదగినది, మననము చేయదగినది. ఈ మాటల్లోను 'కావ్య'శబ్దము మాత్రము వినా కవి కవితా శిల్పవృష్టి వికసితం కాలేదు.

సారాంశం-కవిదృష్టి-వస్తువూ, రెండూ ఆధ్యాత్మిక తత్త్వము నాశ్రయించినవి. కవితాస్ఫూర్తి విసనాని కంతగా చోటులోని విషయంలో, గ్రంథ నిర్వహణం పద్య రచనాశక్తివల్ల క్లిష్టత లేకుండా సిద్ధమైంది.

**2**

**"బ్రహ్మహత్యాపా తమోర్కబింబు మధుపాన దోషాభ్ర మారుతంబు"**
**అనృత భాషణవల్లీ మహాలవిత్ర మార్యదూషణ పంకేరుహ ద్విపేంద్ర**
**మఖిల కలుషాంబునిధి బడాబానలంబు రామనామంబు..."**

ప్రారంభంలో కైలాస వర్ణనం తరువాత శివుడు పార్వతిని 'వలసినది కోరుమ'ని అడిగాడు. ఆమె 'దేనిసేవచేత జననమరణ దుఃఖాత్మకమైన ఈ సంసార నివృత్తి జరుగుతుందో అట్టి మంత్ర రాజము బోధింపుమం'టుంది. అపుడు శివుడు 'రామమంత్రంతో సమానమైంది లేదని అది పరబ్రహ్మ ప్రతిపాదకమని, అత్యంతపావనము, ధర్మార్థకామమోక్ష ప్రదమని, రామశబ్ద మహాత్మ్యము శ్రీరామ హృదయమును పరమేతిహాసమందలి శ్రీరామమతత్త్వాన్ని చెప్పి, రాముడు తారక బ్రహ్మమగుట తత్సాధన విధానము సమగ్రంగా తెలియజేస్తాడు. పై పద్యం ఆ సందర్భంలోనిది. రామ నామ ప్రశస్తిపతాకంగా నున్న ఈ గ్రంథంలో ప్రకృష్ట బంధంచేత ప్రౌఢత్వాన్ని సంతరించుకొన్న చాల కొద్ది పద్యాల్లో ఇది ఒకటి.

పంచ మహా పాతకాల్లో ఒకలైన బ్రహ్మహత్యా పాపమనే చీకటికి సూర్యబింబం, మధుపాన దోషమనే మేఘానికి మారుతం, మొదలుగా అబద్ధపుమాట అనే తీగకు పెద్ద

కొడవలి, ఆర్య దూషణమనే పంకజానికి మత్తగజం సమస్తపాపము లనెడి సముద్రానికి బడబాగ్ని అనీ, నైతిక పరిస్థితులు వాటి వినాసనానికి వాటితో పోల్చబడిన వస్తువులు, వీటికి ప్రతి అయిన వస్తువులు ప్రకృతి సంబంధమైనవిగా గ్రహింపబడినవి. వరుసగా భావచిత్రణల పరంపరశైలీ మర్యాదోపేతమై కవితాస్ఫూర్తి కలిగింది. చివరిపాదాల్లో ఆర్యదూషణమనే సంకేరుహానికి మత్తగజం అన్నపుడు ఒక సందేహం కలుగుతుంది. పద్మం సుకుమారము, సౌందర్యము, పరీమళము కలిగి కళాత్మక భావనకు ప్రతీకగణం పద్మాలను హరించడం నిజమే కాని ఈ పద్మాన్ని ఆర్యదూషణకు గ్రహించడంలో ఔచిత్యం పట్ల సందేహం కలుగుతుంది. దీన్ని ఇలా సరిపెట్టుకోవచ్చు. పద్మం అనకుండా పంకజం అనడంలో ఇది (ఎన్ని మంచి లక్షణాలు కలిగి ఉన్నా) పంకజంలో జనించడం వల్ల పంక సంపర్కం వల్ల దోషస్థానీయ మౌతూంది. వ్యక్తి ఆత్మసహజంగా స్వచ్ఛమైనప్పటికి ఆర్యదూషణ సంసర్గం వల్ల దోషభూయిష్టమవుతాడు. పంకేరుహమన్న శబ్ద ప్రయోగం కవి భావనకు పుష్టినిస్తూ కవితామయమైంది.

మరొకటి – సర్వపాపాలు అనెడి సముద్రానికి బడబాగ్ని అని సముద్రంలో బడబాగ్ని వుంటుందంటారు. ఇది సముద్రజలాన్ని హరించడానికెంత వరకు సమర్థ వంతమని ప్రశ్న? ఏమైనా రామనామ మహాత్మ్యం ప్రతిపాదించే శక్తి విషయంలో ఈ అలంకారం అసమర్థంగా ఉన్నట్లు కన్పిస్తుంది. కాని అలా చెప్పడం మన సాహిత్య సంప్రదాయంలో పరంపరగా వస్తూన్నదనే సమాధానం.

“రామ రామ రామ రామ రామ రామ యంచు” మొదలుగా రామ నామ కీర్తనాఫలం చెప్పే సందర్భంలోని దీనుగంధివృత్తంలో రామ శబ్దం ఇన్నిసార్లు చెప్పడం సామాన్య పాఠకులకు కొంత విసుగ్గా ఉండవచ్చు. కాని దీన్ని చదివేవారు అదే దీనిపట్ల ఆసక్తి కలవారు, విశేషపాఠకులే కాబట్టి రామనామం ప్రీతికరంగానే ఉంటుంది. ఇక్కడ కవి ఆ విసుగుదలను పరిహరించడానికి జాగరూకతతో వృత్తం మార్చాడు. ఇక్కడ గతిభేదం మనస్సును ఆకర్షించి, కొంతసేపు నిలుపుతుంది. మరొక విశేషం, రామ మంత్ర ప్రభావదర్పణంలో

“త్రిషట్కానిచ నామాని, పఠేద్రామస్య యో నరః స త్రయోపాధి రహితః మోక్షం సమధిగచ్ఛతి” అని రామ అనే మంత్రాన్ని నరుడు పదునెనిమిది మారులు పఠిస్తే అతడు జనన మరణ రహితమైన మోక్షాన్ని పొందుతాడన్న ప్రమాణానికి లక్ష్యంగా ఈ పద్యంలో పదెనెనిమిది మార్లు రామ శబ్ద ప్రయుక్తమైంది. ఒక ఆదర్శంపట్ల విశ్వాసం కలవారికి దానికి తగిన ప్రమాణ పురస్పరంగా ఉంటేనే తృప్తి. అపుడే ఉద్దేశమూ ఫలవంతమౌతుంది. ఈ సందర్భంలో రామాయణ కథ బహుసంగ్రహంగా రెండు మూడు పద్యాల్లో ముగింపబడింది. ఇక్కడ కవిదృష్టిలో రామకథా వివరణకు ప్రాధాన్యం లేదని వేరే

చెప్పనక్కరలేదు. పట్టాభిషేకానంతరం "ముముక్షతా సమన్వితుడైన హనుమంతుని చూచి, రాముడు 'కరుణారసము పొంగార' సీతతో "తారకము మద్ధివ్యతత్త్వ" ముపదేశింపుమనగానే ఆమె చెబుతుంది. ఇది శివుడు పార్వతికి చెప్పినట్లుగా మలచడంలో రామ బ్రహ్మము యొక్క ఆధిక్యం స్థాపితమౌతూంది.

**"రాముడు నిర్వికారుడు నిరామయు డవ్యము దక్షరుడు ని**
**ష్యాము డతీంద్రియుం డజుడు కర్తయుభోక్త యనంగుడంత రా**
**రాముడు నిర్వికల్పుడు నిరంజను దద్వయు డైనయాపరం**
**ధాముడు గాని చారుగుణ ధాముడు కాడు సమీరనందనాః"**

ఈ పద్యం స్తూయమాన విశేషణాత్మకమైన ఒక విశేషణం తరువాత మరొకటి అంది పుచ్చుకొని రాముడు పరబ్రహ్మమన్న విషయాన్ని ప్రతిపాదిస్తూంది. మరొకటి పేర్కొనదగింది – సద్గురూపదేశం ప్రకారం షణ్ముఖీముద్రలో రెండు చెవులు మూసికొన్నపుడు ప్రణవనాదం – మొదట చిణీనాదం, తరువాత చిణిచిణీ నాదం, తరువాత ఘంటానాదం, ఆపైన శంఖనాదం, ఇంకా వీణానాదం, తాళనాదం, వేణునాదం, భేరికానాదం, మృదంగనాదం, మేఘనాదం అనే దశవిధ నాద రూపాలు అనుభవానికి వస్తాయి చివరకు బ్రహ్మానందము కలుగుతుందని చెప్పే సందర్భంలో

**"కంటిన్నెమ్మదిగంటి సద్గురుని నింకన్వేనిలో పువ్వులా**
**రింట స్ఫూజలొనర్తునంచు కర మర్థిన్ దేహి దామున్నుగా**
**ఘంటానాదము చేసెనో యనగ నోంకారంబు హృద్వీథియన్**
**మింటన్ మ్రోయు తదారవంబుగతి యా మీదన్ విజృంభించుచున్"**

ఈ పద్యం రచనా శిల్పమర్యాద కలది. నాచన సోమన ఉత్తర హరివంశంలో జనార్దనుడు రాయబారిగా వెళ్ళినపుడు సభలో శ్రీ కృష్ణుని చూచినపుడు పలికిన 'కంటిన్ కంటి' అన్న పద్యం ఎత్తుగడ పై పద్యం నిర్వహణలో స్ఫురిస్తుంది.

చిణిచిణీనాదం తరువాత హృదయంలో వినిపించేది ఘంటానాదం. ఇక్కడ దేహమందున్నది మూలాధారం, స్వాధిష్ఠానం, మణిపూరకం, అనాహతం, విశుద్ధం, ఆజ్ఞయనేవి ఆరు చక్రాలు. ఇవి కమలాల వలె ఉంటాయని శాస్త్రం చెబుతూంది. ఈ ఆరు పూవుల చేత జీవుడు పరమాత్మను పూజించడానికి ముందు, ఘంటానాదం చేయుచున్నాడో యన్నట్లు హృదయాకాశంలో నాదం వినిపిస్తూంది. పూజ చేసేటప్పుడు ఘంట మ్రోగించడం లోకంలో ఉన్నదే. లోక రూఢమైన విషయాన్ని తీసుకొని ఉత్ప్రేక్షించడంలో కవిలోక పరిశీలనం, భావుకత స్పష్టం. ఇది రచనా శిల్పం చేత మరింత స్ఫూర్తిశోభితమైంది.

చిత్కళా రూపాన్ని వర్ణిస్తూ

**మందాకినీసుధా సందోహ దుగ్ధాబ్ధి సౌందర్యలహరుల చందమునను**
**మందార మల్లికా మందార విందోరు చందన పుష్పరుక్చయము పగిది**
**ఇందిరా సుందరీ మందిరాంతకర్మకరంద నిర్ఝర రుచి ప్రతతిరీతి**
**నిండు ఖృన్నంది సంక్రందన కరి మృగేంద్ర ఫణీంద్ర దీప్తి బృందముల భాతి**
**"హార నీహారడి ండీర శారదాభ్ర హీర కర్పూర తారకాకార కాంతి**
**కరణి నాకాశ పంచకాంతరము నందు మండితములగు చిత్కళా మండలంబు"**

మొదలుగా సాగిన కొన్ని పద్యాలు కవితాత్మకమైనవి. హృదయ గగనంలో గుణరహితమైన ఆకాశము, పరాకాశము, తత్త్వాకాశము, సూర్యాకాశము అనువానికి మధ్య చిత్కళలు ప్రకాశిస్తూ ఉంటాయి. వీటి ప్రకాశాన్ని కవి ఒక ప్రమాణంలో ఊహిస్తున్నాడు. స్వర్గంగాను, అమృతం, క్షీరాబ్ధి వీటి సౌందర్య తరంగాల వలె; మందార మల్లిక కుందం అరవిందం చందనం వీటి కాంతుల సమూహమువలె; లక్ష్మీదేవి అంతః పురం (పద్మం)లోని తేనె జాలువలె; శివుడు, నంది; ఐరావతం ఆదిశేషుల శరీరకాంతి వలె; ముక్తాహారము నీహారముడిండీరము శరన్మేఘము హీరము కర్పూరము నక్షత్రము వీటి కాంతివలె చిత్కళా ప్రకాశం భాసిస్తూ ఉంటుంది. ఇక్కడ తెల్లని వస్తువులతో ఉపమించడం వింటూంటే "శారద నీరదేందు" అన్న ప్రసిద్ధమైన పోతన భాగవతంలోని పద్యం జ్ఞాపకం రాకమానదు.

మరొకటి చెప్పుకోదగింది జ్ఞానోదయవర్ణనం

**"తరుణ బోధారుణోదయ దీప్తి నజ్ఞాన గురు తమ స్సులు మహద్గుహనడగ**
**సలితజ్ఞాన విజ్ఞాన కోవంబు లన్యోన్యసంగములై యనగి పెనగ"**
**"నాతతాణాంద పిండాండ జాతములను బూని వెలిగించు పలుతర స్ఫూర్తితోడ**
**ఘనతరాంతర్హృదాకాశమున వెలుంగు మండితాఖండ చిద్భాను మండలంబు"**

గహనమైన వేదాంతమును శిల్పసుందరమైన కవిత్వంలో పొదగబడింది. పూర్వ మహాకవుల్లోనూ ఈ దృష్టి తత్రతత్ర కన్పిస్తుంది. అంటే కథ సన్నివేశం పాత్ర చిత్రణం, సంభాషణలు, వర్ణన మొదలైనచోట్ల బహువిషయగతమై కన్పిస్తుంది. ఇది వేరు విషయం. ఇక్కడ ఆద్యంతమూ తత్త్వ శాస్త్ర నిబద్ధమే అయినా వీలున్న చోట కవితా ప్రకాశనం జరిగింది.

ఇక్కడ సూర్యుడు పరమమైన అఖండజ్ఞానానికి, తమస్సు అజ్ఞానానికీ ప్రతీకలు, ఆకాశాన సూర్యుని ప్రకాశానికి పూర్వం అరుణుడు (సూర్యుని రథసారథి) కన్పిస్తాడు. అరుణ కాంతికే చీకటి గుహల్లో దాగిపోతుంది. కమలాలు వికసిస్తాయి. గంగ యమున

సరస్వతీ సంగమస్థానం త్రివేణిలో హంసలు సంతోషంతో సంచరిస్తాయి. ఆ వేళ కలువలు ముకుళిస్తాయి. చంద్రుడు ఒరిగి ఒరిగి సముద్రంలో మునిగిపోతాడు. కడచిన రాత్రి అంతా ఒకదాని కెదురుగా వేరొకటి నిలచియున్న చక్రవాక దంపతులు రాత్రి అంతం కాగానే ఉదయం కలుస్తాయి, ఆనందిస్తాయి. ఇది స్థూలంగా ప్రకృతి వర్ణనాచిత్రం ఈ రేఖలలో మరో తాత్త్విక భావన ఆవిష్కృతమై ఉండడం గమనించవచ్చు. ప్రకృతి చిత్రాన్ని పొదిగికొన్న తాత్త్వికభావన విడదీయరానిదిగా శిల్పత్వాన్ని పొందింది. ఈ పద్యం కవి రచనా శక్తికి గీటురాయి.

హృదయాకాశాన్ని దహరాకాశమనీ అంటారు. ఈ దహరాకాశంలో అఖండ జ్ఞానోదయానికి పూర్వం (అంటే సూర్యోదయానికి ముందు) చిత్కళలు (అరుణోదయం) వెలుగుతాయి. చిత్కళాజ్ఞానమే అరుణోదయం, ఈ హృదయ గగనంలో అయిదు ఆకాశాలుంటాయి. (1) గుణరహితాకాశం (2) పరాకాశం (3) మహాకాశం (4) తత్త్వాకాశం (5) సూర్యాకాశం. దీన్ని ఆకాశ పంచకమని అంటారు. వీటి మధ్య చిత్కళలు ప్రకాశిస్తూ ఉంటాయి. ఈ చిత్కళా జ్ఞానమే  అరుణోదయం. దీనిచేత అజ్ఞానం తొలగుతుంది. తరువాత వచ్చే అఖండజ్ఞాన (సూర్య) ప్రకాశానికి దిక్కులు బాగా తెలివి (దీప్తి) పొందుతాయి. తెలుపు తిరుగుతాయి. యోగి హృదయంలో మూలాధారం, స్వాధిష్ఠానం, మణిపూరం, అనాహతం, విశుద్ధం, ఆజ్ఞాచక్రములు (తామరలు) వికసిస్తాయి. 1,2 - 2,3 - 3,4 - 4,5... మధ్య 1. గుణరహితాకారం:- ఇది మొదట కన్పించేది. ఈ ఆకాశం తనరూపం, గుణమైన శబ్దం లేకుండా ఉంటుంది. 2. పరాకాశం:- దట్టమైన, భీతిగొల్పే అంధకారం కలిగి ఉంటుంది. 3. మహాకాశం:- ప్రళయవేళానల జ్వాలాభంగా ప్రకాశిస్తోంది. 4. తత్త్వాకాశం:- బహువిధ విచిత్రయ కాంతి చేత నిండి ఉంటుంది. 5.సూర్యాకాశం:- నూరు కోట్ల సూర్య మండల జ్వలిత్ కాంతితో వెలిగేది.

వీటిని యోగి సద్గురూపదేశానుసారం చూడగలడు. హంస గుణాన్ని గ్రహిస్తుంది. సహస్రారకమలంలో విహరిస్తుంది. ఈ సహస్రార కమలం ఆరు చక్రాలకు పైది. ఇది ఇళ, పింగళ, సుషమ్న, పేరుగలనాడీత్రయానికి కూడలి. ఇదే త్రివేణీ సంగమస్థానం. ఈ సహస్రారంలో హంస సంచరించేప్పుడు ఇంద్రియ భేదజ్ఞానం నశిస్తుంది. భేదజ్ఞానం వల్లనే వికారాదులు ఉత్పన్నమౌతాయి. కాబట్టి భేదజ్ఞానం నశించడం వల్ల వికారాదులుండవు. అవికారమైన రూపం సిద్ధిస్తుంది.

మనస్సు ఆనందంలో లీనమవడమే చంద్రుడు సముద్రంలో మునగడం. ఈ స్థితిలో అఖండజ్ఞానస్వరూపం (సూర్యబింబం) వెలుగుతుంది. దీనివల్ల యోగికి బ్రహ్మాండ పిండాండముల సాక్షాత్కారం కలుగుతూంది. ఈ సూర్యుడు చిద్విభావనుడు, సర్వ కర్మలకు సాక్షి. త్రికాలా బాధ్యుడు, స్వప్రకాశుడు, తమోఘ్నుడు, సత్త్వ భావుడు. ఈ పద్యంలో

బహుక్లిష్టమైన గహనమైన యోగశాస్త్ర రహస్యాలను ప్రకృతిపరంగా పొదిగి కవితాత్మను భాసమానం చేయడమైంది. ఇది శ్రమైక సాధ్యమైన శిల్పం.

తారకము సాంఖ్యము అమనస్కమన్న యోగాలు మూడు. ఉపనిషదం ప్రతిపాదకాలుగానే చెప్పబడినాయి. ఈ యోగ త్రయాత్మకమైన రాజయోగం జీవ బ్రహ్మైక్య సాక్షాత్కారకారణంగా పరిగణితమైంది. ఈ గ్రంథం ప్రధానంగా బ్రహ్మతతత్వ ప్రతిపాదక నిరూపణ సాధనాపరమైంది. దీన్ని తెలుగువారికి అక్లిష్టంగా, ప్రసన్నంగా అందివ్వడమే కవి ఆధ్యాత్మికమూర్తి పరశురామ పంతుల లింగమూర్తి కవి ఉద్దేశం.

వేదాంతభావనతో, శాస్త్రబుద్ధి నిష్ఠమైన రచనలో వస్తు నిర్వహణలో అక్కడక్కడా కన్పించే కవితాత్మక స్ఫూర్తి కవిగా నిలుపుతూంది. ప్రధానంగా ఇది ఆధ్యాత్మిక విద్యాపరమైన తత్త్వకావ్యం.

# (10) స్ఫోటం - ధ్వని సిద్ధాంతం

సంస్కృత సాహిత్యంలో కావ్యశాస్త్రం ఎప్పటికపుడు వివిధ సిద్ధాంతాల ఆవిర్భాతితో; అన్వేషణలో, ఆలోచనలో సమన్వయగుణంతో అభివృద్ధి చెందుతూ వచ్చింది. పూర్వం సాహిత్యాన్ని గురించి, అందునా కవిత్వం గురించి అలంకార శాస్త్రవేత్తలు జరిపిన చర్చారూపం, సిద్ధాంతబలం, విషయ ప్రతిపాదనం ఈనాటికీ వర్తిస్తాయి. ఒకవిధంగా ఆధునిక యుగంలోను అధ్యయనయోగ్యంగాను ప్రత్యేకతను కలిగింది. సాహిత్యశాస్త్రంలో – అలంకార గుణ రీతి, ఔచిత్య అనుమాన వివిధ సిద్ధాంతాలకన్నా; అన్నిటిలోని ముఖ్య లక్షణాల్ని అంతర్భవింపజేసుకున్న సమగ్ర రూపంగా సహృదయుల ఆమోదాన్ని పొందింది 'ధ్వని' సిద్ధాంతం. దీన్ని ప్రతిపాదించిన అనందవర్ధనుడు, సాహిత్య ప్రపంచానికి 'ఆనందవర్ధను'డయినాడు. 'ధ్వని' సిద్ధాంతం ప్రతిపాదితమైన 'ధ్వన్యాలోకం', కావ్యాత్మను ప్రతిష్ఠితం చేసింది, అఖండమైన కీర్తి ప్రతిష్ఠల్ని పొందింది. 'ధ్వని కావ్యానికి ఆత్మ' – అన్న ప్రతిపాదనం ఉపనిషత్ప్రేరణగా, సమన్వయ భావరూపంగా, ఉత్కృష్టమైన ఆలోచనారూపంగా నిలిచింది. అలంకార గుణాదులు ధ్వనిలో పర్యవసింప జేసే భావన, ఆత్మ తత్త్వానిష్కారక సన్నిహితంగా ప్రవృత్తమయింది.

'కావ్యస్యాత్మాధ్వనిః' అన్న సిద్ధాంత ప్రతిపాదనం భారతీయ సంస్కృతిః విశేషంలో భాగమైంది. సాహిత్య లోకంలో దీని అస్తిత్వం సర్వత్ర గుర్తింపబడింది. 'ఆత్మ' ఆంతరికమైంది. అందువల్ల కావ్యాత్మయైన 'ధ్వని', ప్రధానంగా కావ్యంలో అంతస్తత్వంపై ఆధారపడి ఉంది. 'యత్రార్థం: శబ్దో వా తమర్థముపసర్జనీకృత స్వార్థౌ వ్యఙ్తః కావ్యవిశేషః స ధ్వనిః' – యని; ఎక్కడైతే వాచ్య వాచక శబ్దం తననూ తన అర్థాన్నీ గౌణం చేసుకొని, మరో విశిష్టమైన రమణీయమైన (వ్యంగ్య) అర్థాన్ని వ్యక్తం చేస్తుందో ఆ కావ్య విశేషమే ధ్వని అని సిద్ధాంతం. ఇందులో వాచ్యార్థం కన్నా వ్యంగ్యార్థం ముఖ్యమవుతుంది. మహాకవుల వాక్కులో పైకి ప్రసిద్ధంగా కన్పించేదానికన్నా భిన్నంగా "ప్రతీయమాన" మయిన ఉదాత్తమయిన అర్థం భాసిస్తుంది, ఆకర్షిస్తుంది, ఆహ్లాద కారణమవుతుంది.

ప్రస్తుతం, ఆనందవర్ధనుని ధ్వని సిద్ధాంతానికి మూలమైన స్ఫోటవాదాన్ని గురించి సమాలోచనానికి మాత్రమే ఈ సమాలోచనం పరిమితమైంది. స్థూలంగా చెపితే ఈ "ధ్వని"కి ఆధారం వ్యాకరణ శాస్త్రంలోని "స్ఫోటం"గా గుర్తింపబడింది. దీనిపై ఆనందవర్ధనుడు ధ్వని సిద్ధాంతాన్ని రూపొందించి శాస్త్రసమ్మతమైన స్థితిని కల్పించి, విద్వాంసుల ఆమోదాన్ని పొందడంతో దీని ప్రతిష్ఠ ఇనుమడించింది. ఇదే విధంగా, ఉపనిషత్ప్రతిపాదితమైన 'ఆత్మ'తత్త్వానికి ప్రాధాన్యం ఇవ్వడమూ; ఉన్నతమైన స్థాయితో పాటు అంతకు ముందు వచ్చిన వివిధ సిద్ధాంతాన్ని అంగీకరిస్తూ సమన్వయపరుస్తూ జరిపిన సహేతుక వివేచనం ప్రామాణికరూపానికి దారితీసింది.

ఇక స్ఫోటానికి వస్తే, వ్యాకరణ శాస్త్రం అన్ని శాస్త్రాలకూ మూలమైందీ, మాన్యమైందిగా భావితమయింది. "ఉపాసనీయం యత్నేన శాస్త్రం వ్యాకరణం మహత్। ప్రదీపభూతం సర్వానాం విద్యాం యదవస్థితమ్॥ – వ్యాకరణం ఎంతో భక్తిశ్రద్ధలతో అధ్యయనం చేయవలసిన విషయం. ఇది సర్వవిద్యలకూ ప్రదీపభూతంగా నిలిచింది.

సాహిత్య జగత్తులో మైయాకరణులు మొదటి శ్రేణి విద్వాంసులుగా పేర్కోబడినారు. ధ్వని సిద్ధాంతం సర్వలక్షణ సంపన్నమైంది. ఆనందవర్ధనుడు ధ్వన్యాలోకంలో,

**న తు యతా కతం చిత్రవృత్తేః ప్రతిపాద్యతే ప్రథమో హి విద్వాంసో వైయాకరణాః**
**వ్యాకరణ మూలత్వాత్సర్వవిద్యానాం హి తేన శ్రూయమాణేషు వర్ణేషు ధ్వనిరిది వ్యవహరతిః**

– వ్యాకరణం శాస్త్రం సర్వ విద్యలకూ మూలంగా భావిస్తూ, శ్రూయమాణ వర్ణాల్లోని ధ్వని స్వరూపానికి సన్నిహితంగా సమాలోచన చేయడం, దాన్ని పేర్కొనడం శాస్త్ర సమ్మతమైన సంప్రదాయ గౌరవ రూపమైన స్థితి దృష్టికి వస్తుంది.

'స్ఫోట' శబ్ద సృజనప్రక్రియను సూచిస్తుంది. ఇది శబ్దం యొక్క బహిరంతర్గతమైన స్వరూపాల్ని, అర్థవికాసాన్ని గురించి, భావ విస్తృతిని గురించి ఆలోచనకు గురి చేస్తుంది. స్ఫోటాయనుడన్న వ్యాకరణ శాస్త్రవేత్త పేరుతో వ్యవహృతమైందీ స్ఫోటవాదం. ఇదే ధ్వని సిద్ధాంతానికి ఆధారభూతమైంది. పాణిని 'అష్టాధ్యాయి'లో 'అవజ్ స్ఫోటాయనస్య' (6–1–123) అని ఉల్లేఖితమయింది. ఇందులో స్ఫోటాయనుడన్న పేరుగల విద్వాంసుని నిర్దేశం కన్పిస్తుంది. ఇతనిచే ప్రతిపాదితమైన సిద్ధాంతం 'స్ఫోటవాదం'గా ప్రసిద్ధి వహించింది. 'కాశికా టీక పదమంజరి'లో హరదత్తుడు పేర్కొన్న 'స్ఫోటాయన పరంపరాయణం యస్య స్ఫోటాయనః', 'స్ఫోటప్రతిపాదక పరో వ్యాకరణాచార్యః' అన్న మాటలు పై అభిప్రాయానికి బలాన్ని ఇస్తున్నాయి. భర్తృహరి 'వాక్యపదీయం'లో దీన్ని గురించి వివేచన కనిపిస్తుంది. ఆ తరువాత వచ్చిన శాస్త్రపరుల కిది మార్గదర్శకమైంది.

వైయాకరణుల స్ఫోటవాదాన్ని అనుసరించి – శబ్ద నిత్యమైంది, అఖండమైంది. ధ్వనివల్ల శబ్ద అభివ్యక్తమవుతుంది. వర్ణాలు శ్రవణేంద్రియబోధకాలయినపుడు ధ్వనులు లక్షితమవుతాయి. స్ఫోటవాదాన్ని బట్టి శ్రూయమాణ వర్ణాలు ధ్వనులు, కావ్యశాస్త్రానికి వస్తే, ఈ ధ్వనులు సంస్థితిని బట్టి వ్యంజకరూపాన్ని పొందుతాయి. "స్ఫుటత్యర్థో అస్మాదితిస్ఫోటః" – దీని నుండి అర్థం స్ఫుటమవుతుంది కాబట్టి స్ఫోటంగా పేర్కొనబడింది. "అర్థం స్ఫోటయతి" అంటే, అర్థాన్ని స్ఫుటపరుస్తుంది, వ్యక్తం చేస్తుంది. "స్ఫుటతి ప్రకాశ యతే అర్థాస్మాత్" – దీని నుండి అర్థం ప్రకాశిస్తుంది. వ్యాకరణ శాస్త్రంలో, వర్ణం అనేది ఉచ్చరించిన మరుక్షణంలో నశిస్తుంది. కాబట్టి అనిత్యమవుతోంది. అయితే స్ఫోటంలో దీనికి భిన్నంగా శబ్దం నిత్యమవుతోంది. ఎందుకంటే, దీని సంస్కారం నశించదు, నిలిచే ఉంటుంది. (దీని నుండి మరొకటి స్ఫుటమవుతుంది, ప్రకాశితమవుతుంది.)

ముఖయంత్రంలో కంఠ తాలవ్యాది వివిధస్థానాల నుండి ఉత్పన్నంతో మాట్లాడే ప్రయత్నం చేత, వాయు స్పర్శ వల్ల రూపొందే వర్ణనాత్మక ధ్వని విశేషమే 'శబ్దం'. ఇది ఒక వస్తువును, భావాన్ని బోధిస్తుంది, స్ఫుటం చేస్తుంది. దీని వల్ల అర్థజ్ఞానం కలుగుతుంది. భావస్ఫూర్తి కలుగుతుంది. ఈ విధంగా అర్థాన్ని స్ఫుటపరచేది స్ఫోటంగా భావితమైంది. ఒక వర్ణం ఉచ్ఛరించగానే మరోవర్ణం దాన్ని అనుసరిస్తుంది. ఇట్లా ఒక వర్ణం తరువాత మరో వర్ణం ఉచ్ఛరించగానే, పూర్వవర్ణం అదృశ్యమవుతుంది, గాలిలో కలిసిపోతుంది. మరో వర్ణం అనుసరించడం జరుగుతుంది. ఇట్లా శబ్దంలోని వర్ణాల క్రమం సాగుతుంది. వర్ణాలు నశించినా వర్ణాలతో ఏర్పడిన పదాల అర్థం మనసులో నిలుస్తుంది. ఇది దాని సంస్కారం చేత సిద్ధిస్తుంది. వర్ణాల అనుభవక్రమంతో మొత్తం మీద ఉద్దిష్టమైన, భావితమైన అర్థబోధ, భావస్ఫూర్తి కలుగుతుంది. ఈ విధంగా అర్థాన్ని స్ఫురింపజేసే అభివ్యక్తమే స్ఫోటంగా గుర్తించడం జరిగింది. "వర్ణాతిరిక్తః వర్ణాభివ్యంగ్యః అర్థ నిర్ణాయకోనిత్యః శబ్దః స్ఫోటః" అని నిర్వచితమైంది. స్ఫోటం వర్ణాలరూపమైన శబ్దం నుండి అర్థనిర్ణాయకమైన స్థితి నుండి ఉద్భవిస్తుంది. వర్ణాల అనుభవం వల్ల కలిగిన సంస్కారం చేత చివరి వర్ణాల అనుభవం దాకా పర్యాప్తమైన అర్థాభివ్యక్తి కలిగింది. "పూర్వపూర్వ వర్ణానుభవాహిత సంస్కార సహితేన అంత్యవర్ణానుభవేన అభివ్యజ్యతే" యని స్ఫోటం వివృతమయింది. శాస్త్రజ్ఞులు "శబ్దబ్రహ్మణాం విపశ్చితాం మతమాశ్రిత్యైవ ప్రవృతోయం మతః" – స్ఫోటమతం శబ్ద బ్రహ్మవిదులైన మహావిద్వాంసుల సమాలోచనను పురస్కరించుకొనియే ప్రవృత్తమైంది. ఈ విధంగా శాస్త్రత్వం స్థాపితమైంది. వైయాకరణుల మతంలో స్ఫోటం, ఆనంద వర్ధనుని మతంలో వ్యంజనలో అర్థాంతరశక్తిని పొందిన రూపంగా ఆవిష్కృతమయింది.

స్ఫోటవాదం శబ్దం యొక్క నిత్యత్వాన్ని అంగీకరిస్తుంది. యాస్కుడు, పాణిని ఇరువురూ దీని ప్రాముఖ్యాన్ని గుర్తించారు. కాత్యాయనుడు, పతంజలి దీన్ని సమర్థించారు. ఈవిధంగా స్ఫోటవాదం శాస్త్రసమ్మతమైంది. సంప్రదాయ సమాలోచనాబలాన్ని పొందింది. ఆనందవర్ధనుని ప్రతిభచేత, కావ్యశాస్త్రంలో నూత్నమైన విశిష్టమైన అర్థాన్ని భావింపజేసే శక్తిస్థానంగా ఇది గుర్తింపబడింది. భర్తృహరి 'వాక్యపదీయం'లో పై అర్థాన్ని గురించి వివేచన చేయడం కనిపిస్తుంది.

**ద్వా వుపాదాన శబ్దేషు శబ్దౌ శబ్దవిదో విదుః।**
**ఏదోనిమిత్తం శబ్దానామపరోర్థే ప్రయుజ్యతే।।** అని, మొదటిది కేవలం ధ్వనిరూపశబ్దం (ఉపాదాన కారణం). ఇందులో అర్థజ్ఞానముంటుంది. రెండవది ధ్వనిరూప శబ్దం. అర్థవికాసముంటుంది, అర్థభేదముంటుంది. ఈ విధంగా స్ఫోటం క్రమంగా వ్యంగ్యంగా మరియు ధ్వని వ్యంజకంగా పరిణమించడం సూక్ష్మతలంపై విశ్లేషితమైంది. దీన్ని వివరిస్తే, స్ఫోటస్థితి కాష్టంలో అగ్నివలె శబ్దంలో నిహితమై ఉంటుంది. లక్ష్యాన్ని బట్టి రూపితమవుతుంది; అనుభవానికి వస్తుంది. కాష్ఠంలో ఉన్న అగ్ని ఒక స్థితిలో

అజ్ఞాతంగా ఉంది, మరో స్థితిలో జ్వలితమవుతుంది. చిత్రమేమిటంటే అగ్నిమయం అవుతుంది. ప్రకాశమానమవుతుంది. ఇదేవిధంగా ధ్వనివల్ల వ్యంజితమైన స్ఫోటశబ్దం కూడా విలసిస్తుంది.

వైయాకరణుల దృష్టిలో ధ్వని రెండు విధాలు. ఒకటి ప్రకృతం, రెండవది వైకృతం. ప్రాకృతమంటే అర్థాత్తు మౌలికమైంది, వైకృతమంటే దాని అనురణనం (ఇది చాల ముఖ్యమైంది. ఆనందవర్ధనుని ధ్వని సిద్ధాంతంలో ఇది ప్రాముఖ్యం కలిగింది). స్ఫోటంలో, 1. గ్రహణ కారణంగా ప్రాకృతధ్వని; 2. వృత్తిభేదనిమిత్తంగా వైకృతధ్వని అనుభవానికి వస్తాయి. వైయాకరణులు వర్ణించిన ధ్వనిని లోచనకారుడు కావ్యసిద్ధాంత ధ్వనిగతంగా సంయోజితం చేస్తూ పై అభిప్రాయాన్ని కనపరచాడు. ఏ వ్యంగ్యార్థం 'ధ్వని' అని పిలువబడుతుందో, అది ఘంటాదిస్థానంలో అనురణన రూపంలో ద్యోతమానమవుతుంది. అనురణనమంటే తరంగాల్లా ఒక దానిననుసరించి మరో ధ్వనిపరంపర అన్నమాట. ఈ అనురణనస్థానీయమే శబ్దగతమైన వివిధార్థాల స్ఫూర్తి విశేషం, వ్యంగ్యార్థభాసురం, కావ్యాత్మ ధ్వనిస్వరూపం. ఇది ప్రతీయమాన లేదా అర్థాంతర శక్తి సంపన్నమైంది. కావ్యశాస్త్రంలో స్ఫోటం బీజభూతస్థితి నుండి, ఆనందవర్ధనుని శాస్త్రగత ప్రతిభ చేత వ్యంగ్యార్థ భాసురమైన ధ్వనివిశేషంగా వికసితమైంది. ఇది 'ఆత్మ'తత్త్వంతో యోజితమయి, 'చారుత్వాతిశయ' గౌరవస్థితిని పొందింది; భారతీయ కావ్యశాస్త్ర ప్రపంచంలో అపూర్వమైన సమాలోచనా మార్గాన్ని నిర్మించింది.

# (11) అమృత స్పర్శ - గీత - ఆత్మ తత్త్వం

**"న యస్య జన్మ కర్మాభ్యామ్ న వర్ణా శ్రమ జాతిభిః**
**సజ్జతే స్మిన్ అహంభావో దేహే వై వ హరేః ప్రియః"**

ఈ దేహంలో సజ్జితమై ఉన్న వ్యక్తిత్వం జన్మ కర్మ వర్ణాశ్రమ జాతి భేదాలకతీతమైంది. ఇది హరికత్యంతమూ ప్రియమైంది. భగవదనుగ్రహానికి పాత్రమైంది. ఈ పాత్రతదేవి చేత ఏర్పడుతుంది? అంటే సంస్కారం చేత, సత్కర్మ చేత అని సమాధానం. దీనికి వ్యక్తిలో ఆత్మోన్ముఖత్వం - తత్ప్రయత్నమూ అవసరం. దీనికి మానవశక్తితో పాటు భగవదనుగ్రహమూ అవసరం. ఇది ఒక దశలో కాదు. ఎన్ని దశల్లోనో సోపాన క్రమాన్ని పొందింది. ఇది నిరంతరమైంది. అవిచ్ఛిన్నమైందీ.

భగవదనుగ్రహం వెలుగువలె మనస్సును స్పృశిస్తుంది. సాధారణ జీవితాల్లోను (విశేషజీవితాలు సరే! అట్లా ఉంచి) వివిధ స్థాయిల్లో మెరపు వలెనో దీపశిఖవలెనో ఉదయరేఖవలెనో ప్రకాశమానమవుతుంది. ఎంతో సంక్లిష్టమైన జీవితంలో ప్రతవ్యక్తి ఎప్పుడో ఒక్కసారైనా జీవితంలో భగవత్కృపను అనుభవించడం జరుగుతుంది. దీనికనుగుణమైన పరిస్థితి ఏర్పడుతుంది. శిశువుకు స్పర్శతోనే మాతృరూపం అనుభూతమౌతుంది. "హస్త స్పర్శోహి మాతౄణాంఅజలస్య జలాంజలిః" అంటాడు భానుడు. మాతృస్పర్శలోని సుఖం దేహ మనోగతమైంది. భగవదనుగ్రహ స్పర్శ ఆపైన ఆత్మగతమైందీ.

భగవదనుగ్రహం అంటే అమృతస్పర్శ అన్నమాట. దివ్యమైన శక్తి ప్రసారం. ఇది చాలా వరకు అదృశ్యంగానో అస్పష్టంగానో సాధారణ స్థాయిలో జరిగిపోతూ ఉంటుంది. బహువిధాలైన జీవన వ్యాపారాలు, వ్యాపకాలు దీన్ని బయట పడకుండా చేస్తాయి. సంపూర్ణంగా అవగతికి రానీయవు. భగవత్కృప ఒక విధంగా సహేతుకమైన పరిణామ రమణీయమైంది. ఆరాధన ధ్యానం సాధన తపస్సు మొదలుగా సుపరిష్కృతమైందీ. ఆత్మోన్ముఖం చేసేదీ. చిరప్రకాశం కలిగిందీ. స్వయం ప్రకాశమైందీ.

మరోవిధం - నిర్హేతుక జాయమానమైందీ, పైకి కన్పించనంతమాత్రాన హేతువు లేదని కాదు. స్థూల దృష్టికి తెలియదన్నమాటే గాని దీనికి ఏదో హేతువు సిద్ధమై ఉంటుంది. ఇది తత్కాలవశమైంది. చాల పరిమితమైన ప్రయోజనం కలిగింది. సుకృతం చేత సిద్ధిస్తుంది. నిర్హేతుకమైన ఆభాసగా ప్రతిభాసిస్తుంది. సద్యః ఫలాన్ని ప్రసాదిస్తుంది. అయితే ప్రేమ వేదన చింతన స్పందన మొదలైన మనోభావాలు మరింత దోహదం చేస్తాయి. ఆ పైన వీటి రమణీయ పరిణామ రూపమే భక్తి. అసంఖ్యాకమైన మానవులు! ఎన్నెన్నో విధాలైన చిత్తవృత్తులూ! ప్రవర్తనలూ! ఒక చిత్రమేమంటే! ఛల వర్తనులు

కూడా భగవంతుని ఆశ్రయిస్తారు. ఇక్కడ భగవదనుగ్రహానికి వాత్సల్యం కారణమౌతుంది. ఇట్లా అనేకం వివేచనకందుతాయి.

స్థూలంగా సద్భావానికి వస్తే రెండు తలాలు కన్పిస్తాయి. ఒకటి ఉపకార స్వభావం ఉదారగుణం త్యాగశీలం మానవత్వం మొదలైన గుణాలపట్ల అభిలాష కలిగింది. మరొకటి ఆత్మతత్త్వం, చైతన్యం దివ్యత్వం పట్ల అభిమతి కలిగింది. మొదటిది రెండో దానికి ఆయత్తం చేసే లక్షణం కలిగింది. ఈ రెండింటికీ గల భేదాన్ని గుర్తించవలసి ఉంది. ఈ రెండింటికీ గల సంబంధాన్ని భావించవలసి ఉంది. రెండో దాని ఉన్నతికి మొదటిది మూల రూపం అనవచ్చు. మొదటి తలం సామాజిక శ్రేయస్సుకు ఆలంబనంగా నిలుస్తుంది. రెండోది ఆత్మగతమైంది. దివ్యమైంది. ప్రతివ్యక్తిలో ఈ రెండు ప్రపంచాలు ఒకదానితో మరోదాని సంబంధంతో నిరంతరం ఏదో ఒకవిధంగా ప్రవర్తిస్తూనే ఉంటాయి.

ప్రకృతీ మానవుడూ చైతన్యం ఈ మూడింటి పరస్పర సంబంధ రూపమే జీవితం. దివ్యశక్తి ప్రకృతి నుండి ఆరోహణ క్రమం కలిగింది. ప్రకృతీ చైతన్యమూ మధ్య ఉండేది మానవుడు. అంటే రెండు లక్షణాలతో సంపన్నమైన వ్యక్తిత్వం కలిగిన రూపం అన్నమాట. వ్యక్తి భగవత్కృపకు పాత్రతను పొందడానికి మనస్సు చైతన్యోన్ముఖం కావాలి. ఇది అమృత స్పర్శను పొందేందుకు యోగ్యతకు దారి తీస్తుంది. ఈ మార్గం సులభం కాదు. అయితే గురూపదేశం వల్ల ప్రాప్తించే అవకాశం ఉంది. ఆత్మవిద్య వల్ల అవగతికి వస్తుంది. ప్రబోధం వల్ల సాధ్యం అవుతుంది. చింతన వల్ల ఉపలభ్యమౌతుంది.. నిరంతర వేదన వల్ల సన్నికృష్టమౌతుంది. ఇవన్నీ భక్తిసోపాన క్రమంలో అంతర్భవించే లక్షణం కలిగినవే.

మహానుభావుల ప్రసంగాలు, ప్రవచనాలు, ఉపదేశాలు ఆత్మకు ఆధ్యాత్మిక జగత్తును సన్నిహితం చేస్తాయి. పరిపూర్ణం చేస్తాయి. శుభ్రం చేస్తాయి. ఈనాటి సంక్లిష్ట జీవితంలో ధూళి దూసరితమైన వాతావరణంలో దీని అవసరం ఎంతో ఉంది.

**"దుర్లభం త్రయమైవైతత్ దైవానుగ్రహ హేతుకమ్**
**మనుష్యత్వమ్ ముముక్షుత్వమ్ మహాపురుష సమాశ్రయః"**

లోకంలో మనుష్యత్వం ముముక్షుత్వం మహాపురుష సమాశ్రయమం అనేవి దుర్లభాలు. ఈ మహాపురుషులు గురువులు ఉపదేశికులు ఇవి భగవదనుగ్రహం వల్లనే సిద్ధిస్తాయి. ఈ అమృత స్పర్శ దివ్యత్వాన్ని ప్రసాదించే పై మెట్టు. ఇది అట్లా ఉంచి ప్రస్తుతానికి మనోమాలిన్యాన్ని శుభ్రం చేసే మాట వాస్తవం. జీవితంలో ధూళినీ వక్రతనూ చీకటినీ పోగొట్టే, స్వచ్ఛతను ఋజుత్వాన్ని వెలుగునూ, కోరే(క్షణాల్లో) వ్యక్తులందరూ అమృత స్పర్శకు పాత్రులే.

# (12) మానవుని కీర్తి శిఖరం భగవద్గీత

చైతన్య సార సంగ్రహ రూపం వ్యక్తి. 'చైతన్యస్తబక మకరంద' బిందువు. మానవాకృతిలోనే భగవంతుని రూపకల్పన జరిగింది. అతీతానికి ఆధారం లౌకికం, లౌకికానికాదర్శం అతీతం. చైతన్యబిందువు జడంలో తన శక్తిని పరి పరి విధాలుగా ప్రదర్శిస్తుంది. సావయవపూర్ణంగా ఉంటూ, ఎక్కడికక్కడ సర్వ సంపూర్ణతకై ఎప్పటికప్పుడు మానవ ప్రయత్నం జరుగుతూనే ఉంటుంది. ఈ యత్నం నిరంతరం సాధనామయమైంది. దీని అనేక రూపాలే వివిధ తత్త్వాలు, దర్శనాలు మత ధోరణులూ. ఇవి వ్యక్తి వికాసంతో పాటు సమాజోన్నతికీ ఎంతగానో దోహదం చేసాయి. ఉన్నతమైన సంస్కృతి అంతా వీటి పర్యవసానమే. ఏ చైతన్యానికైనా ఉపాధి తప్పదు. ఇది వివిధ స్థాయిల్లో ఉంటుంది. ఈ భౌతిక రూపాన్ని దూషించి తిరస్కరించి అవనతం చేసి ప్రయోజనం లేదు. ఇది వాస్తవ జగత్తులో అసాధ్యం. ఆధ్యాత్మిక జగత్తులోనే? ఊహకతీతం. సమాజం ఎటువంటి మలుపులు తిరిగినా, వ్యక్తి ఏ విధమైన ఆలోచనల్ని వహించినా జీవితమంతా అతీతశక్తిని నిరాకరిస్తూ ఉండటం కుదరదు. అన్వేషణ, జిజ్ఞాస, దర్శనం అనేవి మనస్సుకు సహజం.

ఆధునిక జీవితం, తత్త్వ ప్రపంచం రెండూ ఒకదాని కొకటి వ్యతిరేకం కాదు. విజ్ఞానశాస్త్రం విషయాన్ని సహేతుకంగా అనుభవపూర్వకంగా పరీక్షకు నిలిపి నిర్ణయాలకు వస్తుంది. ఒక దశలో సమాజానికుపయోగకరంగా పరిణమింపజేయబడతాయి. తత్త్వ ప్రపంచంతో జీవించే మతం ఆలోచనతో అన్వేషణతో అనుభవంతో నైతిక క్రమంతో మానసికమైన శాంతికి ఆనందానికి మూలమౌతుంది. ఆత్మభావన చేత విశ్వజనీనత్వాన్ని పొందుతుంది. విజ్ఞానశాస్త్రం సాధించిన విజయాలకు తాత్త్విక స్పర్శతో, సమాజం కలహాలనుండి యుద్ధాల నుండి నివారింప బడుతుంది. శాంతి సౌభాగ్య పూర్ణమౌతుంది. మానవుని అస్తిత్వం నిలుస్తుంది. జాతి సంస్కృతి పరిరక్షితమౌతుంది.

ప్రతి తరంలో మతం, సమాజంలో వచ్చే మార్పుల్ని బట్టి పనికిరాని వాటిని పక్కకు నెట్టేసి ముందుకు పోయే ప్రవాహం వంటిది. ఇది ఆ మతంలో ఆవిష్కృతమైన తాత్త్విక శక్తిని బట్టి ఉంటుంది. ఈ లక్షణం ఆ మతం జీవించి ఉందన్నదానికి నిదర్శనం. దీనివల్ల మతం బరువు అవదు. వ్యర్థమైన అలంకారం కాదు. అవశ్యకమైందీ సార్థకమైందీ అవుతుంది. వివేకానందుడు చేసిన మహత్తరమైన కార్యమిదే. ఈనాటి మతాధిపతులూ పీఠాధిపతులూ అనివార్యమైన మార్పుల్ని స్వీకరించాలిసిందే. ఇటీవల వీరు సామాజిక సంబంధాలతో వర్తమానం నుండి భవిష్యత్తుకు జాతిని పయనింపజేసే మార్పుకు స్వాగతం పలకడం హర్షణీయం. వ్యక్తిలో ప్రేమ, శాంతి, విశ్వభావన మొదలైన ఉదారగుణాలతో నిలిపే తత్త్వపూర్ణమైన మతాన్ని ఎవరూ శాశ్వతంగా వదలుకోరు. సమాజమూ వదలుకోలేదు. ఇది చరిత్రలో భాగమైంది. జాతి సంస్కృతికి ప్రాణశక్తి.

ఈనాటి అవసరాలకు తగిన విశాల దృష్టితో భారతీయ సంస్కృతికి ప్రాతినిధ్యం వహించే మహాగ్రంథాలు పునర్వ్యాఖ్యాతం కావలసి ఉంది. అలజడితో అశాంతితో హింసతో సంకుచితమైన వాతావరణం క్రమంగా స్తిమితత్వంతో సహనంతో ప్రేమతో వికసితం కావలసి ఉంది. భారతీయ చింతన పునః ప్రదర్శితం కావలసి ఉంది. మనిషి కేవలం ఆహారం, ఆచ్ఛాదనం, లోకవ్యవహారంతోనే తృప్తిపడడు. ఇంకా ఏదో పొందాలిసింది మిగిలే ఉందనిపిస్తుంది. దేనిచేతనో కాలాన్ని సార్థం చేయాలనుకుంటాడు. దేనిచేతనో మనస్సును పరిపూర్ణం చేయాలనుకుంటాడు. దీనికై భావన సాధన దర్శన శక్తులతో వివిధ పార్శ్వాల్ని మలచుకుంటాడు. సమాజంలో ఇది నిరంతరం జరుగుతూనే ఉంటుంది. పూర్వం జరిగిన దాన్ని అందుకొని కొత్తగా సాగుతూంటుంది. ఇందులో శిఖరాల్ని అందుకొనే లోతుల్ని స్పృశించే అంచుల్ని ఒరసీ, జీవితానికి తాత్త్విక రూపాన్నీ అప్రత్యక్షమైన అనుభవ సౌభాగాన్నీ ప్రసాదించే సంపుటి ప్రస్థానత్రయం. ఇది అద్వైత విశిష్టాద్వైత ద్వైతమార్గాలకాధార భూమిగా ఉంది.

**2**

మంత్రపుష్పం మొదలుకొని భగవద్గీత వరకు శాఖోపశాఖలుగా ప్రవర్తిల్లిన తత్త్వప్రపంచంలో విరాట్ స్వరూపంతో పాటు “అణోరణీయ” రూపమూ దర్శితమైంది. జడంలో చైతన్య స్పందనం అగ్నినుండి నీరు “అగ్నేరాపః” అమృతానుభవం, సూక్ష్మంగా చూస్తే జీవితానుభవానికీ తత్త్వప్రపంచానికీ మధ్య అదృశ్యమైన అనుబంధాన్ని భావింపజేస్తాయి. వాస్తవానికీ అతీతానికీ మధ్య సత్యానికీ కల్పనకూ మధ్య జడత్వానికీ చేతనకూ మధ్య స్థిరమైన విభజన రేఖను నిర్ణయించడం కష్టం. ఇది స్థితిని బట్టి సందర్భాన్ని బట్టి అటు ఇటు మారుతూంటుంది. లౌకికంనుండి అలౌకికానికీ రంజనం నుండి ఆనందానికీ ఆలోచననుండి అనుభూతికీ మారే పరివర్తన దశ ఎక్కడ మొదలై ఎక్కడ నిలచేదీ నిర్ణయించడం సులభం కాదు. ఇదేవిధంగా వ్యక్తి జీవితంలో అధరం నుండి ధర్మాన్ని వేరు చేసే స్థితి సందేహానికి గురిఔతుంది. విశేష సందర్భాల్లో జీవితంలో జరిగే గొప్ప సంఘర్షణలు, జాతి జీవితానికి మార్గదర్శకాలవుతాయి. ఇటువంటి గొప్ప సంఘటననాశ్రయించి అవతరించిందే మహాభారతంలోని భగవద్గీత.

అర్జునుడు మహావీరుడు, శ్రీకృష్ణుడాతని బంధువు. స్నేహితుడు ఉపదేశికుడు ప్రేరకుడు రక్షకుడు ఆత్మరూపుడూ, ఇట్లా బహుముఖీనమైన వ్యక్తిత్వంతో మానవుని సర్వశక్తిని ఆవిష్కరించే సంపూర్ణమైన పాత్ర. గీత – వ్యాసమహర్షి ఉపదేశం – దర్శనం. సర్వోపనిషత్ సారసంగ్రహం. సంఘర్షణలో జీవితం పొందే అంచుల్ని స్పృశిస్తూ సాగిన అపూర్వ నిర్మాణం. తాత్త్విక తృష్ణను తీర్చడం అట్లా ఉంచి, జీవితంలో ఆకర్మణ్యానికీ అశక్తికీ స్వస్తి పలికిన ఆదర్శగ్రంథం. మహాభారత కథతో అనుసంధించి చూస్తే దీని

ప్రయోజనాత్మకత బాగా అవగతమౌతుంది. భౌతికతలంపై ఎదురయ్యే సమస్యల నుండి ఎగసిపైపై అతీతభూమికలో పరిష్కారాన్ని సూచించడం దీని విశిష్టత. ఇక్కడే అపహరణీయమైన విధి పాత్ర వహిస్తుంది.

**"యదా యదాహి ధర్మస్యగ్లానిర్భవతి భారత!**
**అభ్యుత్థానమధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్"**

ధర్మానికి జరిగే గ్లాని జీవితానికి సంబంధించింది. వేదన వ్యక్తిగతమైంది. దీన్ని పరిష్కరించే పద్ధతి నిమిత్తమాత్రగుణంతో ఒకవైపు అలౌకిక పరిధికి చెందింది. మరోవైపు వ్యక్తిగతమైన వేదననుండి సమాజపరమైన బాధ్యతకు మరలింది. భగవంతుడు సమాజంలో ధర్మం కోసం మానవుడుగా అవతరించడం ఇందులో విశేషం. ఇందులో సమస్యకు పరిష్కారం ఉంది. లక్ష్య నిర్దేశం ఉంది. భౌతిక భౌతికాతీత దివ్య దశల నిష్పత్తి – వీటి సమన్వయం. కాలం గడచే కొద్దీ అవసరాలను బట్టీ అనేకమైన వ్యాఖ్యానాలకవకాశం ఇచ్చింది.

**3**

మౌలికంగా చూస్తే గీతలో తత్వోపదేశం ఉపనిషత్తుల్లో ప్రతిపాదితమైందే. ఐనా దీనికొక సందర్భం ఉంది. పాత్రల చర్య ఉంది. లోక ప్రవృత్తి ఉంది. చూపే ఆదర్శశిఖరం ఉంది. వ్యక్తినీతితో రాజనీతితో కూడిన మానవ జీవితానికి చెందిన వాతావరణంతో రూపొందింది. దీనితో పాటు అంతర్గతమైన మార్మికత ఉంది. ఆలోచనా రమణీయమైన తాత్త్వికత ఉంది. ఇది ఎక్కడో ఏ ఆశ్రమంలోనే రహస్య నివేశనంలో ఉపదేశించింది కాదు. రణరంగంలో ఇరువైపుల తీర్చిన సేనల మధ్య అర్జున రథం నిలిచిపోయింది. సంశయం తల ఎత్తింది. భయం ఆవహించింది. స్థైర్యం చెడింది. శక్తి లోపించింది.

శ్రీకృష్ణుని ఉపదేశంతో సంశయం తీరింది. ధైర్యం వచ్చింది. ఉత్సాహం అతిశయించింది. శక్తి సంపన్నమైంది. రథం కదిలింది. ఉపనిషత్తుల కాలం వేరు. ఇతిహాసాదుల కాలం వేరు. ఇది చెప్పే పద్ధతి వేరు. భగవద్గీత నిర్మాణ రూపం వ్యాస మహర్షి అపూర్వ సృజన శక్తికి పరాకాష్ఠ. ఇందులో కర్మ జ్ఞాన భక్తి యోగ మార్గాలకు చెందిన భావజాలం పొందిన సంవిధానం దేనికది విడివిడిగా కాక అధిగతమై, మహాజీవితం వలె ఎప్పటికపుడు క్రొత్త ఆలోచనకు దారితీస్తుంది. ఆత్మ అనేది విభువూ, సర్వవ్యాపి అని ఒకరు, ఆత్మ అణువని మరొకరూ ఇట్లా ఎన్ని సిద్ధాంతాలకో అవకాశమిచ్చే అచిద్గగనం ఈ విరాట్ రూపం. ఒక్కొక్క మహాపురుషుని కొక్కొక విధంగా దర్శనమైంది. వేదాంతం వేరు. అద్వైత సిద్ధాంతం వేరు. గీతలోని ఉపనిషద్భావనకు చెందిన వేదాంత సత్యాలు అద్వైతానికీ ద్వైతానికీ విశిష్టాద్వైతానికి దారితీసాయి. ప్రస్థాన త్రయంలో గీతకున్న

స్థానం లోక వ్యాప్తమైందీ, హృదయావర్జకమైందీ, కర్మ యోగం రాజయోగం జ్ఞానయోగం భక్తియోగం చేత సంపన్నమైంది.

గీతలో భారతీయ తత్త్వ ప్రపంచానికి కీలకమైనవి, నుగమ సుందరంగా నిబంధితమైనాయి. మొదటి స్థాయిలో కర్మసిద్ధాంతం, పునర్జన్మ, ఆత్మ వివేకం మోక్షభావం – వీటితో పాటు గురూదేశం, భగవద్భావన, విగ్రహారాధన, ధర్మ ప్రవృత్తీ – ఆ తరువాత స్థాయిలో ప్రేమ, కరుణ, సానుభూతి, ఉదారత మొదలైన విశ్వజనీన భావజాలంతో భారతీయ సనాతన సంస్కృతీ ప్రమాహానికి ప్రతీకగా నిలిచింది. ఇందులో ఆశ నిరాశ – సుఖం దుఃఖం – జయం అపజయం – నీతి అవినీతి – ఉత్సాహం నిరుత్సాహం మొదలైన ద్వంద్వాల నుండి క్రమించి పరిణమించే మానవ జీవితం గురించి జరిపిన ఆలోచనా రూపం త్రికాలాబాధ్యంగా స్థిరపడింది.

వీటి వెనుకనున్న “ఆత్మ” “నైషా తర్కేణ మతిరాపనీయా”. జీవితంలో బలహీనతల నుండి సంక్షోభం నుండి సంఘర్షణలో పైకెదిగిన మానసిక శక్తితో విజయాన్ని సాధించే మానవుని వ్యక్తిత్వం ఆధునిక సమాజాన్ని ఆకర్షిస్తుంది. బాహ్య దృష్టినాకర్షించే తత్కాలానికి చెందని మత ప్రయోజనాలనూ వలయాలనూ అధిగమించిన విశ్వజనీనత, గీతను విశ్వతలంపై నిలుపుతూంది. ప్రకృతీ మనిషీ, భక్తుడూ భగవంతుడూ జీవుడూ ఆత్మతో అనుబంధితమైన తత్త్వ ప్రపంచాన్ని అనురణించే సామాజిక సత్యం భగవద్గీత. ఇది మానవుని కీర్తి శిఖరం.

# (13) ఉపనిషద్భావన - ఈనాటి అవసరం

మానవ మహాసంస్కృతికి చెందిన మౌలికమైన విషయాలు స్థిరపడినవీ, శాశ్వతమైన విలువలతో కాలాంతరాన తగిన సందర్భ వివరణలతో వ్యాఖ్యానాలతో మళ్ళీమళ్ళీ చెప్పాల్సిన అవసరం ఉంది. తత్త్వ జగత్తులో దశలు దశలుగా వచ్చే సహాయక రచనలు, ప్రబోధాలు ఇలాంటివే! ఆ విషయాన్ని మరచిపోకుండా చేస్తాయి. వ్యక్తికి వికాసగుణాన్ని, సమాజానికి హితకరమైన మార్గాన్ని చూపుతాయి. దీనికి అవసరమైన అభిలాషను ప్రేరేపిస్తాయి. అంతేకాదు, మనోరూపాన్ని చేతనతో పునర్నవీకృతం చేస్తాయి. వీటికి పాతబడిపోవడమంటూ ఉండదు. ఇవి అవిచ్ఛిన్నంగా సాగవలసిన అవసరం కూడా ఉంది. లేకపోతే సమాజం దుర్గతి పాలవుతుంది.

ఈనాడు ఎటుచూచినా వంచన, కుటిలత, హింసతో సంక్షుబ్ధమైన స్థితుల్లో దీని ప్రస్తావన, ఆచరణ గురించి వేరే చెప్పనవసరం లేదు. ఈ తప్పని బాధ్యతను కొన్ని స్వతంత్రమైన సంస్థలు చక్కగా నిర్వహిస్తున్నాయి. ఇదొక చైతన్య ప్రవాహంలా సాగవలసిందే. తరం నుండి తరానికి కొత్త ధనంతో ప్రకాశించవలసిందే. సమాజస్థిరతకు, సౌభాగ్యానికి గతిశీలం ముఖ్యం; లేకపోతే ఇది జడీభూత మవుతుంది, చలనశక్తి కోల్పోతుంది. సమాజాన్ని నిత్యచైతన్యంవంతంగా ఉంచే మార్గం ఒకటే. అది, భౌతికమైన పునాదులపై పైకి అవతరించిన ఆధ్యాత్మిక నిర్మాణరూపంతో సంబంధం. భౌతికం శరీరాన్ని సూచిస్తుంది. ఆధ్యాత్మికం ఆత్మ వికాస సుందరతను అనుభవానికి తెస్తుంది. ఇది ఉత్తమమైన విలువలతో లక్ష్యసిద్ధికి దోహదం చేస్తుంది. దీనికి లౌకికమైన లాభాలతో ముడిపెట్టే వ్యవహారాలు పనికికావు. భౌతిక సుఖాలను దాటిన ఆలోచనతో 'త్యాగ'శీలం అవసరం. త్యాగం చేతనే గొప్ప గొప్ప ఉద్దేశ్యాలు ఫలాకృతుల్ని దాల్చాయి.

ఆధ్యాత్మిక క్షేత్రంలో తాత్త్వికదృష్టితో సర్వం 'బ్రహ్మార్పణం'గా భావించే కల్మషరహితమైన మనోరూపం ముఖ్యం. ఇది స్వార్థరహితమైన పవిత్రమైన భావనతో సమాజానికి మేలు చేసే మాట వాస్తవం. సంస్కృతి చరిత్రలో దీన్ని గమనించవచ్చు. ఉపనిషత్తులు జ్ఞానకాండకు సంబంధించినవి. వీటి ఆత్మవిజ్ఞానం పరమోత్కృష్టమైన స్థాయిని పొందింది. ఆత్మ చింతనలో అన్వేషణలో దర్శనంలో ఋషుల స్వతంత్రమైన స్వేచ్ఛాభావనలకు దర్పణాలుగా ఉపనిషత్తులు వెలిసాయి. కొన్ని సందర్భాల్లో విభేదించినా, అన్నీ ఏకవాక్యతను కాపాడడం విశేషం.

పరమమైన బ్రహ్మ భావనతో, ఆత్మతత్త్వం ఆవిష్కృతమయింది. 'ఏకసూత్రం'పై అస్తిత్వాన్ని పొందాయి. భౌతికం, మానసికం, ఆధ్యాత్మికం స్థాయిల్లో ఉత్తరోత్తరం బలీయమైన శ్రేయోరూపం స్పష్టంగా కనిపిస్తుంది. వ్యక్తి గురించి వ్యక్తుల సమాహారమైన సమాజం గురించి చింతనతో అపూర్ణమైంది. జీవుని మొదలుకొని పరమాత్మ వరకూ అనుభవరూపం జ్ఞాన ప్రకాశంతో ఉన్నతికి దారి తీసింది. ఒక విశిష్టమైన తత్త్వ ప్రపంచం రూపొందింది.

ఏ ఉపనిషత్తునకది ఒక ప్రత్యేకతతో కనిపిస్తుంది. ఏ ఋషికా ఋషి ఒక స్వతంత్రమైన ఆలోచన, అన్వేషణ, దర్శనం (thought, discovery & vision) తో ఉదాత్తమైన లక్ష్యంతో బ్రహ్మవిద్య/జ్ఞానంతో విలసిల్లాయి. ఇవి స్థూలం నుండి సూక్ష్మానికి (subtle) సాగే ప్రయాణ రూపాలుగా శాశ్వతమైన స్థానాన్ని పొందాయి. ఐంద్రియ భూమిక నుండి అతీంద్రియ భూమిక వైపుకు వేద విజ్ఞానం ఉన్ముఖమైంది. గాఢమైన అనుభూతి గుణానికి ప్రాధాన్యం కలిగింది. జీవి సంస్కారాల సంపుటిచేత సాధనలో స్పష్టమైంది. దీన్ని సంగ్రహంగా చెబితే 1. జీవతత్త్వం; 2. పరమాత్మ భావన; 3. పరబ్రహ్మైక్యం; 4. మోక్షసిద్ధికి జ్ఞానమార్గంలో ప్రయాణం. తెలిసిన అనుభవం నిర్ణయాత్మకమైంది. పూర్ణతను పొందుతుంది. ఉపనిషత్తుల్లో 1. తత్త్వచింతనం; 2. జీవుని అనుభవం; 3. అంతిమ లక్ష్యం; 4. విశ్వరహస్య ప్రకాశనం – సాధనలో (తర్కంతోకాదు) వివేకంతో అవగతమయ్యే పరమ విషయాన్ని, లోపొరలో వికాసరూపాన్ని బోధించడం జరిగింది.

ఉపనిషత్తుల్లో వాక్యాలు సుగమ సుందరంగా, సంగ్రహంగా ఆకట్టుకుంటాయి. ఈ వాక్యాలమధ్య రహస్య విషయాలు గురువు ముఖతః ప్రబోధితమవుతాయి. వాక్యాల్ని అనుసంధించే గుణంతో వివరించేవిగా ఉండడం కూడా జరుగుతుంది. అవి గహనమైన రహస్యాల్ని, ప్రతీక (symbols)లను, అర్థాంతరాలను (suggestive Meanings) తెలుపుతాయి. ఇవి మూలంలో (text) లేవిని. ఉపనిషత్తులు సత్యాన్వేషణంలో గొప్ప భావనారూపంతో మానవ సంస్కృతిలో శిఖరాయమాణాలుగా శాశ్వతమైన కీర్తిని పొందాయి. ఇవి వేద పరంపరలో భాగాలు. వేదాల చివరిభాగాలుగా వీటిని 'వేదాంతము' లని పేర్కొనడం వీటి మహనీయతకు తార్కాణం. వీటిచేత వేదవిద్యకు సంపూర్ణత చేకూరుతుందని అర్థం. మానవ జీవితంలో జీవుడు – కర్మ – జ్ఞానం – మోక్షం గురించి చింతనం, వేద విజ్ఞానమయమైంది. వేదంలో సంవృతి పొందిన రూపం ఉపనిషత్తుల్లో వివృతమైంది. ఋషుల తపఃఫల దర్శన శక్తులచేత, అమరభాషా గుణం చేత శబ్దం మంత్రరూపాన్ని పొందడం మరో విశేషం.

**ఈశావాస్య మిదగ్ం సర్వం**
**యత్కించ జగత్యాం జగత్**
**తేన త్యక్తేన భుంజీథాః**
**మా గృధః కస్య (చిత్) స్విద్ధనమ్॥**

ఈ మంత్రం చాలా ప్రసిద్ధమయింది. ఈశావాస్యోపనిషత్తులో మొదటిది. ఇందులో విషయాన్ని బట్టి సమస్త జనులు ప్రపంచంలో ఏ దేశం బట్టి ఏ మూలనుండైనా స్వాగతం పలికే అర్హత కలిగింది. దీనికి కాలంతో, దేశంతో, మతంతో, వాదంతో పనిలేదు. ఈ ఆలోచన చేయదగిందే కాదు. సత్వరం సమాజశ్రేయం కోసమై ఆచరణలో పెట్టతగింది. ఈనాడున్న సంక్షుభిత పరిస్థితుల్లో దీని అవసరం మరీ మరీ ఉంది.

ఈ కనిపించే జగత్తు 1. ఈశ్వరునిచే నిండి ఉంది. సర్వవ్యాప్తమై ఉంది. 2. ఇది ఈశ్వరుని నిలయం. 3. ఈశ్వరుని ప్రభావంతో, తేజంతో కప్పబడి ఉంది. ఇది ఆచ్ఛాదనంలోని వస్త్రాన్ని తలపిస్తూంది. సత్యం దాగి ఉంది. లౌకిక విషయాల చేత మరుగునబడి ఉంది. ఇక్కడ 'వాస్య' శబ్దం, సంస్కృత భాషా సహజమైన గుణప్రసారం చేత అర్థ విస్తృతికి అవకాశం కలిగింది. ఇంకా ఈ భావ ప్రసారంలో ప్రభుత్వ - పాలన - సమర్థత - నిలయం - విశ్వవ్యాప్తి భావరూపాలతో సంపన్నమయింది. వ్యంగ్య (Suggestive Meaning) శోభను పొందింది. విశ్వంలో ప్రతి అణువూ ఈశ్వరుని ప్రభావంతో పర్యాప్తమయింది. ఎవరికీ దీని నుండి తప్పుకునే, వేరయ్యే, బయటపడే ప్రసక్తి లేనేలేదు.

ఈ భూమిపై లభించేవి అన్నీ వాటిలో తమకు అవసరమైనవీ, కావలసినవీ, కోరేవీ అందరూ తప్పకుండా పొందే, అనుభవించే హక్కు ఉంది. అయితే ఇవి ఎట్లాబడితే అట్లా కాదు. కొన్ని నీతినిబంధనలు, నియమాలు పాటించవలసి ఉంది. కొన్ని హద్దుల్లో ప్రవర్తించవలసి ఉంటుంది. ఇవి తప్పనిసరిగా సాధకులకు, ఉపాసకులకు వర్తిస్తుంది. ఇక్కడ జరిగే తప్పిదం వల్ల వీరికి కష్టాలు, ఆపదలు సంభవించే అవకాశం ఉంది. 1. సత్క్రియాచరణం కలిగి ఉండడం. 2. ఈశ్వరుని నిలయమైన జగత్తులోని పవిత్రతకు క్షతి కలిగించకపోవడం. 3. ప్రతి పనిలో యోగ్యతను కనబరచడం. 4.స్వార్థం నుండి ముక్తమైన, దురాశ నుండి దూరమైన  మనసుతో దైవార్పణంగా బ్రతకడం, 5. ఫలానికై, చేయకూడని పనులు చేయకపోవడమే కాదు, పుణ్యభావనతో వర్తించడం అనేవి మౌలికమైనవి. వీటిని గుర్తించి మసలితే, దైవీయ క్షేత్రంలోకి అడుగుపెట్టే అవకాశం లభిస్తుంది. ఆపైన ఆరోహణానికి పోవలసిన సోపానాలు వేరు. ఇది సాధకుని స్వచ్ఛమైన పవిత్రమైన సాధనావిధంపై ఆధారపడి ఉంది.

ఉపనిషత్తులోని మంత్రంలో పరోక్షంగా హెచ్చరిక ఉంది. స్వార్థం పనికిరాదు. మలినతకు అవకాశమీయరాదు. తనకు చెందని ధనాన్ని మరొకటిని గ్రహించకూడదు. త్యాగ బుద్ధితో వ్యవహరించడమవసరం. ఈశ్వరుని ప్రభావరూపాన్ని జ్ఞాపకం పెట్టుకోవడం ముఖ్యం. ఇవి తలపుకు వస్తాయి.

ఈ జగత్తుకు అనుభవనీయమైంది. దుఃఖమయం కాదు. ఈశ్వరుని పవిత్ర నిలయంలో ఉన్నతమైన ఆశయం గల త్యాగంతో బ్రతకవలసి వుంది. అపుడే నిజమైన సుఖము, శాంతి, సుస్థితి, శ్రేయం లభిస్తాయి. దీనికి ప్రతివ్యక్తీ మనోభూమికలో ఆచరణయుతమైన సాధనగుణం అవసరం. ఈనాటి పరిస్థితుల్లో ఈ ప్రబోధం అవసరం. ఎంతో విలువయింది. ఇది సత్కర్మచేత, సద్బుద్ధిచేత, సత్ లక్ష్యంచేత మాత్రమే సాధ్యం అన్నదే ఉపనిషత్ మంత్ర హృదయం.

# (14) 'సౌందర్య లహరి' - శక్తి తత్త్వం - ఒక పరిచయం

'సౌందర్యలహరి' సంస్కృత సాహిత్యంలో మాతృ దేవతారాధన, శ్రీ విద్యామార్గానికి చెందిన మహనీయమైన స్తోత్రకృతి. మాతృదేవతారాధకులకూ, శాక్తేయ మార్గాభిలాషులకూ శ్రీ విద్యా ప్రేమికులకూ సాధారణ పాఠకులకూ ఎంతో ప్రియమయిందీ, పూజనీయమయిందీ. ఈ స్తోత్రం లోని తాత్త్విక ప్రకాశం, కవితా రమణీయకత కలిసిన అపూర్వమైన శోభ సహృదయుల్ని ఆకర్షిస్తుంది. తాత్త్వికత మరియు కవిత్వమూ రెండింటి చక్కని సమన్వయంతో సుందరమైన ప్రపంచం దర్శనమిస్తుంది. అయితే, వస్తువు తాత్త్విక ప్రాధాన్యాన్నే వరించింది. శక్తి సంబంధమైన త్రిపురసుందరీ మంత్రం యోగసంబంధమైన కుండలినీ విద్య విషయాలతో, ఆధ్యాత్మిక విశేషాలతో సంపన్నమయింది. ఇది నూరుశ్లోకాల సంపుటి. అదనంగా నాలుగు అనుబంధంలో కనిపిస్తాయి.

వేదంలో శ్రీసూక్తం, దుర్గాసూత్రం, భూసూక్తం వీటితో పాటు ప్రముఖంగా పేర్కొబడిన గాయత్రీ మంత్రంలోని దేవీ భావన, స్త్రీ విశిష్టమైన మాతృదేవతారూపం శాక్తేయానికి భూమికలుగా నిలిచాయి. వేదంలో 'ఆయాతు వరదా దేవీ' అనే మంత్రం మొదలుగా స్పష్టంగా దర్శనమిస్తుంది. ఆ తరువాత దుర్గ, అంబిక, లలిత, చండి మొదలుగా వివిధ రూపాల్లో ఇతిహాస పురాణాల్లో విస్తృతిని పొందింది. శక్తి సంబంధమైన దేవీభావనతో కూడిన తత్త్వప్రపంచం ప్రత్యేకంగా ఏర్పడింది. దీనికి ప్రాతినిధ్యం వహిస్తుంది. ఈ 'సౌందర్యలహరి'.

**చతుఃషష్ట్యా తన్త్రైః సకల మనుసన్ధాయభువనమ్**
**స్థితస్తత్తత సిద్ధి ప్రసవ వరతన్త్రైః పశుపతిః।**
**పునస్త్వన్నిర్బన్ధాదఖిల పురుషార్థైక ఘటనా**
**స్వతంత్రం తే తన్త్రం క్షితితల మనాతరదిదమ్॥** (శ్లో. 31)

పశుపతి అయిన శివుడు అరవై నాలుగు తంత్రములతో కూడిన తత్త్వప్రపంచాన్ని ఆవిష్కరించాడు. ఆ తరువాత దేవి కోరికపై స్వతంత్రమైన ధర్మము, అర్థము, కామము, మోక్షము అనే పురుషార్థాల్ని ప్రసాదించగలిగిన శక్తితంత్రాన్ని ప్రత్యేకంగా అవతరింప జేసాడు. ఇది స్త్రీ శక్తికి ప్రాధాన్యంతో త్రిపురసుందరీ మంత్రరూపంతో శ్రీవిద్యామార్గంగా ప్రసిద్ధమయింది. ఆదిశంకరుల 'సౌందర్యలహరి' ఈ మార్గంలో శ్రీచక్రభావన, శ్రీచక్రపూజ, శ్రీచక్రోపాసనతో దేవీ మహనీయతనూ ప్రభావాన్నీ ప్రకటిస్తూంది, ఉదాత్తమయిన ఆదర్శాన్ని బింబిస్తూంది.

ఈ సందర్భంలో, ఆధునికయుగంలో ఆరవిందుల 'సావిత్రి' శక్తిదర్శన రచన జ్ఞాపకం రావడం సహజం. రమణ మహర్షి శిష్యులు కావ్యకంఠ గణపతిశాస్త్రి 'దశ

మహావిద్యా' గ్రంథం ఈ మార్గాన్ని విపులీకృతం చేసింది. ఇంకా ఎన్నో గ్రంథాలు అన్నీ కలిసి శ్రీవిద్యా ప్రపంచాన్ని సుప్రతిష్ఠితం చేసాయి. భారతదేశమంతటా వివిధ ప్రాంతాల్లో శక్తిని ఆరాధించే నిలయాలు వెలసాయి. హిమాలయంలో ఉమ, కశ్మీర్‌లో అంబ, వారణాసిలో విశాలాక్షి, శృంగేరిలో శారద, కేరళలో భగవతి, మైసూర్‌లో చాముండేశ్వరి, మదురైలో మీనాక్షి, కాంచీపురంలో కామాక్షి, మహారాష్ట్రలో భవాని, కన్యాకుబ్జ్‌లో గౌరి, బెంగాల్‌లో కాళి, ఇంకా నగరరక్షణ దేవతగా, శుభప్రదాయిని భద్రకాళిగా ఉజ్వలమయిన యశోరూపాన్ని, మానసికమయిన శాంతినీ ఈ మహాదేవి ప్రసాదిస్తోంది. ఈ దేశప్రజలకూ, ప్రపంచానికీ ఈ రూపాలు మానసికమయిన రక్షా కవచాన్నిస్తున్నాయి.

**విశాలా కల్యానీ స్ఫుట తను రయోధ్యా కువలయైః**
**కృపాధారా ధారా, కిమపి మధురా భోగవతికా।**
**అవన్తీ దృష్టిస్తే బహునగర విస్తార విజయా**
**ధ్రువం తత్తన్నామ వ్యవహరణయోగ్యావిజయతే॥**

ఇందులో ఉదాహరణమాత్రంగా, ప్రాతినిధ్యా పూర్వకంగా కొన్ని నగరాలు పేర్కోబడ్డాయి. అవి సార్థకమైన భావంతో అన్వయాన్నీ పొందుతున్నాయి. విశాలా అంటే, విశాలా నగరం. 'శ్రీ విశాలా విశాలా' అని కాళిదాసు మేఘ సందేశం. శ్రీ–లక్ష్మి (సంపద) చేత సంపన్నమైంది. విశాలమైన కన్నులు కలిగిన దేవి అని అర్థం. కల్యాణీనగరం, శుభాన్ని ప్రసాదించే దేవి అని అర్థం. ఇలా ఒక్కొక్క పేరు ఒక్కొక్క విశేషార్థభాసురంగా దేవీ రూపానికి అన్వయాన్ని పొందుతున్నాయి. వ్యవహార యోగ్యతలో దేవీస్వరూపలక్షణం సూచితమయింది.

ఈ మహాశక్తియే భారతదేశమంతటా దుర్గ–లక్ష్మి–సరస్వతి మూడు రూపాల్లో దేవీ నవరాత్రుల ఉత్సవ శోభను పొందుతోంది.

**గిరా మాహుర్దేవీం ద్రుహిణ గృహిణీ మాగమవిదో**
**హరేఃపత్నీం పద్మాం హర సహచరీ మద్రితనయామ్।**
**తురీయా కాపి త్వం దురధిగమ నిస్సీమ మహిమా**
**మహా మాయా విశ్వం భ్రమయసి పరబ్రహ్మ మహిషీ॥**

సామయికాన్ని స్ఫురింపజేసే మార్గంలో ఈ శ్లోకం 'సౌందర్యలహరి'లో (99వ శ్లోకం) చివరలో ఉంది. ఇది నిర్ణయాత్మకమైన తాత్త్విక విషయం కలిగింది. శివునితో శక్తి యొక్క విడదీయరాని బంధాన్నీ, అనపాయత్వాన్నీ స్థాపిస్తోంది. ఒకటి సహజమయిన స్త్రీ, పురుష సంబంధంలో సమానభావంతో, రెండవది అర్ధనారీశ్వర తత్త్వంలో విశేష భావంతో – క్రిందిస్థాయినుండి పైస్థాయివరకూ ఆలోచనను ప్రేరేపిస్తుంది. 'పరబ్రహ్మ మహిషి'గా శక్తిస్వరూపం అనితరమైన స్థానాన్ని పొందుతోంది.

ఈ మహాశక్తి యొక్క మరో రూపాలే బ్రహ్మ పత్ని అయిన సరస్వతి, హరిపత్ని అయిన లక్ష్మీదేవి, హర సహచరి అయిన పార్వతి. ఈ ముమ్మురిపైన తురీయం, నాల్గవదీ, చివరిదీ మహాశక్తి సులభంగా పొందరానిదీ, సీమలు లేని మహిమ కలిగినదీ. పరబ్రహ్మం – పర బ్రహ్మమహిషత్వం క్రమంగా శివుణ్ణీ, శక్తిరూపాన్నీ కలిపి ఆలోచనకు మరో కొత్తదైన స్వతంత్రమయిన రూపాన్ని దర్శింపజేయడం జరిగింది. ఈమె మహామాయగానూ భావితమయింది. మాయచేత విశ్వాన్ని భ్రమింపజేస్తూంది. ఈ భావం అద్వైతమార్గాన్ని స్పృశిస్తూంది.

**శరీరం త్వం శంభోః శశి మిహిర పక్షోరుహ యుగం**
**తవాత్మానం మన్యే భగవతి! సవాత్మాన మనఘమ్।**
**అతః శేషః శేషీ త్యయ ముభయ సాధారణతయా**
**స్థితః సంబంధో నా సమరస పరానన్దపరయోః॥**

ఇది కీలకమైన శ్లోకాల్లో ఒకటి. ఇది శ్రీవిద్యలోని సమానతకు సంబంధించిన సమస్యను హేతుయుతంగా పరిష్కరిస్తోంది. భగవతి శివుని శరీరంలో భాగం. ఇది అవిభాజ్యమైంది. ఇది శేష–శేషి సంబంధంగా పేర్కొబడింది. శేషి ంటే సమగ్రమయిందీ సంపూర్ణమయిందీ. శేషమంటే భాగం, మిగిలిందీ. ఇరువురూ సమానమయిన స్థాయిలో ఉంటూనే, ఒక్కొక్క సందర్భంలో ఒకరు శేషంగానూ, మరొకరు శేషిగాను తమ తమ పాత్రల్ని నిర్వహించడం జరుగుతుంది. ఈ సంబంధం సమరసమయింది, పరమమయిన ఆనందప్రదమయింది. శివశక్తుల సంబంధం, వివిధ స్థితుల్లో – వివిధ స్థాయిల్లో – సాధారణం నుండి – విశేషం – ఆ పైన పరమందాకా ఎన్నో శ్రేణులలో వర్తిస్తుంది.

అక్కడక్కడా వర్తించే ప్రాధాన్యాన్ని దృష్టిలో పెట్టుకొని శక్తిస్వరూపం ఎక్కువదిగా కౌలమతం/పద్ధతి వెలసింది. 'కులమ్ శక్తిరితి ప్రోక్తమ్' అని, శక్తిది పై చేయిగా భావించడం దీని ప్రత్యేకత.

×××

శ్రీవిద్యలో దివ్య శక్తిస్వరూపం మహాత్రిపురసుందరి లక్ష్యంగా ఉంది. వివిధ రూపాల్లో దర్శనమిస్తుంది. 1. శ్రీ చక్రమంత్రం; 2. శ్రీచక్రయంత్రం; 3. పూజావిధానం – తంత్రం ఆశించే ప్రయోజనాల్ని బట్టి ఇదొక ప్రపంచంగా వెలసింది. శ్రీవిద్య మంత్రము, యంత్రము, తంత్రములతో కూడింది. సాధకుని లక్ష్యం, అవసరం, స్థాయి మొదలైనవాటిని బట్టి వీటి ప్రమేయముంటుంది. ఆ విధంగా ఎన్నుకోవడం జరుగుతుంది.

ఈ విషయంలో సాధారణ జపం, ధ్యానం నుండి యోగసమాధి వరకూ ఎన్నో అంచెలుగా ఉంది. 'సౌందర్య లహరి'లో స్థూలంగా సూచితమయింది కూడా విగ్రహమూ,

భావరూపం మళ్ళీ సాధకుని స్థాయిని బట్టి ఆకర్షణ ఏర్పడుతుంది. ధ్యానశ్లోకాల్లో ఒక్కొక్క విధంగా నిబంధింపబడడమూ గమనించవచ్చు.

**ఉద్యద్భాను సహస్ర కోటి సదృశాం...**
**శివ వామ భాగ నిలయాం, వాణీ రమా సేవితామ్**
**సశర చాప పాశాంకుశామ్...**

మొదలుగా బహువిధాలుగా శక్తి స్వరూపం వివృతమైంది.

యంత్రం త్రికోణాకృతిలో ఉంటుంది. ఇందులోనూ చాలా పద్ధతులున్నాయి. ఒక్కొక్క మహాపురుషుడు తన ఆలోచననూ అనుభవాన్నీ జోడించి మార్పులతో చేర్పులతో విధానాన్ని ఏర్పరచడం జరిగింది. ఇది ఒక సంప్రదాయం, ఒక పద్ధతికి చెంది ఉండడం వల్ల ఆయా గురువుల నుండి పొందవలసిందే. రూప మంత్ర యంత్రం తంత్ర మయమయిన శక్తిస్వరూపం, క్రింది స్థాయిలో జపమూ, పూజ, ధ్యానం మొదలుకొని ఆరాధన, నైవేద్యం, స్తోత్రం, నీరాజనం, హోమం – ఇలా ఇదో ప్రపంచం! ఇది సాధకుని కోరికను బట్టీ, లోకహిత బుద్ధిని బట్టీ, పరిమితుల్ని బట్టీ, శక్తిసామర్థ్యాల్ని బట్టీ ఏర్పాటు చేయబడుతుంది. 'సౌందర్యలహరి' లో క్రింది స్థాయి నుండి పై విశేషమయిన సమాధిస్థాయి వరకూ విషయ పరంపర సుందరమయిన కవిత్వంలో అలరిస్తుంది.

**జపోజల్పః శిల్పం సకల మపి ముద్రా విరచనా**
**గతిః ప్రాదాక్షిణ్య క్రమణ మశనాద్యాహుతి విధిః॥**
**ప్రణామః సంవేశః సుఖ మఖిల నీరాజన దృశా**
**సపర్యా ప్యాయ స్తవ భవతు యన్మే విలసితమ్॥**

జపము, మంత్రము, ముద్రలు, పూజ, హోమం మొదలైన విధులన్నీ 'ఆత్మార్పణ' భావప్రకారాలే. ఇవన్నీ గౌరవింపదగినవే. ఇవి అన్నీ ఒకదానిపై ఒకటి పెంపుగా, ఒకదానికొకటి పోషకంగా సంపూర్ణతను చేకూర్చేవీ, చివరకు మహాశక్తి దర్శనానందానుభవానికి దారితీసేవీ, దారులు కలిపేవీ. ఈ మార్గమనుకున్నంత సులభం కాదు. దీనికి ముందుగా స్వచ్ఛమైన, మలినరహితమైన మనోరూపం అవసరం. ఇది లోపిస్తే యోగించదు. తరువాత తరువాత కాలంలో దీనికొక విశాలమయిన సమన్వయ ప్రాతిపదిక ఏర్పడింది.

శక్తికి సంబంధించిన విద్య 1. శైవదృక్పథము, వైష్ణవ విధానము కలిసిన అత్యుత్తమ రూపంగా గౌరవార్హతను పొందింది, ఆదరమూ పెరిగింది. శక్తి అనేది, శైవ–వైష్ణ భావధారల్ని కలుపుకొని తన అస్తిత్వంలో విశేషతను నిలుపుకొంది.

×××

మహాశక్తి వస్తువుగా కలిగిన ఈ కృతి రెండుభాగాలుగా ఉంది. 1. ఆనందలహరి (1–41) 'సమరస పరానంద' పరమయింది. కాబట్టి సార్థకమవుతుంది. 2. సౌందర్యలహరి (42–100). మొదటిభాగం ప్రధానంగా తత్త్వప్రపంచం కలిగింది. రెండోభాగం దేవి స్వరూపం. కిరీటం మొదలుకొని పాదాలవరకూ వర్ణితమయింది. రెండు భాగాల్లోనూ ఒక భాగంలోని విషయం మరోభాగంలోనూ అక్కడక్కడా చోటు చేసుకొంది. వస్తువు ఒకటే కావడం వల్ల ఆయా విషయాలు పరస్పర సంబంధం కలిగినవి కావడం వల్ల చోటు చేసుకున్నాయని అనుకోవచ్చు. ఈ కృతి సౌందర్యలహరిగానే ప్రశస్తిని పొందింది. ఈ కృతిలో అద్వైతభావనాపథంలో సర్వవ్యాప్తి అయిన ఆత్మ తత్త్వం దేవీస్వరూపపరంగా దర్శితమయింది.

**మనస్త్వం వ్యోమస్త్వం మరుదసి మరుత్సారథి రసి**
**త్వమాప స్త్వం భూమి స్త్వయి పరిణతాయాం నహి పరమ్।**
**త్వమేవ స్వాత్మానం పరిణమయితుం విశ్వవపుషా**
**చిదానందాకారం శివయువతి భావేన బిభృషే॥**

నీవు మనసు, నీవు ఆకాశం, నీవు గాలి, నీవు అగ్ని, నీవు నీరు, నీవు భూమి, సర్వమూ నీవే. నీయందు, పరిణమయం కాని వస్తువు లేదు. సర్వాన్నీ పరిణమింపజేయుటకు నీవు విశ్వరూపాన్ని ధరించావు. చిదానందాకారాన్ని శివయువతి భావంతో వహిస్తున్నావు. కాని అది మౌలికంగా శక్తి రూపం.

శాక్తేయంలో, శివశక్తుల సమానతను భావించే వారొకరూ, శివునికన్నా శక్తి ఆధిక్యాన్ని భావించే మరికొందరూ ఉన్నారు. ఇవి సందర్భాన్ని బట్టి ఏర్పడే రూపాలు మాత్రమే. ఇలాంటివి 'సౌందర్యలహరి'లో మూడునాలుగు చోట్ల కనిపిస్తాయి. ఇవి కల్పనా రమణీయాలు.

**త్వయా హృత్వా వామం పునరవరితృప్తేన మనసా**
**శరీరార్థం శంభోరవరసి శక్యేహృతమభూత్।**
**యదేదత్ త్వద్రూపం సకల మరుణాభం త్రినయనమ్**
**కుచాభ్యా మానమ్రం కుటిల శశిచూడాలమకుటమ్॥**

శివుని వామభాగాన్ని పొందిన శక్తిస్వరూపిణి దానితో పరితృప్తి చెందక, మిగతాభాగాన్ని కూడా ఆవహించాలనే భావనాకల్పన ఉత్ప్రేక్షితమయింది. సాయంసంధ్యారుణిమతో సమానమైన దేవిశరీరం భావితమై, ఆమె విశ్వరూప సమావిష్కారం చేత ఆధిక్యం ఏర్పడుతోంది. ఈ స్ఫూర్తి ఆ సందర్భానికి తగిన కల్పనాకమనీయంగా ఉంది. ఇందులోనూ సౌమయికం వేదమార్గాన్ని అనుసరించినదీ, కౌళం లౌకికమార్గాన్ని అనుసరించినదీ.

×××

'సౌందర్యలహరి'లో శ్రీవిద్యాతత్త్వవిషయం, కింద నున్న మూలాధారం నుండి కుండలినీశక్తిని మేల్కొలిపి, ప్రేరేపించి సాధనామార్గంలో పైనున్న సహస్రారం వరకు సరింపజేసే యోగప్రక్రియతో కూడింది. సహస్రారస్థానంలో శివునితో శక్తి కలుస్తుంది. అది పరమమైన ఆనందస్థితి. ఇది సమాధిలో ప్రాప్తమవుతుంది. సమాధి సడలగానే కిందికి దిగుతుంది. కుండలము అంటే గుండ్రంగా ఉందీ, చుట్టగా ఉందీ, వలయాకారాన్ని పొందిందీ అని అర్థం. దీన్ని సర్పాకృతితో పోల్చడం జరిగింది. సర్పంవలె సాగే గుణం కలిగింది కావడంవల్ల, ఈ శక్తి ప్రకృతికన్నా భిన్నమయింది, ఉన్నతమయింది. ప్రకృతి అనేది శక్తి యొక్క ప్రభావరూపం మాత్రమే. కుండలినీ శక్తి మూలాధారంలో సుప్తస్థితి నుండి, చీకటినుండి మేల్కొని వెలుగులోకి ప్రసరించడం, పయనించడం అనేదానికి ఒక క్రమం ఉంది. ఆ క్రమంలో స్థానాలే షట్ (ఆరు) చక్రాలు.

'సౌందర్యలహరి'లో ఉన్న క్రమాన్ని బట్టి,

1. మొదటిది మూలాధారం, మూలమైన ఆధారం కలిగింది. ఆరంభదశకు చెందింది. అన్నిటికన్నా క్రిందిది. భూమితత్వం కలిగింది. ఈ చక్రం నాలుగు రేకులు కలిగిన పద్మంతో విలసిస్తుంది.

2. రెండోది మణిపూరకం ('సౌందర్యలహరి'ని బట్టి), జలతత్త్వం కలిగింది. ఈ చక్రం పదిరేకులు కలిగిన పద్మంతో విలపిస్తుంది. ఈ రెండూ, అంటే మూలాధార, మణిపూరక స్థానాల క్షేత్రానికి బ్రహ్మగ్రంథి అని పేరు. గ్రంథి అంటే భౌతికమయిన చేతన యొక్క సీమ. తమోరూపం కలిగింది.

3. మూడోది స్వాధిష్ఠానం ('సౌందర్యలహరి' ననుసరించి), అగ్ని తత్త్వం కలిగింది. ఈ చక్రం ఆరురేకులు కలిగిన పద్మంతో విలసిస్తుంది.

ఈ రెండూ, అంటే స్వాధిష్ఠాన, అనాహత స్థానాల క్షేత్రానికి విష్ణుగ్రంథి అని పేరు. ఇది పగలు వెలుగునిచ్చేది, రాత్రి చీకటి కలిగేదీ, సూర్యక్షేత్రం.

5. ఐదోది విశుద్ధిచక్రం, ఆకాశతత్త్వం కలిగింది. ఇది పదహారు రేకులు కలిగిన పద్మంతో విలసిస్తుంది.

6. ఆరోది ఆజ్ఞాచక్రం. స్వచ్ఛమయిన ప్రకాశం కలిగిన చంద్రక్షేత్రం. రెండు రేకులు కలిగిన పద్మంతో విలసిస్తుంది. ఈ రెండూ, అంటే విశుద్ధి నుండి ఆజ్ఞాచక్రం వరకూ గల స్థానాల క్షేత్రానికి రుద్రగ్రంథి యనిపేరు.

ఆ పైన చివరిది సహస్రారచక్రం, వేయిరేకుల పద్మంతో విలసితమయింది. దీన్ని సౌదాఖ్యకళ అనీ అంటారు. ఇది ఆనంద నిలయం. శివశక్తుల కలయికతో పరమమయింది. ఇది జ్యోతిర్మండల క్షేత్రం.

కుండలిని అంటే, తత్త్వపరంగా, వ్యక్తిలో జీవశక్తి రూపం. మూలంలో చుట్టలు చుట్టుకొని సుప్తంగా, మందంగా చీకటిలో ఉన్న ఈ శక్తిని మేల్కొల్పి ఉత్సాహం కలిగించి వెలుగులోకి సరింపజేసి, శివనిలయమైన సహస్రారంలోకి ప్రవేశింపజేయడమొక సాధన చేతనే సాధ్యం. ఇది యోగవిద్యాగతమయింది. మూలాధారం నుండి సహస్రారం వరకూ కలిపేది వెన్నెముక. దీని ననుసరించి శక్తి ప్రసరిస్తుంది.

జీవశక్తి ప్రసారానికి పైకి మూడు మార్గాలున్నాయి. 1. ఇడ – వెన్నెముకకు కుడివైపున ఉంటుంది. 2. పింగళ – వెన్నెముకకు ఎడమవైపున ఉంటుంది. 3. సుషుమ్న – వెన్నెముకకు మధ్యనంటి ఉంటుంది.

ఇది శక్తిచేత పూరితమవుతుంది. మూలాధారంనుండి సహస్రారం వరకు తీసుకొని వెళ్ళుతుంది. ఇది సహస్రారంలో శివరూపంతో కలిసినపుడు, సాధకుడు పొందే ఆనందం మహనీయమయింది. ధ్యానం నుండి మొదలై, యోగం ద్వారా సాధ్యం. శక్తిస్వరూపిణి పాదాలనుండి సరించే అమృతం చేత సాధకుని శరీరంలో నాడులన్నీ స్నపితమై మహదానందం కలుగుతుంది.

**సుధాధారా సారై శ్చరణయుగళాంతర్విగళితైః**
**ప్రపంచం సిఞ్చన్తీ పునరపి రసామ్నాయ మహసః।**

పాదాంబుజ సుధాధారల చేత శరీరంలో వేలనాడులు (72 వేలు÷ పరిషిఞ్చితమై అలౌకికమైన పరమానందం కలుగుతుంది. సమాధిస్థితి తరువాత కుండలినీశక్తి క్రిందికి దిగుతుంది. యథాస్థితిని పొందుతుంది. భూతత్త్వంలోకి ప్రవేశిస్తుంది.

శివశ్శక్త్యా యుక్తోయది భవతి శక్తః ప్రభవితుమ్ – శివుడు శక్తితో కూడి ఉన్నపుడే విశ్వసృజనకు శక్తుడవుతాడు. శక్తిరూపం లేంది స్పందనకూ వీలుకాదు ఈ శక్తి మూడు విధాలుగా 1. ఇచ్ఛాశక్తి, 2. జ్ఞానశక్తి, 3. క్రియాశక్తితో కూడింది. శివశక్తులు వ్యవహారజగత్తుకు వేరుగా తోచవచ్చు. కాని తాత్త్వికంగా ఒకరే. చతుర్భిః శ్రీకంఠైః శివయువతిభిః పఞ్చభిరపి అని, నాలుగు శివత్రికోణారూపాల చేత, ఐదు శక్తిత్రికోణరూపాలచేత మంత్రపూతమయిందీ, యంత్ర రూపమయిందీ, తంత్రవిధానం కలిగిందీ శ్రీచక్రం. ఇది శివ శక్త్యాత్మకం. శ్రీచక్రంలో బిందువు, బైందవస్థానం, సుధాసిన్ధువు.

మంత్ర విషయంలో మూడు భాగాలుగా ప్రవర్తిత మయింది. మొదటిది క,ఈ,ఏ,ల / శివ(1), శక్తి(2), కామ(3), క్షితి(4) సంకేతాలు. రెండోది హ,స,క,హ,ల / రవి(1), శీతకిరణ(2), స్మర(3), హంస(4), శక్ర(5) సంకేతాలు. మూడోది సకల / పరా(1), మార(2), హరి(3) సంకేతాలు. వీటి చివర ఒక్కొక్కదానికీ హ్రీం చేర్చబడుతుంది. (మూడు

అక్షరాలవుతాయి) 4+5+3+3=15 అక్షరాలతో పంచదశాక్షరి అవుతుంది. వీటికి చివర శ్రీం (శ్రీ బీజం) చేరిస్తే షోడశాక్షరి అవుతుంది. ఈ పదహారు కళలూ సదాశివ నిత్యాలుగా పేర్కొనబడినాయి. చివరి అక్షరాన్ని చిత్కళ అంటారు. త్రిపుర సుందరియే సౌదాఖ్యకళ. ఇదొక మహాప్రపంచం.

'సౌందర్యలహరి'లో ఉన్న విషయం రేఖామాత్రంగా పరిచయం చేయబడింది. ఈ కృతితో శ్రీవిద్యాగతమయిన శారీరకశాస్త్రం, ఆధ్యాత్మికం, యోగశాస్త్రం – ఈ మూడింటి సమాకలనరూపం తాత్త్విక ప్రకాశంతో, కవిత్వరామణీయకతతో ఆకర్షిస్తుంది.

# (15) డెరెక్ వాల్కాట్
# సాహిత్యంలో నోబెల్ బహుమతి గ్రహీత

ఈ సంవత్సరం సాహిత్య ప్రపంచంలో నోబెల్ బహుమతిని వశం చేసుకున్న కవీ, నాటకకర్త డెరెక్ వాల్కాట్, వెస్ట్ ఇండియన్. నోబెల్ బహుమతిని ప్రకటిస్తూ స్వీడిష్ ఎడాడమీ ఆఫ్ లెటర్స్ వెస్ట్ ఇండియన్ల సాంస్కృతిక భూమిక ఆధారంగా ఇచ్చిన గుర్తింపు (సైటేషన్)గా ప్రకటితమైంది. "వాల్కాట్ సాహిత్య రచనల చేత తన సాంస్కృతిక వాతావరణానికి గతి రూపాన్ని స్థిరపరచాడు." ఇతనితో వెస్ట్ ఇండియన్ సంస్కృతి గొప్ప కవిని పొందింది." నోబెల్ బహుమతి అవార్డు 1.2 మిలియన్ల డాలర్ల నగదు ఈ డిసెంబరు పదోతేదీన వాల్కాట్‌కు ప్రధానం చేసారు.

డెరెక్ వాల్కాట్ 1930 సంవత్సరంలో కాస్టరీన్ పట్టణం – సెంట్‌టూషియాలో (లెనర్ ఆంటిలస్) జన్మించాడు. ఇపుడితని వయస్సు 62 సంవత్సరాలు. ప్రస్తుతం బోస్టన్ విశ్వవిద్యాలయంలో సృజనాత్మక రచనా విభాగంలో అధ్యాపకుడు. అమెరికాలో పనిచేస్తున్నా వెస్ట్ ఇండీస్‌ను మరచిపోలేదు. మధ్య మధ్య వస్తూ ట్రినిడాడ్‌లో బాధ్యతల్ని నిర్వహించడమూ జరుగుతూంది. ఇతడు కవిగా ప్రశస్తి కెక్కినా ఈతని సంపూర్ణ వ్యక్తిత్వంలో నాటక కర్త, చిత్రకారుడు, పత్రికా విలేఖరి పార్శ్వాలు దర్శనమిస్తాయి.

వాల్కాట్ తల్లిదండ్రులు అధ్యాపకులు. తండ్రి చిత్రకారుడు కూడా. వాల్కాట్ సంవత్సర ప్రాయంలోనే తండ్రి దివంగతుడైనాడు. సోదరుడు రెడరిక్ కూడా కవి. చిన్ననాటి జ్ఞాపకాల్ని చెబుతూ "తానూ, కవల సోదరుడూ, పెద్ద సోదరీ ఎన్నో పుస్తకాలు నిండుగా ఉన్న ఇంట్లో తల్లి శాసన సంరక్షణల్లో పెరిగి"నట్లు పేర్కొన్నాడు. ఈ వాతావరణం తల్లిపట్ల భయభక్తులు మంచి క్రమశిక్షణకు దారితీశాయి.

ఇతని సాహిత్య జీవితం నాలుగు దశాబ్దాలు పైగా ఆవరించింది. ముప్పై పైగా నాటకాలు, పన్నెండు కవితా సంకలనాలు వెలువడినాయి. మొదటి రచన "ఇరవై ఐదు కవితలు" పద్దెనిమిదో ఏట ప్రచురితమైంది. దీని ప్రచురణకై తల్లి వద్ద 200 డాలర్ల డబ్బు తీసుకొని అచ్చు వేశాడు. కవిత్వాన్ని ఆనందించే శక్తి చిన్నతనంలోనే ఇతడికి అలవడింది. పాఠశాల దశలోనే గొప్ప గొప్ప ఇంగ్లీషు కవుల కవిత్వం ఆకర్షించింది. వాళ్ళ భాష, శైలి, భావన, శిల్పం ముగ్ధుణ్ణి చేశాయి. తన దేశంలో వలస ప్రభుత్వానికి చిహ్నమైన ఇంగ్లీషు భాషే ఇతనిలో సజీవ భాషా శక్తిని ఉత్సహింపజేసింది. రచనకు ప్రేరణనిచ్చింది. ఈ అంతర్జాతీయ భాషే ఇతని ఆలోచనలు అనుభవాలు కళాత్మకంగా ప్రపంచానికి తెలియజేసింది.

ఆపైన పై చదువుల కోసం ఇంగ్లాండులో స్కాలర్‌షిప్‌కై చేసిన ప్రయత్నం సఫలం

కాలేదు. తన దేశంలోనే జమైకా విశ్వవిద్యాలయంలో స్కాలర్‌షిప్ లభించింది. అక్కడే ఫ్రెంచి, లాటిన్, స్పానిష్ భాషా సాహిత్యాలు అధ్యయనం చేశాడు. అప్పటికి రెండు కవితా సంపుటాలు వెలువడినాయి. అతని వయస్సు ముప్ఫై సంవత్సరాలు. మొదట్లో బి.ఐ.ఎమ్. సమితిలో ముఖ్యమైన సభ్యుడు. ఇందులో కరేబియన్ రచయితలు ఎడ్గార్ మిటిల్, హోల్డర్, జార్జ్‌లామింగ్ వి.ఎస్.నయపాల్ సభ్యులు. ఇది సాంస్కృతికమైన గుర్తింపునకు, సామాజిక సమస్యల గురించి ఆలోచనకూ, కొత్త దారుల అన్వేషణకూ, రాజకీయ చేతనకూ వేదిక అయింది. బి.ఐ.ఎమ్ పత్రిక ప్రచురణ 1942లో మొదలైంది. అది వెస్ట్ ఇండియన్ల సాహిత్య శక్తికీ, సామాజిక లక్ష్యానికీ దర్పణం. ఎన్ని అడ్డంకులెదురైనా అధిగమించి ఎంతో శ్రద్ధగా పనిచేసింది.

వాల్కాట్ ట్రినిడాడ్‌లో 'థియేటర్ వర్క్ షాప్' స్థాపించాడు. ఇతని నాటకాలు వెస్ట్ ఇండీస్‌లోను, లండన్‌లోను ప్రదర్శితమైనాయి. "ది డ్రీమ్ ఆన్ మన్కీ మౌంటెన్", "ది జోకర్ ఆఫ్ సెవిలె", "ఓ బాబిలోన్" మొదలైనవి బాగా ప్రఖ్యాతి చెందాయి. ఈయన నాటకాలు కరేబియన్ జీవితంలో చేదూ, తీపీ కలిపిన వాస్తవాలతో మలచబడిన వస్తువుతో సజీవమైన సంభాషణలతో ఆకర్షించేవి. ఇతని సాహిత్య ప్రస్థానంలో మైలు రాళ్ళు "ది సీ ఎట్ డాల్ఫిన్", "ది లాస్ట్ కార్నివాల్", "ది ఒడెస్సి", "ది ఆర్క్‌న్యాస్ టెస్ట్‌మెంట్" మొదలైనవి. కవితా సంకలనం "ఇన్ ఏ గ్రీన్ లైట్" కొత్త మార్గాన్ని సృష్టించింది. "ఎనదర్ లైఫ్" స్వయ చరిత్రాత్మక కవిత.

'ఒమెరోస్ (OMEROS) సుదీర్ఘమైన కవిత, మహాకావ్యం, ఇదో ఇతిహాసం. ఇది నోబెల్ బహుమతి కర్హమైందిగా ప్రశంసింపబడింది. మానవుని పై ఆశ, సాంస్కృతిక ప్రత్యయం, జీవితంపై ప్రేమ తన దేశం పట్ల అభిమాన ముద్రతో వెస్ట్ ఇండియన్ల జాతీయ భావనకు ఇది ఉత్సవ రూపం. మానవ బంధానికి కళాకృతి. జాతీయాభివ్యక్తితో కరేబియన్ వ్యక్తిత్వాన్ని సంపూర్ణంగా మూర్తి కట్టించేది. బహు భావనా జగంతో సూక్ష్మతలంపై మానవీయ రేఖల్ని స్పందించేది. దీన్ని గురించి ఒకచోట వాల్కాట్ "ప్రపంచంలో అన్ని జాతులు కరేబియన్‌లో ప్రాతినిధ్యం పొందాయి! ఐక్యతకు మహనీయమైన ఉదాహరణ కవకాశాన్ని ఇచ్చింది. ఇది అద్భుతం అనిపిస్తుంది. కాని నా ఉద్దేశం అదే!" "All the races of the world are represented in the arribian, giving a tremendous possibility of an example of unity. This stands pompous but I mean it" - Walcott.

ఈ మహాకావ్యంలో కరేబియన్ సంప్రదాయం జానపదం, చరిత్ర మూడింటి సమన్వయం ఉదాత్తంగా ఆవిష్కృతమైంది. 1990లో వెలుగు చూచిన 'ఓ మెరాస్' 325 పేజీల్లో సుదీర్ఘమైన జీవిత యాత్రా రూపం. ప్రధానమైన పాత్రలు ఇలియడ్ ఒడెస్సీ నుండి తీసుకున్న పేర్లతో, కరేబియన్ ప్రజల అనుభవాలతో కూడిన వస్తువులతో

సంపూర్ణమైన కవిత్వాకృతి పొందింది. సహజమైన లయగతితో పరిణతమైన రచనా రూపం.

"This island is full of sweet sands but why were there no voices" "ఈ ద్వీపం మధురమైన సికతాశ్రేణులతో పరిపూర్ణమైంది. అయితే ఇక్కడ స్వరాలు వినిపించవేం?" అని ప్రశ్నిస్తాడు. దీనికి సమాధానమే "ఓ మేరోస్".

వెస్ట్ ఇండిస్‌లో నెలకొన్న వలస ప్రపంచంలో వంశానుగతంగా వచ్చే బానిసత్వాన్ని నిరసించేదీ కవిత్వం. తాను నివసించే ప్రదేశం, ఇంగ్లీషు భాష, ఆఫ్రికా మూలభావం, మానవత – మానవుడూ గురించి నిబద్ధతను పొందింది. ఆఫ్రికన్, డచ్, ఇంగ్లీషు పూర్వజుల్ని తలపించే మిశ్రజాతికీ, గతం నుండి వచ్చే వలస ధోరణికి మధ్య సంఘర్షణనూ ప్రతిఫలిస్తుంది. వాల్కాట్ విషయంలో గ్రాండ్ మదర్స్ స్లావిక్, ఇరువైపుల తాతలు శ్వేత జాతి వారూ. ఈ సమన్వయ రూపం మానవ జాతి ఐక్య భావనకు బలాన్ని ఇచ్చింది. ఐతే వలస ప్రభుత్వం వల్ల కరేబియన్ జాతీయ చేతన నష్టమైంది. ఆ ప్రాంతం అభివృద్ధి లోపించింది. వ్యాపార ధోరణి ప్రబలింది. జాతి మౌలిక రూపం అదృశ్యమయ్యే స్థితి వాటిల్లింది. దీన్ని ఎదుర్కొనేందుకు విద్యావంతులూ మేధావులూ కృషి చేయడం మొదలు పెట్టారు.

ఈ పరిస్థితుల్లో సాహిత్య శక్తిని సమీకరించి జాతి వ్యక్తిత్వాన్ని నిర్మించే ప్రయత్నం జరిగింది. ఈ దశలో ప్రముఖ పాత్ర నిర్వహించాడు వాల్కాట్, చారిత్రకమైన ప్రాధాన్యం గల వ్యక్తిత్వంతో సమాజ దర్శనానికీ, సాహిత్యం ద్వారా సాధించిన విలువలకూ నోబెల్ పురస్కారం లభించింది.

బ్రిటిషేతర దేశాల్లో ఉన్నతమైన ఆదర్శాలతో, ఉత్తమమైన విలువలతో, సూక్ష్మమైన మనోభావ స్పందనతో ఇంగ్లీషు సాహిత్యాన్ని సంపన్నం చేసే రచనలనేకం ఇటీవల వస్తున్నాయి. భారతదేశంలోనూ విశేషంగా వ్యాసంగం జరుగుతూంది. వివిధ భారతీయ భాషల మధ్య సదవగాహనకూ తోడ్పడుతున్నాయి. ప్రపంచంలో ఏ భాషకూ లేని అంతర్జాతీయ లక్షణం కలిగిన ఇంగ్లీషు భాష మార్పులకు గురి కావడం సహజం. వాల్కాట్ స్ఫుటంగా ఇలా అంటాడు "The English I speak is standard to me". ఈ ఒక్క వాక్యం చాలు! అతనిలో నెలకొన్న ఆత్మ విశ్వాసం నిరూపించేందుకు! వాల్కాట్ సృజనాత్మక శక్తిలో స్వసంస్కృతి పట్ల అభిమానం అవ్యక్త చేతనలో వేళ్లూని నిలిచింది. దీనికో ఉదాహరణ "వైట్ మాజిక్" అన్న కవితలో ఇలా అంటాడు "మా పురాణ గాథలు అజ్ఞానం, వాళ్ళవి (తెల్లజాతి) సాహిత్యం! "Our myths are ignorance their's are Literature" అని ఆక్షేపిస్తాడు. మరోచోట "నీ పూర్వీకులకు సంబంధించింది ప్రతిదీ జీర్ణం చేసుకోవడంలోనే పరిణతి ఉంది" అంటాడు. "Maturity consists of assimilating every of your ancesstors". ఈ ధోరణి ఒక

దశ వరకే. ఆ పైన విశ్వభావనకూ ఐక్యతకూ దారి చూపడం ఇతనిలో ప్రత్యేకత. You cannot be a poet and believe in division of man" అంటాడు. స్వసంస్కృతిపై అభిమానం మరియు విశ్వభావనతో కవి లక్ష్యాన్ని విశ్వభావనోన్ముఖంగా తీర్చడం 'ఒమెరాన్' మహాకావ్యంలో స్ఫుటంగా కన్పిస్తుంది.

అమానవీయమైన వలస విధానం, శిథిలమౌతూన్న కరేబియన్ విలువల కారణంగా సరియైన అవసరమైన సాహిత్య సాంస్కృతిక వాతావరణం పట్ల అభిలాష కలగడం సహజం. ఒకవైపు జాత్యభిమానం, వర్ణభేదం, దారిద్ర్యంలో, మరోవైపు చర్చి, మత గురువుల మధ్య ఎదిగి, ఆఫ్రికా వారసత్వంతో సంస్కృతీ మూలం పట్ల గౌరవంతో, మానవానురాగంతో, పరివర్తన భావంతో వాల్కాట్ కొత్తదిశను చూపాడు. దీనికితడు నిర్మాత అయ్యాడు. ఇది ఈతని సాహిత్య వ్యక్తిత్వానికి నేపథ్యంగా ఉపయోగపడింది. మరో ఆశ్చర్యకరమైన విషయమేమంటే వెస్ట్ ఇండియన్ల సాహిత్య చరిత్ర, ఇంచుమించు ఒక అర్థ శతాబ్ధికి మాత్రమే చెందింది. దీన్ని బట్టి వాల్కాట్ సాహిత్యకృషి ఎంత అసాధారణమైందో స్పష్టం.

శైశవంలో కరేబియన్ అనుభవ సాంద్రత ఇతనిలో కవితా శక్తిని మేల్కొల్పింది. ఇక్కడి ద్వీపాలు! సముద్రం! గొప్ప ప్రకృతి స్థలాలు! తీరప్రాంతాలు! ఇతనిలో ప్రాథమిక మనోభావాలకు పునాది వేశాయి. వివిధ తలాల్లో ఈతని వ్యక్తిత్వంపై మహనీయమైన ప్రభావాన్ని నెరపాయి. ఈ అంశాన్ని స్వీడిష్ ఎడాడమీ గుర్తించింది కూడా. అగ్ని పర్వతాల ద్వీపాల మధ్య ఇతని అనుభవం ఏకాంతమైన ఆలోచన ఎంతో విస్తృతమైందీ, పరిణతిని పొందిన మనోరూపంతో "సముద్ర తరంగాల చేత ప్రపంచ దర్శనం పొందా"నంటాడు. ఇతని కవిత్వంలో ప్రకృతి రూపం ప్రతీకాత్మకతను పొందింది.

స్వీడిష్ విద్యావంతులు ప్రచురణ కర్తలు, సంపాదకులు వాల్కాట్‌లో నోబెల్ బహుమతి పొందడానికి అర్హతగల అగ్రశ్రేణి వ్యక్తిత్వాన్ని ముందుగానే ఊహించారు. యేల్ విశ్వవిద్యాలయంలో అధ్యాపకుడు, రచయిత, సాహిత్య విమర్శకుడు హెరాల్డ్ బ్లూమ్ ఇంటర్వ్యూలో ఇలా అంటాడు. "Mr. Wallcott certainly merits the prize on the bais of Poetic accomplishment and as a representative figure in terms of English languge Poetry that has come out of the West Indies" - New York Times.

డెరెక్ వాల్కాట్‌కు నోబెల్ బహుమతి ప్రధానం చేసే ఎడాడమీ నిర్ణయాన్ని ప్రపంచ సాహిత్యం తీరుతెన్నులతో పరిచయమున్న విజ్ఞులంతా హర్షించారు. ఉత్సాహంతో స్వాగతం పలికారు.

# (16) అంతరంగం

ఆచార్య మాదిరాజు రంగారావు ప్రముఖ కవి, విమర్శకులు, కాకతీయ విశ్వవిద్యాలయంలో తెలుగు శాఖాధ్యక్షులుగా పనిచేసిన మాదిరాజు వచన కవిత్వంపై విశేషమైన కృషి చేశారు. వచన కవిత్వాన్ని స్వేచ్ఛా కవిత్వంగా పిలుస్తూ, చర్చకి అవకాశం కల్పిస్తూ యు.జి.సి. వారి ఫెలోషిప్‌తో స్వేచ్ఛా కవిత్వంపై విస్తృతమైన పరిశోధన చేస్తున్నారు. ఇప్పటికి దాదాపు ఏభై గ్రంథాలు ప్రచురించిన ఈ సాహితీ తపనుడితో కాసేపు:

**వచన కవిత్వాన్ని మీరు స్వేచ్ఛా కవిత్వం అని ఎందుకంటున్నారు? ఈ పేరు ప్రాచుర్యం పొందలేదు కదా?**

తనదైన విధంగా అంటే కవి వ్యక్తిత్వాన్ని బట్టి, స్థితి ననుసరించి ఏ నియమ నిబంధనల ప్రమేయం లేకుండా రాసేది స్వాచ్ఛా కవిత్వ (స్వ+ఇచ్ఛా) దీనికి పరంపరాగతమైన, నిర్దిష్టమైన నమూనా కాని, ఛందస్సు కాని లేదు. కవి ఆలోచన, అభిప్రాయం, సందర్భం అవసరాన్ని బట్టి ఎప్పటికప్పుడు అంతర్గతమైన అభివ్యక్తి ప్రత్యేకతలతో ఆవిష్కృతమవుతుంది. దీన్ని నిర్మాణ స్వేచ్ఛ అనవచ్చు. ప్రజాస్వామ్యంలో స్వేచ్ఛ కీలకమైన అంశాల్లో ముఖ్యమైంది. సాహిత్య చరిత్రలో స్వాతంత్ర్యానంతర కాలాన్ని 'స్వేచ్ఛా యుగం' అనడం సమంజసం. స్వేచ్ఛా కవిత్వంలో ఈ స్వేచ్ఛ సంపూర్ణంగా ప్రతిబింబిస్తుంది. స్వేచ్ఛా కవిత్వం ఆధునికతకు సాధనంగా పరిణమించింది. ప్రజాస్వామ్యంలో స్వేచ్ఛ కారణంగా తెలుగు కవిత్వంలో ఎన్నో సిద్ధాంతాలకూ, దృక్పథాలకూ, అభిప్రాయాలకూ అవకాశం హెచ్చింది. వైవిధ్యం చేకూరింది. ఈనాడు మార్పుకు సంబంధించిన అంశాలు మునుముందుగా అనుభూతి గాఢత్వం, అభివ్యక్తి నైశిత్యం, లేదా విశిష్టలతో నిర్మాణ సౌలభ్యం ఉన్న స్వేచ్ఛా కవిత్వంలోనే ఆవిష్కృతమవుతున్నాయి. దీనికి మూలం స్వేచ్ఛను కోరే మనోరూపమే.

రెండవ అంశం - ఈ పేరు ప్రాచుర్యం గురించి. ప్రాచుర్యం పొందకపోవడం అనేది ఒక పేరు అవసరాన్ని సామంజస్యాన్ని, శక్తినీ తక్కువ చేయదు. దీనిపై సహేతుకమైన చర్చ జరగవలసి ఉంది. కవిత్వానికి అవసరమైన వచనేతర శక్తిని భాసింపజేసేది 'స్వేచ్ఛా కవిత్వం'. ఇది క్రమంగా వచన కవిత్వం స్థానంలో విస్తృతమైన ప్రయోజన గుణం చేత స్వీకరింపబడుతుందనే నా అభిప్రాయం.

**వచన కవిత్వం, స్వేచ్ఛా కవిత్వం రెండూ ఒకటి కాదా?**

రెండూ ఒకటి కాదు. వచన కవిత్వం అనేమాట పరిమితమైన పరిధి కలిగింది. స్వేచ్ఛా కవిత్వమన్నమాట "ప్రజాస్వామ్య భావనా కేంద్రంగా బహు విస్తృతమైన అవకాశం

కలిగింది. 'వచన'మన్న మాట సంకుచితమైన అర్థాన్ని, 'స్వేచ్ఛ' అనే మాట విశాలమైన భావాన్నీ స్ఫురింపజేస్తాయి. ఇకపోతే వచన కవిత్వమన్న మాట నిస్సారంగా పేలవంగా ఉంది. కవిత్వం ససారమైంది. శక్తి సంభృతమైంది. వచనమన్న మాట కవిత్వానికి అవసరమైన గాఢత్వానికీ సీరియస్‌నెస్‌కూ దూరంగా ఉంది. విరోధాభాసను తలపిస్తోంది. వచన అన్న మాటలో ఔచిత్యం లేదు. అందువల్ల 'స్వేచ్ఛ' అన్నమాటను చేర్చడం సముచితం. వచనంలోను కవిత్వం ఉండవచ్చునన్న వాదం ఈ సందర్భంలో సరియైనది కాదు. ఒక్కమాటలో చెబితే సమాజంలో ప్రజాస్వామ్య వ్యవస్థ వల్ల సిద్ధించిన స్వేచ్ఛావకాశాన్ని స్వేచ్ఛా కవిత్వమన్నమాట సంపూర్ణంగా బింబిస్తుంది.

**కవికి కమిట్‌మెంట్ ఉండాలా? మీరు దేనికి కమిటెడ్?**

కమిట్‌మెంట్ ఉంటే ఒక విశ్వాసానికీ, అభిప్రాయానికీ, సిద్ధాంతానికీ, చర్యకూ కట్టుబడి ఉండడమన్న మాట. అయితే ప్రతి కవికీ నిబద్ధత ఉంటుంది. దేనిపై? అన్నది వేరే విషయం. నా విషయానికి వస్తే నేను ప్రజాస్వామ్యానికి నిబద్ధుణ్ణి. స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయం మొదలైనవి ప్రజాస్వామ్యంలో శాంతియుతమైన పాత్రను నిర్వహించేది స్పష్టం. సాహిత్యంలో కమిట్‌మెంట్ రెండు విధాలుగా ఉంది.

1. బహిరాశ్రమమైంది. కవి దృష్టిలో వ్యవహార ప్రపంచానికీ భౌతికావసరాలకూ సంబంధించింది.

2. అంతరాశ్రమమైంది. కవి రచనలో జీవిత దర్శనానికీ వ్యక్తిలో ఉన్నతమయిన విలువలకూ సంబంధించింది. రెండింటికీ ట్రాన్స్‌ఫరెన్సీ ఉంటుంది. ఇవి రచనలో భిన్న భిన్న నిష్పత్తుల్లో సమకూరుతాయి. ఈ నిష్పత్తుల్లో ఏర్పడిన సమాహార రూపం కమిట్‌మెంట్ విధానాన్ని భావింపజేస్తుంది. నిబద్ధత ఎంత గాఢంగా తీవ్రంగా ఉంటే రచన అంత ప్రత్యేకతను పొందుతుంది. సృజనశక్తి చేత నిబద్ధత కంట్రోల్ చేయబడాలి. అప్పుడే సాహిత్యపరమైన విలువలు సమకూరుతాయి.

**ఇప్పటివరకూ మీరు నలభై కవితా సంపుటాలు, ఏడు విమర్శ గ్రంథాలు ప్రచురించారు. సాహిత్యంలో మీ కృషికి తగిన గుర్తింపు వచ్చిందంటారా? అవార్డులపై మీ అభిప్రాయం?**

'గుర్తింపు' అంటే స్వేచ్ఛా కవిత్వంలో ప్రత్యేకతను గురించి ఆలోచన మునుముందు తప్పకుండా జరుగుతుందనే నా నమ్మకం. ఒక తరం తరువాత వచ్చే తరాలు వస్తుపరంగానే దృష్టిని కేంద్రీకరించడం మన అనుభవంలో ఉన్నదే.

ఇక ప్రచారమనేది అవసరమే. ప్రచారమంటే నా దృష్టిలో పదిమందికీ తెలియడం అనేది. ఇది ఎన్నో అంశాలపై ఆధారపడింది. ఒకరి విషయంలో ఒక సందర్భంలో పనిచేసినవి, మరొకరి విషయంలో మరో సందర్భంలో పనిచేయకపోవచ్చు. దీనికి

వ్యవహారశైలి (అంటే ఉన్న పరిస్థితుల్ని ఉపయోగించుకోవడం, అనుకూల పరిస్థితుల్ని సృష్టించుకోవడం, అవసరాన్ని బట్టి ధనవినిమయం) సమూహ సంఘటన శక్తీ, ప్రచార సాధనాలపై పట్టు, ఇలా ఎన్నో పనిచేయడం జరుగుతుంది. వీటిని నిర్వహించే కళ కూడా అవసరం.

అవార్డు వస్తే మంచిదే. రాకపోయినంత మాత్రాన సాహిత్య వ్యక్తిత్వానికి తరుగు లేదు. ఏ సమయంలోనైనా ఒక్కరికే అవార్డు వస్తుంది. పదిమంది ఆశిస్తారు. అవార్డు ఒక రచయితకు వచ్చాక అభినందించడం చాలా అవసరం. ఎందుకంటే అవార్డు వచ్చాక రచయిత సాహిత్యాన్ని గౌరవించడమన్న మాటే. ఇది మంచి సాహిత్య సంస్కృతికి దారితీస్తుంది.

**నేటి విమర్శ ఎలా ఉంది? కమిటెడ్ విమర్శ లాభమేనా?**

కవీ విమర్శకుడూ వేరు కాదు. కవి అంతరంగ దర్శకుడు, విమర్శకుడు. కాబట్టి విమర్శకునిలో దర్శనశక్తి లేదా కాంతి ఏ అల్పమైన వాటిచేతనూ కప్పబడిపోకూడదు. నేటి సమాజంలోని సామాజిక రాజకీయ స్థితి బింబమే విమర్శలోనూ కనిపిస్తుంది. తెలుగు సాహిత్య విమర్శలో స్ట్రాటజిక్ విమర్శకులూ, ఫ్రాక్షనల్ విమర్శకులూ ఎక్కువయ్యారు. అధ్యయన సమన్వయ విమర్శకులు తక్కువ. దర్శన విమర్శకులు మరీ తక్కువ. స్ట్రాటజిక్ (విమర్శ, ఫ్రాక్షనల్ విమర్శ రెండూ ఒకే నాణెం రెండు వైపులుగా పనిచేస్తున్నాయి.

కమిటెడ్ అంటే నిబద్ధత – అనుకుంటే ఒక సిద్ధాంతం, అభిప్రాయం, దృక్పథంపై కట్టుబడిన వెలుగులో రచనను దర్శించడంలో తప్పులేదు. కానీ ఇది కిటికీలు, తలుపులూ మూసిన స్థితి కారాదు. నిబద్ధత వల్ల పరిశీలనలో కొత్త విషయాలపై సూక్ష్మాంశాలపై దృష్టిపడే అవకాశం ఉంది.

**ఇటీవల ప్రాంతీయత సాహిత్యంలో చోటు చేసుకుంటోంది గదా! ఇది వైవిధ్యానికి సంకేతమా? ప్రాంతీయాభిమానాలకా?**

ప్రాంతీయత అనివార్యం. కొన్ని హద్దుల్లో అభిలషణీయమే కూడా. కొన్ని సమయాల్లో, సందర్భాల్లో సామాజిక రాజకీయ కారణాల వల్ల విపరీత స్థితుల్ని పొందుతుంది. ఆయా సందర్భాల్లో సాహిత్యంలో (దేశి మొదలుగా) ఉద్భవించి తెలుగు సాహిత్యానికి వైవిధ్యాన్ని చేకూర్చాయి కూడా. ప్రాంతీయాభిమానం ఇప్పటిది కాదు. ఎప్పటిదో! ఎప్పటికీ ఉండేదే. కాస్త ఉదారత, సమానత, సమన్వయభావంతో సాహిత్యంలో ప్రాంతీయ దురభిమానాన్ని జయించవచ్చు. తెలుగు భాషా సాహిత్యాల్ని ఖండఖండంగా కాక సంపూర్ణంగా దర్శించడంలోనే ఆనందం ఉంది. ఉపయోగ విస్తృతి ఉంది.

**హైకూ కవిత్వంపై మీ అభిప్రాయం?**

హైకూ కవిత్వంలో ఒక విశిష్టమైన కవితాబింబం, మూలం ఎక్కడిదైనా సంక్షిప్తత, గుప్తతతో పాటు జీవితమూ ప్రకృతీ తాత్త్వికం భూమికలతో ఆకర్షణీయమైన సంగ్రహ కళారూపం. ఇది తెలుగు కవిత్వానికి శోభనిస్తుంది.

**ఇటీవలి కవితావాదాలపై మీ స్పందన?**

ఈ వాదాలన్నీ కవిత్వంలో చారిత్రక నేపథ్యంలో సామాజికావసరాల్ని బట్టి అవతరిస్తాయి. అయితే వీటిలో సృజనశక్తి ఉంటే ప్రయోజన గుణంలో ఔన్నత్యం ఉంటే నిలుస్తాయి. వీటిని దేనికది ప్రత్యేకంగా సమాలోచన జరపాలి తప్ప, ఒకే త్రాటిపై చేర్చి చూడకూడదు.

**తెలుగులో పరిశోధన ఎలా సాగుతోందంటారు?**

తెలుగులో పరిశోధన బేసిక్ విషయాలపై కాక ప్రత్యేకాంశాలపై జరగవలసి ఉంది. పూర్వం ఒక విషయంపై సాధారణ స్థాయిలో మెటీరియల్ దొరికేది కాదు. ఇప్పుడు ఎంతో లభిస్తోంది. అభిలాషతోనైతేనేం, డిగ్రీ కోసమైతేనేం, పదోన్నతి కోసమైతేనేం విశ్వవిద్యాలయాల్లో జరుగుతున్న పరిశోధనల్లో కాలం పరీక్షకు నిలిచినవీ ఉన్నాయి.

ఇప్పుడు జరుగుతున్న పరిశోధనలో సమాజమూ ఇతర క్షేత్రాలలో లాగానే 'మంచి నిర్దేశకత్వం', 'విలువలూ', 'అభిలాష' మాత్రమే కాక, నిబద్ధత 'తత్పరత' అవసరం. ఇది మంచి పరిశోధనా సంస్కృతికి దారి తీస్తుంది.

ఇంటర్వ్యూ : **డాక్టర్ ద్వా. నా. శాస్త్రి**

(ఆంధ్రప్రభ - ఆదివారం, 21-అక్టోబర్, 2001)